

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

12-3-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 40 పేజీలు: 8+4 వెల: 6.50


గల్ఫ్ భారతీయుల్ని వెనక్కి తెస్తాం: ప్రధాని

5లో

ఇరాన్ సుప్రీం లీడర్ ఆచూకీ ఎక్కడ?



## కేంద్ర మాజీ మంత్రి కావూరి కన్నుమూత

కేంద్రమంత్రిగా, ఐదుసార్లు ఎంపిగా సుదీర్ఘ రాజకీయ చరిత్ర

బ్రెయిన్‌స్ట్రోక్‌తో కొద్దిరోజులుగా చికిత్స

నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర మాజీ మంత్రి, బిజెపి నాయకుడు కావూరు సాంబశివరావు (82) కన్నుమూశారు. హైదరాబాదలోని స్టార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కావూరు సాంబశివరావు బుధవారం తుదిశ్వాస విడిచారు. ఈ నెల 7న హైదరాబాద్‌లోని స్వగృహంలో కావూరికి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. వెంటిలేటర్ సాయంతో చికిత్స అందిస్తున్నామని, పరిస్థితి విషమంగా ఉందని వైద్యవర్గాలు అప్పుడే తెలిపాయి. ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తాజాగా వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తారు. రాజకీయ కురువృద్ధుడు కావూరి సాంబశివరావు ప్రజాప్రతినిధిగా సుదీర్ఘకాలం సేవలు అందించారు. కృష్ణా జిల్లా పెదపారుపూడి మండలం దోసపాడుగ్రామంలో 1943లో సాంబశివరావు జన్మించారు. గుడివాడలోని ఏఎన్ఆర్‌కళాశాలలో పీయూసీ వరకు చదువుకున్నారు. వరంగల్ ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు పుష్కలంగా సాంబశివరావులో ఉండేవి. చదువుకునే రోజుల్లో విద్యార్థి సంఘం నాయకుడిగా పని చేశారు. ఆ తర్వాత నిర్మాణ >>2

# రేపు 'సుఖీభవ' మూడో విడత

ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు

దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం

అధికారుల ఫీల్డ్ విజిట్లపై ప్రత్యేక పోర్టల్

జిల్లా కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు



బుధవారం జిల్లా కలెక్టర్ల సమావేశంలో వివిధ అంశాలపై అధికారులతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**విజయవాడ,మార్చి 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పాలనలో సాంకేతికతను మరింత తీసుకువచ్చేలా కార్యాచరణ చేపట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 6వ జిల్లా కలెక్టర్ల సదస్సు ప్రారంభం అయింది. కలెక్టర్ల సమావేశానికి హాజరైన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లు. తొలి రోజు కలెక్టర్ల సమావేశంలో స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాలు, పది సూత్రాలు, స్వచ్ఛాంధ్ర, జీఎస్డీపీ లక్ష్యాలు, జిల్లాల్లో విజయవంతమైన కార్యక్రమాలపై సమీక్ష. పీపీపీ ప్రాజెక్టులు, ఆర్టీజీఎస్, సుపరిపాలనలో సాంకేతికత, పెట్టుబడులు, వైద్యారోగ్యం, సూపర్ సిక్స్ పథకాలపై సమావేశంలక్ష చర్చజరిగింది. ఆయా శాఖలపై సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని ముందుకు వెళ్తున్నా మన్నారు. ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నామన్నారు. గతంలో కార్యాలయాల్లో కూర్చుని ఫైల్స్ రాసే పరిస్థితి నుంచి వర్చువల్ పని విధానాన్ని తీసుకువచ్చామన్నారు. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకువచ్చా మన్నారు, ప్రభుత్వం తీసుకువచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి అన్నారు. వీటి అమలులో ఉదాసీనత వద్దు. 2047 స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా తీసుకువచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించేందుకు వీలవుతుంది అన్నారు. నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలి. ఈ నెల 13 తేదీన అన్నదాత సుఖీభవ పథకాన్ని మూడో విడత అమలు చేస్తున్నాం..కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్ము వేస్తుంది అన్నారు. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సమర్థంగా తీసు కెళ్లాం, ఖరీఫ్ సాగు కోసం మే 15 తేదీన నీటిని విడుదల చేస్తున్నాం. సీజన్లో ముందుగానే నీరు ఇస్తామని తెలిపారు. ఉగాది కానుకగా 2.50 లక్షల లబ్ధిదారులకు సామూహిక గృహప్రవేశాలు చేయిస్తా >>2

## విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం

- సిఎం చంద్రబాబు

**విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాబోయే రోజుల్లో విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. కలెక్టర్లకు వివిధ అంశాలపై లక్ష్యాలను సీఎం నిర్దేశించారు. సంక్షేమం అభివృద్ధిపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అధికారుల-ప్రజాప్రతినిధులు కార్యక్రమాలపై సీఎం కార్యాచరణ ప్రకటించారు. గడిచిన 20 నెలల్లో కీలకమైన పాలనా వెళ్లింది. అధికారులు, ప్రజలు అందరూ భాగస్వామ్యమై, శాఖలమధ్య అనుసంధానం సమన్వయంతో విజయవంతంగా చేపట్టారు.

**రాష్ట్రమంతటా జలధార:** అన్నమయ్య జిల్లా చేపట్టిన జలధార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు >>2



## ఓం బిర్లాపై వీగిన అవిశ్వాసం

మూజువాణి ఓటుతో తిరస్కరణ

**న్యూఢిల్లీ, మార్చి 11:** లోక్‌సభ స్పీకర్‌పై కాంగ్రెస్ ప్రతిపాదించిన అవిశ్వాసం వీగిపోయింది. మూజువాణి ఓటుతో తీర్మానం తిరస్కరణకు గురైంది. స్పీకర్ ఓం బిర్లాపై కాంగ్రెస్ ప్రతిపాదించిన తీర్మానంపై మంగళవారం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చర్చను ప్రారంభించగా, బుధవారం కూడా కొనసాగింది. దాదాపు 10గంటలకు పైగా సాగిన చర్చ సాగింది. అవిశ్వాస తీర్మానంపై చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతోపాటు అన్ని పార్టీల నేతలకూ అవకాశం కల్పించారు. స్పీకర్ పక్షపాతం వ్యవహరిస్తున్నారని, అధికార పక్షానికి వంతుపాడుతున్నారని కాంగ్రెస్, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ సహా ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేతకు మాట్లాడే అవకాశం కూడా కల్పించడం లేదని విపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను అధికార పక్ష సభ్యులు తిప్పికొట్టారు. స్పీకర్ అందరివాడని, పార్టీలతో సంబంధం లేదని స్పష్టం చేశారు. అలాగే, స్పీకర్ ఎన్నిక ప్రక్రియ ప్రతిపక్ష పార్టీల నేతల ప్రమేయం కూడా ఉందని కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు తదితరులంతా గుర్తుచేస్తూ, విపక్షాల ఆరోపణలను ఖండించారు. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ చర్చలో పాల్గొంటూ, స్పీకర్‌పై తమకెలాంటి అభిప్రాయం లేదని, అయితే, అధికార పక్షం ఒత్తిడి ఆయనపై ఉందని, అందుకే ప్రతిపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించడం లేదని పేర్కొన్నారు. స్పీకర్‌పై ప్రతిపాదించిన అవిశ్వాసం తీర్మానంపై చర్చకు హోంమంత్రి అమిత్ షా సమాధానమిచ్చారు. స్పీకర్ సమగ్రత గురించి ప్రశ్నలు లేవనెత్తడం దేశ ప్రజాస్వామ్య సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తుందని ప్రతిపక్షాల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. సుదీర్ఘ ఘర్షణకు కారణమయ్యే అసాధారణ సంఘటన ఏదీ లేదని, అయినప్పటికీ వివరణాత్మక చర్చ ఇప్పటికేజరిగిందని అమిత్ షా అన్నారు. "అసాధారణ సంఘటన ఏదీ జరగలేదు, అయిన ప్పటికీ 10 గంటల చర్చ షెడ్యూల్ చేయబడింది.

చర్చకు సమాధానమిచ్చిన అమిత్ షా

విపక్ష నేతకు మాట్లాడే అవకాశమివ్వలేదు: రాహుల్

## ఆందోళన వద్దు..



అసత్యప్రచారాలు నమ్మకండి: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ. మార్చి 11. ప్రభాతవార్తప్రతినిధి:** గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రొయ్యల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ కో వైస్ ఛైర్మన్, నాన్‌ఆఫీషియల్ కమిటీ సభ్యులు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియా లో వచ్చిన వార్తలు, మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మన దేశ సముద్ర ఆహార ఎగుమతులపై చూపే ప్రభావం గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాటాడుతూ మధ్యప్రాచ్య (గల్ఫ్) ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా మీడియాలో వచ్చిన వార్తల వల్ల కొంతమంది ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఎగుమతులపై ప్రభావం ఉంటుందనే భయంతో ముందస్తు లేదా పానిక్ హార్వెస్టింగ్ చేయడం సరికాదని రైతులకు సూచించారు. భారతదేశం నుండి జరిగే మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లేది కేవలం 3,4 శాతం మాత్రమేనని, అది కూడా ప్రధానంగా హోర్ముజ్ జలసంధి ద్వారా జరుగుతుందని తెలిపారు. ఇతర దేశాలకు యూరోపియన్ యూనియన్ (నిగీ), అమెరికా (గిలీతి), జపాన్, చైనా వంటి దేశాలకు వెళ్లే సముద్ర ఆహార కంటైనర్లు రెడ్ సీ సూయెజ్ కాలువ మార్గం, కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గం, చైనా సముద్ర మార్గం ద్వారా నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులు భారతదేశ సముద్ర ఆహార >>2

# ప్రజల ఆకాంక్షే 'మనమిత్ర'కు ప్రేరణ

యువగళం పాదయాత్రలో వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన

రియల్ టైం గవర్నెన్స్ వల్లే ఈజీగా అమలు చేస్తున్నాం: మంత్రి లోకేష్

**విజయవాడ,మార్చి11, ప్రభాతవార్తప్రతినిధి:** యువగళం పాదయాత్ర సమయంలో రాష్ట్ర ప్రజలు వ్యక్తం చేసిన ఆకాంక్షే మనమిత్ర వాట్సాప్ సేవలకు ప్రేరణ అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మెటా ఆధ్వర్యాన వాట్సప్ సిటిజన్ ఎంగేజ్మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫోరమ్ ఆధ్వర్యాన జరిగిన న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మెటా వైస్ ప్రెసిడెంట్ ఇండియా, సౌత్‌ఈస్ట్ ఆసియా హెడ్ సంధ్యా దేవనాథన్ సంధానకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ పౌరసమాజ విశ్వాసానికి కేంద్రంగా మనమిత్ర సేవలు ఉండాలన్న మాటలు అధికార యంత్రాంగం ఆలోచన విధానాన్ని మార్చిందని తెలిపారు. ఫైర్ సైడ్ చాట్ లో సంధ్యా దేవనాథన్ అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సూటిగా సమాధానమిచ్చారు. బహుశా మీకు పౌర సేవల లభ్యత గురించి తెలిసి ఉండవచ్చు. అసలు ఈ ఆలోచన మీకు మొదట ఎలా వచ్చిందో చెప్పగలరా ఎందుకంటే ఇది చాలా పరివర్తనాత్మకమైనది మేము కొన్ని పైలట్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాం వాటితో పోలిస్తే ఇది విభిన్నమైంది అంటూ సంధ్యా దేవనాథన్ ప్రశ్నించగా యువగళం పాదయాత్ర చేస్తున్నప్పుడు తనకు వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన వచ్చిందని చెప్పారు. ఒక బటన్ నొక్కితే కిరాణా సరుకులు వస్తున్నాయి, టాక్సీ వస్తోంది, సినిమా చూడగలుగుతున్నామన్నారు. మరి పౌరసేవలను అందించడంలో ప్రభుత్వం ఎందుకు చురుకుగా వ్యవహరించడంలేదు? అని పాదయాత్ర సమయంలో ప్రజలు నన్ను అడిగారు. పౌరసేవలను సులభతరం చేసి ఈజ్ ఆఫ్ లివింగ్ కల్పిస్తామని అప్పట్లో ప్రజలకు వాగ్దానం చేశాను. పౌర సేవలన్నింటినీ ఒకే ప్లాట్‌ఫారమ్, ఒకే ఫోన్ నంబర్‌పైకి తీసుకువస్తామని ఎన్నికల సమయంలో కూడా చెప్పాను. భారతదేశంలో ప్రతి ఒక్కరూ వాట్సాప్‌పై ఆసక్తిగా ఉన్నారని నేను గ్రహించాను,





కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేం మెటా సంస్థను సంప్రదించాము. ఈ ప్రాజెక్ట్‌ను ఎపిలో మేం 60 రోజుల్లో పూర్తి చేయడానికి అంగీకరించాము. కానీ ప్రారంభించడానికి 90 రోజులు పట్టింది. ఆంధ్రప్రదేశ్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో 160 సేవలతో ప్రారంభించాము, ఇప్పుడు వివిధ విభాగాలలో దాదాపు 900 పౌర సేవలు అందుబాటులో ఉన్నాయి. సాంప్రదాయ సేవా విధానం నుండి డిజిటల్ >>2

## 4 వారాల్లో విచారణ ముగించాలి



ట్రయల్ కోర్టుకు సుప్రీం ఆదేశం

వివేకా హత్యకేసు దర్యాప్తు ముగిసిందన్న సిబిఐ

**విజయవాడ,మార్చి11, ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసుపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. కడప వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డితో పాటు మిగతా వారి బెయిల్ రద్దు చేయాలంటూ వివేకా కుమార్తె సునీత దాఖలు చేసిన పిటీషన్లను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. మూడో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేసినట్లు న్యాయస్థానానికి సీబీఐ అధికారులు తెలిపారు. తమ దర్యాప్తు పూర్తి చేసినట్లు సీబీఐ తరఫు న్యాయవాది వెల్లడించారు. తాము లేవనెత్తిన అంశాలపై దర్యాప్తు జరగలేదని సుప్రీంకోర్టుకు సునీత తరఫు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వివరించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని విషయాలు, ఆధారాల కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని జస్టిస్ ఎంఎం సుందరేశ్ ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు విషయాలు, ఆధారాలపై ట్రయల్ >>2

# దూసుకొస్తున్న క్షిపణులు, బాంబులు



థాయ్‌నౌకపై ఇరాన్ భారీ దాడులు

దుబాయ్ ఎయిర్‌పోర్టుపై మళ్లీ ఇరాన్ క్షిపణులు

యుద్ధం ముగింపు దశకు వచ్చేసిందంటున్న ట్రంప్

**టెహ్రాన్, జెరూసలెం, మార్చి 11:** మధ్యప్రాచ్యంలో ఇరాన్‌పై యుద్ధం సెగలు తీవ్రతరం అయ్యాయి. టెహ్రాన్ ఇతర కీలక నగరాలపై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు బాంబుల వర్షం కురిపించాయి. ఇప్పటివరకూ 1300 మందికిపైగా చనిపోయినట్లు ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. సెంట్రల్ టెహ్రాన్‌పై వైమానిక, నావికా దళం దాడులు తీవ్రతరంచేసాయి. అలాగే ఇజ్రాయెల్ దక్షిణ లెబనాన్ హెజ్బొల్లా స్థావరాలపై జరిపిన దాడుల్లో 580 మంది చనిపోయినట్లు తేలింది. ఇజ్రాయెల్‌లో కూడా 12 మంది చనిపోగా అమెరికాసైనికులు ఏడుగురుచనిపోయారు. ఇరాన్ క్షిపణి, డ్రోన్ల దాడితో 140 మందికిపైగా అమెరికా సైనికులు తీవ్రంగా గాయపడినట్లు తేలింది. లెబనాన్‌లో దాడుల కారణంగా 7.5లక్షలమంది నిరాశ్రయులయ్యారని, ఇళ్లనువీడి ఇతరప్రాంతాలకు వెళ్లిపోయినట్లు ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఇదిలా ఉంటే హార్ముజ్ జలసంధిని ఎలాగైన తమ అధీనంలోకి తెచ్చుకోవాలని అమెరికా భావిస్తుంటే ఇరాన్ వెనువెంటనే ఐఆర్‌జిసి దళాలను మొహరించింది. ఇప్పటికే హార్ముజ్ జలసంధినుంచి వస్తున్న మూడు నౌకలపై దాడులుచేయడంతో మళ్లీ రవాణా నిలిచిపోయినట్లు తేలింది. అమెరికా మాత్రం తాము 16 భారీ ఇరాన్‌నౌకలను ధ్వంసంచేసినట్లు చెపుతోంది. హార్ముజ్ జలసంధి ప్రారంభం కాకపోతే ఇరాన్ మరింతగా నష్టపోవాల్సి వస్తుందని ట్రంప్ తన ట్రూత్ సోషల్‌మీడియాలో హెచ్చరికలుచేసారు. ఇరాన్‌లో మిలిటరీపరిస్థితులు మరింతఘోరంగా ఉంటాయని హెచ్చరించారు. ఓమన్, ఇరాన్‌లమీదుగా ఉన్న హార్ముజ్ జలసంధిమీదుగానే ఐదోవంతు చమురు,గ్యాస్‌లు రవాణా అవుతుంటాయి. అయితే భారత్‌కు వస్తున్న థాయ్‌నౌకపై దాడిజరగడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇప్పటివరకూ జలసంధిమీదుగా వస్తున్న నౌకలు 14వరకూ దెబ్బతిన్నట్లు తేలింది. థాయిలాండ్, జపాన్, మార్షల్ ఐలాండ్స్ నౌకలే ఎక్కువ ఉన్నాయి.

**దుబాయి ఎయిర్‌పోర్టుపై దాడులు:** ఇరాన్ అమెరికా బేస్‌స్థావరాలపై దాడులుచేయడంతోపాటు గల్ఫ్‌దేశాల్లోని కీలక స్థావరాలు కూడా లక్ష్యంగాచేసుకుంది. ఆయా దేశాల్లోని ఎయిర్‌బేస్‌లతోపాటు యుఎస్ దౌత్య కార్యాలయాలను కూడా టార్గెట్‌చేసాయి. కువైట్‌లోని యుఎస్ ఎంబసీతోపాటు నార్వేరాజధాని ఓస్లోలోని యుఎస్ ఎంబసీపైనా ఇవే దాడులు జరిగాయి. ఇక గల్ఫ్‌దేశాల్లో కువైట్, సౌదీ,యుఎఇ చమురుశుద్ధి కేంద్రాలపై ఇరాన్ దాడులు తీవ్రతరంచేసింది. ముమ్మరదాడులకారణంగా యుఎఇ లోని అతిపెద్ద చమురుశుద్ధికేంద్రం కార్యకలాపాలు >>2

13యేళ్లుగా కోమాలోనే ఉన్న ఓయువకుడికి కారుణ్య మరణం 2లో



## రాష్ట్రంలో ఆర్థికం కుప్ప కూలింది..

అప్పుల ఊబిలో కూరుకుపోయింది: జగన్

**విజయవాడ,మార్చి11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చిందని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బడ్జెట్ గణాంకాల నుంచి అవినీతి వరకు పలు అంశాలపై గణంకాలతో సహా విమర్శలు గుప్పించారు. పరిపాలనాదక్షుడిగా బిల్డప్ ఇస్తున్న చంద్రబాబు, వాస్తవానికి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్నీ మోసపూరిత అంకెలే ఉన్నాయని జగన్ ఆరోపించారు. కాగ్ నివేదికను ఉదహరిస్తూ.. ప్రభుత్వం చూపిస్తున్న లెక్కలకు, వాస్తవాలకు పొంతన లేదని విమర్శించారు. "మేము ఐదేళ్లలో చేసిన అప్పుల కంటే చంద్రబాబు రెండేళ్లలోనే ఎక్కువ అప్పులు చేశారు" అని జగన్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో కోవిడ్ కష్టాల్లో కూడా ఎన్బీసీ (నెట్ బారోయింగ్ సీలింగ్ ) పరిమితిని దాటలేదని, కానీ చంద్రబాబు అధికారంలోకి రాగానే నెట్ బారోయింగ్ సీలింగ్ దాటి విచ్చలవిడిగా అప్పులు చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే రూ. 3.31 లక్షల కోట్ల అప్పులు దాటేసిందని, జీఎస్డీపీ లో అప్పుల శాతం 5.089కి పెరిగిందని గణాంకాలు వివరించారు2024- 25లోనే పరిమితికి మించి రూ.17,953 కోట్లు అధికంగా అప్పులు తీసుకువచ్చారని, ఇక 2025- 26 ఏడాదిలో పరిస్థితి ఇంతకన్నా కూడా ఘోరంగా ఉంది అని చెప్పారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు తెచ్చిన మొత్తం అప్పులు రూ.3.2 లక్షల కోట్లు అని అన్నారు. తమ హయాంలో చేసిన అప్పుల్లో 96 శాతం అప్పులు ఈ రెండేళ్లలోనే చేశారు అని తెలిపారు. తమ ఐదేళ్ల కాలంలో చేసిన అప్పులు కేవలం రూ.3.31 లక్షల కోట్లు మాత్రమేనన్నారు. ఎవరు జాగ్రత్తగా ఆర్థిక వ్యవస్థను నిర్వహించారు, ఎవరు ఆర్థిక వ్యవస్థను డ్యామేజ్ చేశారన్నది కళ్లకు కట్టినట్టు కనిపిస్తోందన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాలు రావడంలేదు అని చెప్పారు. విచ్చలవిడిగా జరుగుతున్న అవినీతి, దోపిడీ కారణంగా రాష్ట్రానికి ఆదాయాలు రావడం లేదు అని అన్నారు. వనరులన్నింటినీ కూడా దోచేసి సొంత జేబులు నింపుకుంటున్నారు అని దుమ్మెత్తిపోశారు. ఇసుక, మట్టి, సిలికా, క్వార్ట్జ్, లెటరైట్, గ్రానైట్, లిక్కర్, భూములు, అధిక రేట్లకు పీపీఏలు దేన్నీ వదిలిపెట్టడంలేదు అని చెప్పారు. దోపిడీ జరిగితే, ప్రభుత్వానికి ఆదాయాలు ఎలా వస్తాయి? సంక్షేమం, అభివృద్ధి ఎలానడుస్తుంది? అని ప్రశ్నించారు. విశాఖపట్నంలో అత్యంతవిలువైన భూములను >>2

# రేపు 'సుఖీభవ' మూడో విడత

>> మని తెలిపారు.ఇంద్ర ధనస్సు పేరిట దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలు అమలు చేస్తున్నాం అన్నారు..గత పాలనలో ట్రూ అప్ పేరిట విద్యుత్ చార్జీల భారం వేశారు. తొలిసారి ట్రూ డౌన్ చేశాం అన్నారు.రూ.4600 భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తోంది అన్నారు.ఈ ఏడాది 39 పైసల మేర విద్యుత్ కొనుగోలు ధర తగ్గిస్తాం అన్నారు.కుసుమ్ కింద 3 లక్షల పంప్ సెట్లు ఇస్తున్నాం.అన్నారు.సబ్ స్టేషన్ యూనిట్ గా మైక్రో గ్రిడ్ ఏర్పాటుతో పాటు ప్రోజ్యూమర్ కాన్సెప్టును సమర్ధంగా అమలు చేయాలి.

**ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అనే వ్యవస్థను ఏర్పాటు చేద్దాం:** ఐటీ, క్వాంటం, ఏఐ వంటి రంగాల్లో కొత్త టెక్నాలజీలు, ల్యాబులు ఏర్పాటు చేస్తున్న తరహాలోనే.. వ్యవసాయానికి మరింత ఊతమిచ్చేలా అలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఈ క్రమంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ తరహాలోనే ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు చేద్దామని సీఎం ప్రకటించారు. రెండు రోజుల జిల్లా కలెక్టర్ల సమావేశం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజల్లో ప్రచారం కల్పించాలని.. అలాగే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని యాక్షన్ ప్లాన్ రూపొందిం చారు. ఇదే సందర్భంగా ఇటీవల జరిగిన వివిధ ఘటనలపై సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వేట్లపాలెం బాణాసంచా పేలుళ్ళ, శ్రీకాకుళంలో డయేరియా, రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటనల్లో అధికార యంత్రాంగం అలక్ష్యంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం బిలియనీర్ల కోసం పని చేయడం లేదని.. పేదల కోసం పని చేస్తోందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. 6వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ప్రతీ మూడు నెలలకూ పాలనా అంశాలపై సమీక్ష చేసుకుని ముందుకు వెళ్తున్నాం. ఉన్న పరిమిత వనరులతోనే సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్సు చేస్తున్నాం. గతంలో కార్యాలయాల్లో కూర్చుని ఫైల్స్ రాసే పరిస్థితి నుంచి వర్చువల్ పని విధానాన్ని తీసుకువచ్చాం. గడచిన 20 నెలల్లో కీలకమైన పాలనా మార్పులు తీసుకువచ్చాం. ప్రభుత్వం తెచ్చే విధానాలు దీర్ఘకాలంలో ప్రభావం చూపిస్తాయి. వీటి అమలులో ఉదాసీనత వద్దు. 2047 స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా తెచ్చిన 10 సూత్రాలు అమలు చేస్తే సుపరిపాలన అందించేందుకు వీలవుతుంది.

నిర్దేశిత లక్ష్యాలను క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా అమలు చేయాలి. సూపర్ సిక్స్ సహా వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయాలి. ఎక్కడా చిన్న పొరపాటు కూడా దొర్లకుండా పారదర్శకంగా అమలు చేయాలి. 13 తేదీన అన్నదాత సుఖీభవ మూడో విడత నిధులు విడుదల చేస్తున్నాం. కేంద్రం ఇచ్చే వాటితో పాటు రాష్ట్రం కూడా రైతుల ఖాతాల్లో మిగతా సొమ్ము జమ చేస్తుంది. రైతు సంఘాలు, సాగునీటి సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు ఇలా వేర్వేరు ప్రతినిధులు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని సమర్థంగా తీసుకెళ్లాం. ప్రజల్లోకి వెళ్లి... ఈ పథకం గురించి చెప్పాలి.. డబ్బులు విడుదల చేస్తున్నామని వివరించాలి. ఖరీఫ్ సాగు కోసం మే 15 తేదీన నీటిని విడుదల చేస్తున్నాం. సీజన్లో ముందుగానే నీరు ఇస్తాం. మే 15 నుంచే సాగుకు సిద్ధం అవుదాం. ఏఐ అగ్రానమిస్ట్ సేవలు కూడా అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతీ వ్యవసాయ దారుడికి ఏఐ అగ్రానమిస్ట్ సేవలు అందేలా చర్యలు చేపట్టాలి"అని ముఖ్యమంత్రి సూచించారు.

**మనమిత్ర వాట్సప్ గవర్నెన్సును కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు:** మనమిత్ర వాట్సప్ గవర్నెన్సును కూడా ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు సమావేశంలో ఆదేశించారు.సెప్టెంబరులో ప్రాజెక్టులు పూర్తి చేసి యాక్షన్ టేకెన్ రిపోర్టు అందరి ముందు పెడతామని చెప్పాం. దానికి అనుగుణంగా కలెక్టర్లు పెట్టుబడుల ప్రతిపాదనలకు సంబంధించిన ప్రాజెక్టులపై వేగంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

**శాంతిభద్రతల విషయంలో రాజీలేదు**

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితికి భంగం కలిగించేందుకు ప్రయత్నించే శక్తులను అణచివేస్తామని సమావేశంలో సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నాం.అన్నారు.వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగంలో కేపీఐలు మెరుగు పడాలన్నారు.




బుధవారం పార్లమెంటు ప్రాంగణంలో 'ప్రధాని రాజీ పడ్డాడు'.. అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఆందోళన చేస్తున్న ఎంపీలు ప్రియాంకా గాంధీ, హిబి ఈడెన్, మాణికం ఠాగూర్ తదితరులు

# దూసుకొస్తున్న క్షిపణులు, బాంబులు

>> నిలిపివేసింది. కువైట్‌నేషనల్‌గార్డ్ మాత్రం తాము ఎనిమిది డ్రోన్లను కూల్చివేసామని ప్రకటించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా, పశ్చిమ జెరూసలెం, ఎర్బిల్, ఇరాక్, మనామా, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపైనా క్షిపణిదాడులు హోరెత్తించింది. ఖోరామ్‌షర్ క్షిపణులతో ఇరాన్ ఈ నగరాలపై విరుచుకుపడింది. అలాగే ఇరాన్‌పోలీస్ చీఫ్ ఒక ప్రకటనచేస్తూ నిరసనకారులను ఇరాన్ శత్రువులుగానే పరిగణిస్తామని, అహ్మద్ రెజా రాదాన్ ప్రకటించారు. వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

**ఇప్పటికైనా చైతన్యం కండి..ఇరాన్‌ప్రజలకు నెతన్యాహు పిలుపు**

యుద్ధం ముగింపుదశకు వచ్చిందని, ఇక టార్గెట్లు ఏమీలేవని, ఇరాన్‌లోని మతప రమైన పాలనను అంతంచేసేందుకు ఇరాన్‌ప్రజలు సిద్ధంకావాలని ఇజ్రాయెల్‌ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇరాన్‌పెద్దలు పరారవుతున్నారని, మిలిటరీ, ఎయిర్‌బేస్ నేవల్ అన్నీ టార్గెట్లు ఛేదించామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌సైతం ఇరాన్‌లో ఇక టార్గెట్లు అంటూ ఏమీలేవని, అన్నింటినీ ధ్వంసంచేసామని, ఇరాన్ ఇదే తీరు కొనసాగిస్తే ప్రపంచ చిత్రపటంలో ఇరాన్ కనుమరుగవుతుందని హెచ్చరించారు. ఇరాన్‌లో నిరంకుశపాలనకు ముగింపు పలికామని, ఇక ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు.

**మొజ్తబా ఆచూకీపై ఉత్కంఠ**

ఇక ఇరాన్ సుప్రీం కమాండర్‌గా ఎంపికయిన మొజ్తబా ఖమైనీ ఆచూకి పట్ల సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గతనెల 28వ తేదీజరిగిన దాడుల తర్వాతనుంచి కూడా మొజ్తబా బాహ్యప్రపంచంలోకి రాలేదు. రహస్యంగానే ఉంచారు. ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నదీ కూడా ఎవ్వరికీ తెలియడంలేదు. అయితే ఖమైనీ మండలిలోని సలహాదారుల్లో అత్యంత విధేయుడయిన అధికారి ఒకరు మాట్లాడుతూ మొజ్తబా సురక్షితంగానే ఉన్నట్లు తెలిసిందనిప్రకటించారు. ఒకదశలో తీవ్రంగా గాయపడినట్లు కూడా ఇజ్రాయెల్‌వైపునుంచి సమాచారం రావడంతో ఇరాన్ పాలకులు ఆదుర్దా వ్యక్తంచేసినా అధికారికంగా ఎలాంటిప్రకటనచేయలేదు. చివరకు మొజ్తబా సురక్షితంగా ఉన్నట్లు మాత్రంప్రకటించారు.



బాంబు దాడులతో టెహ్రాన్‌లో ఎగసిపడుతున్న పొగలు

# ప్రజల ఆకాంక్షే 'మనమిత్ర'కు ప్రేరణ

>> రంగంలోకి విజయ వంతంగానే అడుగుపెట్టాం. ఇక్కడ అతిపెద్ద సవాలు అంతర్గత రాజకీయాలు. ప్రతి శాఖ వారి అనుభవాన్ని తమ నియంత్రణలోనే ఉంచుకోవాలని కోరుకుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకతత ఏమిటంటే, మాకు రియల్‌టైమ్ గవర్నెన్స్ అనే వ్యవస్థ ఉంది, వాస్తవానికి ఇది ఒక మంత్రిత్వ శాఖ. అందరినీ కూర్చోబెట్టి చర్చించి, వారి ఎపిఐలను తెరిచేలా చేయ డమే అతిపెద్ద సవాలు. సాంకేతికత అనేది కేవలం ఒక సాధనం మాత్రమే, కానీ నిజమైన మార్పు సాంస్కృతికంగా జరగాలి సమావే శంలో లోకేష్ వ్యాఖ్యానించారు. నేను మంత్రులు, కార్యదర్శులతో దీనిగురించి చాలా ఓపెన్‌గా చర్చలు జరపాల్సి వచ్చింది. ఇది ముఖ్యమంత్రి గారి ఆదేశం అని స్పష్టం చేశాను. మేము ఎక్కువ ట్రాఫిక్ ఉన్న (ఎక్కువగా ఉపయోగించే) సేవలతో ప్రారంభించి, ఆ తర్వాత తక్కువగా ఉపయోగించే సేవల వైపు వెళ్లామన్నారు. మీకు ఎలాంటి ఫీడ్‌బ్యాక్ వచ్చింది? పౌరుల జీవితంలో గణనీయమైన మార్పులు వచ్చిన ఉదాహరణలు ఏమైనా ఉన్నాయా? అన్న సంధ్యాదేవనాథన్ ప్రశ్నకు నారా లోకేష్ బదులిస్తూ గతంలో హాల్ టిక్కెట్లు పొందడం చాలా ఇబ్బందిగా ఉండేది. మేం మొదటి రోజు నుండే వాటిని వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తీసుకురావడం వల్ల పిల్లలు వాటిని సులభంగా పొందే వీలు కలిగింది. మేము ఫీడ్‌బ్యాక్ సేకరించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేశాము, దాని ఆధారంగా వివిధ విభాగాలకు ర్యాంకులు ఇస్తాము. ముఖ్యమంత్రి దీనిని వారం వారం సమీక్షి స్తుంటారు, మంత్రులు, కార్యదర్శులకు ఫీడ్‌బ్యాక్ ఇస్తారు. 1 నుండి 10 స్కేల్‌లో పౌరులు మాకు 8.5 లేదా 9 రేటింగ్ ఇస్తున్నారు. కానీ నేను మాత్రం 3 మాత్రమే ఇస్తాను. మేము ఏఐ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో వాట్సాప్ గవర్నెన్స్‌ను అధికారికంగా చేర్చిన మొదటి రాష్ట్రం మీదే. ఎఐ పర్సనల్ అసిస్టెంట్లు లేదా ప్రిడిక్టివ్ అలర్ట్స్ వంటి అధునాతన ఫీచర్లను ఏకీకృతం చేయడంలో మీ విజన్ ఏమిటి?అంటూ .సంధ్యా దేవనాథన్ అడిగిన ప్రశ్నకు .నారాలోకేష్ స్పందిస్తూ భారతదేశం ఏఐ ని స్వీకరించడం ప్రస్తుతం అత్యవసరం అన్నారు.మా డేటా లేక్ ప్రాజెక్ట్ పౌరుడిని కేంద్రంగా చేసుకొని డేటా పటిష్టంగా ఏకీకృతం అయ్యేలా చేస్తుంది. ఉదాహరణకు మేము ఒకసారి జనన ధృవీకరణ పత్రాన్ని జారీ చేసిన తర్వాత, ప్రాథమిక రూల్ ఇంజిన్‌లను ఉపయోగించి అనేక ఇతర విషయాలను స్వయంచాలకంగా ఏకీకృతం చేయవచ్చు. వెర్షన్ 1 అని పిలిచే మెనూ భాగాన్ని మేము పూర్తి చేసాము, ఇప్పుడు మేము రాబోయే 90 రోజుల్లో వెర్షన్ 2.0 పూర్తిచేయాలి. విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నుల వంటి ఆర్థిక లావాదేవీల పట్ల మేము ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాల్సిన అవసరం కూడా ఉంది.

**సంధ్యా దేవనాథన్:** వాట్సాప్ సేవలను ఉపయోగిస్తున్న కుటుంబాలు సుమారు 30 వరకు ఉన్నాయి. గ్రామీణ కుటుంబాలు,రైతులకు ఇది ఎలా పని చేస్తోంది?..

**నారా లోకేష్:** గ్రామీణ వినియోగదారులు కూడా ఇప్పుడు వాట్సాప్ సేవలకు అలవాటు పడుతున్నారు. రైతులు ఏయే ప్రభుత్వ సేవలకు అర్హులో అర్థం చేసుకోవడానికి ఇది చాలా కీలకమైనది. వారికి ఏదైనా లబ్ధి చేకూరకపోతే, ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేకుండానే తమ మొబైల్ ఫోన్ నుండే వారు ఫిర్యాదు చేయవచ్చు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఎన్ని పరిష్కారమయ్యాయి అని చూసేందుకు మాకు ఇది తోడ్పడింది. మేము దీన్ని ఆన్‌లైన్‌లోనే చేయాలని మేము పట్టుబట్టాము. ఎందుకంటే అక్కడ తగినంత భద్రత, రక్షణ ఉంటుంది. యుటిలిటీ చెల్లింపులు, హాల్ టిక్కెట్లు, పరీక్షా ఫలితాలు విస్తృతంగా ఉపయోగించబడుతున్నాయి. మా పౌరసేవల సంతృప్తి స్కోర్‌లు మెరుగుపడుతున్నాయని లోకేష్ తెలిపారు.జ మాకు తక్కువ రేటింగ్ వచ్చినప్పుడు లోపాలను సరిదిద్దడానికి మేము ఇంటరాక్టివ్ విధానాన్ని ఉపయోగిస్తున్నాము. అయితే, ఇందులో పటిష్టమైన డేటా లేక్ చాలా కీలకం. డేటా సెట్‌లు వేర్వేరుగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్ మొదటి 150 సేవలకు మించి విస్తరించలేదు. ప్రతి ప్రక్రియను ప్రశ్నించే అవకాశాన్ని కూడా ఇది అందిస్తుంది. మేము ప్రాసెస్ రీఇంజనీరింగ్ చేస్తున్నాము. వ్యవస్థను ప్రతిస్పందించే విధంగా కాకుండా చురుకుగా ఉంచడానికి ఏ దశలను తొలగించవచ్చు అని ప్రశ్నిస్తున్నాము. ఉదాహరణకు కుల ధృవీకరణ పత్రం కోసం, మీరు మళ్లీమళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం ఉండకూడదు. ఇది ఒకసారి వివరాలు ఇస్తే తర్వాత దానంతట అదే అందించే ఒక ఫ్రేమ్‌వర్క్ ఉండాలి. బ్లాక్‌చెయిన్ ద్వారా ట్రాక్‌అండ్ ట్రేస్‌తో ఒక కోడ్‌పై ఉంచాలి. ఒక పౌరుడి దైనందిన జీవితంలో సాధారణ పౌరసేవల కోసం రాజకీయ నాయకులు,అధికారుల వద్దకు వెళ్లకుండా చేస్తామో ఆ రోజు మనం విజయం సాధించినట్లు అని నేను నా ఐటీ సెక్రటరీకి చెబుతుంటాను.ఇతర రాష్ట్రాలకు మీరు ఎటువంటి సలహా ఇస్తారు? అన్న ప్రశ్నపై నారా లోకేష్ స్పందిస్తూ ఒకటి, బలమైన డేటా లేక్, రెండవది ఇది వ్యూహాత్మకంగా దీనిని కీలకమైన ప్రాజెక్ట్ అని విశ్వసించే రాజకీయ సంకల్పం. ఇది మేం ప్రజలకు ఇచ్చిన ఒక ఎన్నికల హామీ. దానిని విజయవంతం చేసేందుకు ఎంతో శ్రద్ధ వహించాం. విభాగాల్లో అలసత్వం రాకుండా చూసేందుకు, ఇది ఎల్లప్పుడూ అత్యున్నత ప్రాధాన్యతగా ఉండేలా మీరు చూసుకోవాలి. ఒక సంవత్సరం తరువాత, మనం పరిపూర్ణతకు దగ్గరగా ఉండే ఒక నమూనాను కలిగి ఉంటామని నేను నమ్ముతున్నా అన్నారు.

# ఆర్థికం కుప్పకూలింది..

>> కారుచవకగా కట్టబెడుతూ దోపిడీకి పాల్పడుతున్నారు అని ఆరోపించారు. రూ.5 వేల కోట్ల విలువ చేసే 54 ఎకరాల ప్రభుత్వ భూములను చంద్రబాబు బంధువు కబ్జాచేస్తున్నారు అని జగన్ ఆరోపించారు.ప్రొక్లెయిన్‌లతో లెవల్ చేసి, ప్రభుత్వం పెట్టిన బోర్డులను పీకేసి ఆక్రమించుకుంటున్నారు అని అన్నారు. ఇంత బహిరంగంగా ఒక ముఖ్యమంత్రి, ఆయన బంధువు, లోక్‌సభ ఎంపీ కలిసి ప్రజల ఆస్తులను దోచేస్తున్నారు అని చెప్పారు. ప్రభుత్వంతోపాటు వ్యవస్థలన్నీ చోద్యం చూస్తున్నాయని మండిపడ్డారు. ప్రజల ఆస్తులను రాబందుల్లా కొల్లగొడుతున్నారు అని ధ్వజమెత్తారు. ఆర్‌బీఐ అడ్వాన్స్‌లమీద ఆధారపడకుండా, రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో,మినిమం బ్యాలెన్స్ నగదు నిల్వ ఉండే రోజులు పడిపోయాయన్నారు. ఏ కష్టాలు లేనప్పటికీ 2024-25లో నగదు నిల్వలున్న సమయం కేవలం 8రోజులకు పడిపోయిందన్నారు. 365 రోజుల్లో 357 రోజులు మినిమం బ్యాలెన్స్ కూడా ట్రెజరీల్లో లేవు అని చెప్పారు. వైసిపి మీద తప్పుడు ప్రచారాలు చేస్తూ మరోవైపు ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్నారని, చేస్తున్న అప్పుల్ని బయటకు రానీయకుండా దాచేసే ప్రయత్నం చేస్తున్నారు అనిచెప్పారు. 2024-25లోచేసిన బడ్జెట్ అప్పులు రూ.60,485 కోట్లని వీళ్ల ప్రభుత్వం చెబుతోందని, కాని కాగ్ మాత్రం ఆ ఏడాదిలో చేసిన అప్పులు రూ.81,071 కోట్లని తేల్చిచెప్పింది అని వైఎస్.జగన్ అన్నారు. రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పడిపోవడానికి దోచుకో.. పంచుకో.. తినుకో.. అనే విధానమే కారణమని జగన్ విమర్శించారు. లిక్కర్ మాఫియా నుంచి భూములు కటబెట్టడం వరకు అన్నింటా అవినీతి జరుగుతోందని ఆరోపించారు. తిరుమల పవిత్రత గురించి మాట్లాడే చంద్రబాబు, బీఆర్ నాయుడిని టీటీడీ ఛైర్మన్‌గా ఎలా నియమిస్తారని జగన్ ప్రశ్నించారు. దైవ భక్తి, నిష్ఠ ఉన్నవారిని నియమించాల్సిన చోట, నేరుగా బాధితురాలే లేఖ రాసినా పట్టించుకోకుండా పదవి కట్టబెట్టడంపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేశారు. ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలను చంద్రబాబు గాలికి వదిలేశారని జగన్ ఎద్దేవా చేశారు. గతంలో ప్రకటించిన చంద్రన్న పెళ్లి కానుక ఇవ్వడానికే దిక్కులేదు కానీ, ఇప్పుడు మూడో బిడ్డను కంటే డబ్బులు ఇస్తామంటూ కొత్త నాటకాలకు తెరలేపారని విమర్శించారు.

## పక్కా ప్లాన్‌తో నగరపాలక సంస్థల పై ఏసీబీ దాడులు

### రెండో రోజు కొనసాగిన సోదాలు

**విజయవాడ,మార్చి 11,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీవ్యాప్తంగా రెండో రోజూ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారుల తనిఖీలు జరిగాయి. భవన నిర్మాణ అనుమతుల్లో టౌన్ ప్లానింగ్ విభాగం పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతోందని ఏడాది కాలంగా అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు ఏపీవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని మున్సిపల్ కార్యాలయాల్లోని పట్టణ ప్రణాళికా విభాగాల్లో ఏసీబీ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ముందస్తుగానే ఆయా నగరపాలక సంస్థలపై వచ్చిన ఫిర్యాదులపై సామాన్యపౌరులు మాదిరిగా వెళ్ళి ఏసీబీ సిబ్బంది సమాచారం రాబట్టి ఆధారంగా ఈ ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు అధికారికంగా ప్రకటనలో తెలిపారు. ప్రజా ఫిర్యాదుల దృష్ట్యా ఏసీబీ ఉన్నతాధికారులు రైడ్స్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సోదాల్లో, టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఉద్యోగుల వద్ద కొంత లెక్కల్లో చూపని నగదు దొరికింది. నగదు ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై విచారణ జరుపుతున్నారు. ఇంకా, భవన ప్రణాళికల ఆమోదంలో బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ స్కీముల్లో అవకతవకలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఖాళీ భూమి పన్ను రిజిస్టర్లు వంటి కొన్ని తప్పనిసరి రిజిస్టర్లను కూడా సిబ్బంది సరిగ్గా నిర్వహించడం లేదని గుర్తించారు. అనేక భవన ఆమోద దరఖాస్తులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఏసీబీ అధికారులు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విశాఖలోని మూడు జోన్లలోని కమిషనర్ కార్యాలయాల్లో తనిఖీలు చేపట్టారు. భవన ప్రణాళికల మంజూరు, బిల్డింగ్ పెనలైజేషన్ స్కీమ్, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ క్రమబద్ధీకరణలో సిబ్బంది అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు అందాయి. అనంతపురంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ప్రైవేట్ సైన్యం ద్వారా భవన యజమానుల నుంచి దౌర్జన్యంగా వసూళ్లు చేయిస్తున్నారని, ఈ సైన్యానికి మున్సిపల్ అధికారులు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు వచ్చాయి. ఈ తరహా సంఘటనలే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కార్పొరేషన్ల పరిధిలో ఉండటంతో, రెండు రోజులుగా టౌన్ ప్లానింగ్ విభాగంలో తనిఖీలు చేస్తున్నారు. రెండో రోజు అనంతపురం నగరపాలక సంస్థలో ఏసీబీ డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారిని వెంట తీసుకొని నూతన భవనాలు నిర్మిస్తున్న చోట క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంపై అనేక ఫిర్యాదులు వచ్చాయని, దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు డీఎస్పీ ప్రసాదరెడ్డి చెప్పారు.అనంతపురం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో సోదాలను నిర్వహించాం. ఈ తనిఖీల్లో 11 భవనాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

# కేంద్ర మాజీ మంత్రి కావూరి కన్నుమూత

>> రంగంలోనికి ప్రవేశించి పారిశ్రామికవేత్తగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కావూరి రెండో కుమార్తె తనయుడు శ్రీభరత్ ప్రస్తుతం విశాఖపట్నం ఎంపీగా ఉన్నారు. మచిలీపట్నం, ఏలూరు నుంచి సాంబశివరావు ఐదుసార్లు ఎం పీగా గెలిచారు. అలాగే మన్మోహన్ సింగ్ కేబినెట్లో కేంద్రమంత్రిగా పని చేశారు. 2014లో రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌కు కావూరు రాజీ నామా చేసి బీజేపీలో చేరారు. 1943లో ఏలూరులో జన్మించిన సాంబశి వరావు, వరంగల్ ఆర్ఈసీ నుంచి ఇంజినీరింగ్ పట్టా పుచ్చుకున్నారు. 1980లో కాంగ్రెస్‌లో చేరిన కావూరి సాంబశివరావు ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించారు.తొలుత ఎమ్మెల్సీగా పోటీ చేసిన కావూరి ఓటమి పాల య్యారు.ఆ తర్వాత మచిలీపట్నం పార్లమెంటు నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. 8వ, 9వ, 12వ లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఏలూరు నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచారు. ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టినగడ్డ కృష్ణా జిల్లాతో ఆయన విడదీయలేని అనుబంధం కొనసాగిస్తూనే ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుంచి కృష్ణా జిల్లా రాజకీయాల్లో కావూరి క్రియాశీలకంగా వ్యవహరించారు. మచిలీపట్నం నుంచి 1984, 89లో వరుసగా రెండుసార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1998లో మరోసారి గెలిచి మూడుసార్లు మచిలీపట్నం ఎంపీగా పనిచేశారు. జిల్లాలో అనేక అభివృద్ధి పనులు ఆయన హయాంలో జరిగాయి. ఎస్సీ, బీసీ సహా అందరికీ సామాజిక భవనాలు, పాఠశాలలకు ప్రత్యేక నిధులు, అనేక నూతన భవనాలు, అభివృద్ధి పనులు చేపట్టారు.

**రాజకీయ, వ్యాపార రంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర:సీఎం చంద్రబాబు**

కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి అత్యంత బాధాకరమని తెలిపారు. మచిలీపట్నం, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసిన కావూరి సాంబశివరావు మరణం తీరని లోటని పేర్కొన్నారు. రాజకీయ, వ్యాపార రంగంలో కావూరిది ప్రత్యేక ముద్ర అనికొనియాడారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలు పుతున్నానని పేర్కొన్నారు.ఆయనఆత్మకుశాంతికలగాలని ప్రార్థిస్తున్నానని సీఎం తెలిపారు.

**రాష్ట్ర ప్రగతి కోసం కావూరి ఎనలేని కృషి: మంత్రి నారా లోకేశ్**

కావూరి సాంబశివరావు మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కేంద్ర మాజీమంత్రి, రాజకీయ కురువృద్ధులు, మా బంధువు కావూరి సాంబశివరావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఐదుసార్లు ఎంపీగా గెలిచి, కేంద్రమంత్రిగా పనిచేసి రాష్ట్ర ప్రగతి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. తన నియోజకవర్గ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని ప్రశంసించారు. కావూరి సేవలు చిరస్మరణీయమని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నానని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# 13యేళ్లుగా కోమాలోనే.. ఓ యువకుడికి కారుణ్యమరణం: సుప్రీం సంచలన తీర్పు

**న్యూఢిల్లీ,మార్చి 11:** పదమూడేళ్లుగా జీవచ్ఛవంగా ఉన్న 32 ఏళ్ల హరీశ్ రాణాకు అందిస్తున్న వైద్య సహాయాన్ని నిలిపివేసేందుకు అతని తల్లిదండ్రులకు అనుమతి ఇచ్చింది. గౌరవంగా మరణించే హక్కుపై సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం తీర్పు చెప్పింది. 13 ఏళ్ల క్రితం భవనంపై నుంచి కింద పడటంతో హరీశ్ రాణా మెదడుకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి అతను స్పృహ లేకుండా, పూర్తిగా ఇతరులపై ఆధారపడి జీవిస్తున్నాడు.

ఈ కేసును విచారించిన ధర్మాసనం, ఇలాంటి పరిస్థితుల్లో చికిత్స కొనసాగించడం రోగి ప్రయోజనాలకు మేలు చేస్తుందా లేదా అన్నదే కీలకమని వ్యాఖ్యానించింది. చదువులో చురుకుగా ఉండే యువకుడు ఇలా జీవచ్ఛవంగా మారడం బాధాకరమని కోర్టు పేర్కొంది. 13 ఏళ్లుగా అతని ఆరోగ్యంలో ఎలాంటి పురోగతి లేదని, కోలుకునేందుకు ఏమాత్రం అవకాశం లేదని వైద్య నివేదికలు స్పష్టం చేశాయి. ఈ నేపథ్యంలో చికిత్సను కొనసాగించడం వల్ల ప్రయోజనం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పైపుల ద్వారా అందించే పోషకాహారం కూడా వైద్య చికిత్స కిందకే వస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వైద్యుల బృందం పరిశీలించి, రోగి కోలుకునే అవకాశం లేదని నిర్ధారించిన పక్షంలో లైఫ్ సపోర్ట్‌తో పాటు పోషకాహారాన్ని కూడా నిలిపివేయవచ్చని ఈ తీర్పుతో స్పష్టమైంది.

# ఆందోళన వద్దు..

>> ఎగుమతులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

**షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం:** ప్రస్తుతం షిప్పింగ్ కంటైనర్ల కొరత ఉందని ప్రచారం జరుగుతున్న వార్తలు అసత్యమని మంత్రి స్పష్టం చేశారు. కంటైనర్ల కొరత కారణంగా ఎగుమతులు ప్రభావితం అవుతున్న పరిస్థితి ప్రస్తుతం లేదని, అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కంటైనర్లు ఇప్పటి వరకు వెనక్కి రాలేదని తెలిపారు. ఎగుమతుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు, రైతులకు సమయానుకూల సూచనలు అందించేందుకు ప్రతి నెల చివరి వారంలో డైరెక్టర్లు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతదేశం , యూరోపియన్ యూనియన్ మధ్య కొనసాగుతున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలు పూర్తైతే భారత సముద్ర ఆహార ఎగుమతులకు మరింత మార్కెట్ అవకాశాలు లభించి భవిష్యత్తులో ఎగుమతులు పెరగడానికి దోహదపడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# విద్యుత్ ఛార్జీలు మరింత తగ్గిస్తాం

>> అభినందించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో జలధార విజయగాథను జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జిల్లా అధికారుల కృషి చూసి ముఖ్యమంత్రి పులకించిపోయారు. మంచి ప్రయత్నం చేశారు. ఎక్సలెంట్, ఇదో క క్లియర్ కేస్ స్టడీ, దీన్ని అందరూ అందిపుచ్చుకోవాలని కలెక్టర్లకు సూచించారు. అన్నమయ్య జిల్లా అత్యంత కరవు ప్రాంతాల్లో ఒకటని, అలాంటి చోట జిల్లా కలెక్టర్, అధికారులు వినూత్నంగా ఆలోచించి చేసిన చిన్న ప్రయత్నం పెద్ద ఫలితం ఇస్తోందని అభినందించారు. జలధారను అదే పేరుతో అడాప్ట్ చేసుకుంటున్నామని, రాష్ట్రమంతటా ఈ జలధార కార్యక్రమానికి అమలు చేస్తున్నట్లు సభలో ముఖ్యమంత్రి ప్రకటించారు. 90 రోజుల పాటు లేదా రాబోయే వర్షాకాలం వరకు అన్ని జిల్లాల్లో జలధార కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. తద్వారా నీటిని సమర్థంగా నిర్వహించుకోగలుగుతామన్నారు. తాను పట్టిసీమ ప్రాజెక్టుద్వారా 100 టీఎంసీల నీరు కృష్ణా డెల్టా ప్రాంతాలకు తీసుకొచ్చానని, తద్వారా శ్రీశైలం నుంచి నీరు రాయలసీమకు మళ్లించడం వీలైందని, దాంతో రాయలసీమంలో రూపురేఖలే మారిపోతున్నాయని చెప్పారు. ఇదే తరహాలో అన్నయ్య జిల్లాలో స్థానికంగా ఉన్న కాలువల అనుసంధానం విజయవంతంగా, తక్కువ ఖర్చుతో చేయడం అభినందనీయమన్నారు.

# 4 వారాల్లో విచారణ ముగించాలి

>> కోర్టును ఆశ్రయించవచ్చన్న ధర్మాసనం తెలిపింది.ట్రయల్ కోర్టులో సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై విచారణ ముగించాలని ఆదేశించింది.నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.ఛార్జిషీట్ దాఖలు పూర్తయినందున బెయిల్ రద్దు పిటిషన్లపై విచారణ అవసరం లేదన్న సుప్రీం కోర్టు.నిందితుల బెయిల్ రద్దుచేయాలని దర్యాప్తు సంస్థ, సునీత దాఖలు చేసిన పిటిషన్లు డిస్మిస్ సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. ట్రయల్ కోర్టులో సెక్షన్ 207 కింద దాఖలైన అన్ని పిటిషన్లపై నాలుగు వారాల్లో విచారణ ముగించి తీర్పు వెలువరించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.

# కల్తీ పాల ఘటనలో చిన్నారి మృతి: 12కి చేరిన మృతులు

**రాజమహేంద్రవరం, మార్చి11, ప్రభాతవార్త ప్రతినిధి:** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రెయిన్‌బో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న (కల్తీపాల ఘటనలో) రెండు సంవత్సరాల 9 నెలల చిన్నారి జి.జయకీర్తి బుధవారం ప్రాణాలు కోల్పోయారు. దీంతో మొత్తం 12మంది మృతి చెందినట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

## వారం - వర్జ్యం

12-03-2026, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
నవమి పూర్తి
మూల రా.12.42
వర్జ్యం : ఉ.11.13-12.59
దు.ఉ.10.19-11.07,
2) మ.3.06-3.54
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** ఓర్పు, నేర్పులతోనే కార్యసాధన అవుతుంది. సహనమునకు పరీక్షలు ఎదురవుతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి.

**వృషభం:** మీకు రావలసిన ప్రతిఫలము కొద్దికొద్దిగా చేతికి అందుతుంది. మీ అంతర్యాన్ని చూసి అందరూ ఆశ్చర్యపోతారు.

**మిథునం:** న్యాయబద్ధముగా రావలసిన ధనము వాయిదాల పద్ధతిలో డొనేషన్స్‌ను స్వీకరించినట్లుగా తీసుకోవలసివస్తుంది.

**కర్కాటకం:** విధుల నిర్వహణలో వ్యాపార రంగంలో అభివృద్ధి కనిపిస్తుంది. విదేశీయానాలు చేయాలనే ఆలోచనలు బలపడతాయి.

**సింహం:** అకౌంట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ధనలాభం.

**కన్య :** కార్యాలయంలో సహోద్యోగులు కొన్ని చికాకులు కల్పించినా వాటిని అధిగమిస్తారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**తుల :** బంధువర్గానికి ధనసహాయం చేయవలసి వస్తుంది. కొన్ని చర్చలు జరిపి కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు.

**వృశ్చికం:** స్టేషనరీ, ప్రింటింగ్ సంబంధిత వ్యాపారులకు సానుకూలం. వివాదాలకు దూరంగా వుండడం మంచిది.

**ధనుస్సు:** శారీరక, మానసిక శ్రమ అధికమవుతుంది. చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తిచేస్తారు. వాహనసౌఖ్యం.

**మకరం:** నిందలు, ఆరోపణలు, దుష్ప్రచారాలు ఇబ్బందిని కలిగిస్తాయి. అయితే అవి తాత్కాలికము మాత్రమే కనుక ధైర్యంగా ఉండండి.

**కుంభం:** అతి విలువైన డాక్యుమెంట్లు, ఉపయోగకరమైన పత్రములు లభ్యమయ్యే అవకాశం ఉంది.ఆరోగ్యవిషయం జాగ్రత్త.

**మీనం:** ఎంతోకాలంగా మీలో నిద్రాణమైన ప్రతిభ వెలుగు చూస్తుంది. ఉద్యోగాలలో మంచి మార్పులు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

వార్త

ఒక సమాజం దాని నైతిక విలువలను కోల్పోతే అది సర్వస్వం కోల్పోయినట్లే.

- డ్రాయిడెన్

# వంటింటికి 'వార్' దెబ్బ!


పశ్చిమాసియా యుద్ధ ప్రభావం వంటింటిపై పడింది. యుద్ధ ప్రభావ తీవ్రత పరాకాష్ఠకు చేరింది. దేశవ్యాప్తంగా వంట గ్యాస్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. రెండు రోజుల క్రితమే కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరపెంచింది. ఒకపక్క క్రూడాయిల్ బ్యారెల్ ధర పెరిగి అన్ని చమురు ఉత్పత్తుల ధరలు పెరిగాయి. రవాణారంగంపై పెట్రోలు, డీసెల్ ధరల తాకిడి వలన ఆటోలు, టాక్సీలు, రవాణా వాహనాలన్నిటిపై ఛార్జీలు పెంచేశారు. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ 120 డాలర్లు ఉంటే ఇరాన్ ఆధీనంలోని హార్మూజ్ జలసంధి మూసివేయడంలో అక్కడే ఆగివున్న నౌకలు తిరుగుముఖం పట్టాయి. ఇరాన్ చమురు కేంద్రాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడడం వల్ల కూడా చమురు ధరలకు రెక్కలొచ్చాయి. తమపై దాడులు ఇలాగే కొనసాగితే బ్యారెల్ చమురును 200 డాలర్లకు పెంచేస్తామని ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇప్పటికే గల్ఫ్ దేశాలకు హెచ్చరిక జారీ చేసింది. కేవలం చమురు రంగమే కాదు చమురు వినియోగంపై ఆధారపడి ఉన్న అని పరిశ్రమలపై యుద్ధ ప్రభావం పడింది. వైరి యుద్ధాల పక్షాల సవాళ్ల పరిస్థితి ఏమోగానీ ఇప్పటికీ మానవ సమాజఅవసరాలు స్తంభించిపోయాయి. భారత దేశ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ మీద, సాధారణ గృహావసరాల మీద పెద్ద దెబ్బే పడింది. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో కూడా న్యూస్ ప్రింట్, తదితర ఉత్పత్తుల మీద కాస్తంత భారం పడినా అది కేవలం ఆ రంగానికే పరిమితమైంది. అప్పట్లో గృహవినియోగ వస్తువుల మీద చెప్పుకోదగిన ప్రభావం ఏమీలేదు కనుక సామాన్యులు బతికిపోయారు. ఈసారలా కాదు. అమెరికా దూరాలోచన లేని దురాలోచన వల్ల యుద్ధసన్నద్ధత, లేకుండానే ఇరాన్ మీద విరుచుకుపడిన ప్రయత్నం బెడిసికొట్టింది. యుద్ధంలో విజేతలెవరు, పరాజితులెవరో తేలేముందరే సామాన్య ప్రజానీకాన్ని చావుదెబ్బ కొట్టారు. వంటగ్యాస్ తయారీ పరిశ్రమ కుదేలవడంతో గతంలో సిలిండర్ బుకింగ్ వ్యవధి21 రోజులుండగా తాజాగా 25 రోజులకి పెంచారు. దేశంలో పెట్రోల్, డిజిల్ ధరలు అప్రకటితంగా పెరిగాయి. ఇప్పట్లో వాటి ధరలను పెంచబోమని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్‌లో ఒడుదొడుకులు కారణంగా పరోక్షంగా చెల్లింపులు పెరగవనే గ్యారెంటీ ఏమీ లేదు. వినియోగదారులు ఇలాంటి భారాన్నుంచి తప్పించుకోలేదు. ఇప్పటికే పప్పుదినుసులు, నూనెగింజలు, వంట నూనెలధరలు పెరగడంతో వంటిళ్లన్నీ ఖాళీ అయిపోయాయి. ఫిబ్రవరి 28న యుద్ధఛాయలు కమ్ముకోగానే ఇరాన్, హార్మూజ్‌ల బంధం తెలిసిన కార్పొరేట్ వ్యాపారులు వారి మాల్స్‌లో ధరలను దాచేయడం, లేదా ఆయిల్ తదితర సరుకుల్లేవని బోర్డులు పెట్టేశారు. వాటిని వెలికి తీసి అమ్మించడంలో ప్రభుత్వం తక్షణ చర్యల్ని చేపట్టడానికి ఆలస్యమైంది. నెల జీతాలు చేతికందేసరికి నిత్యావసర వస్తువుల రేట్లుబాగాపెరిగాయి. 'నో స్టాక్' బోర్డులతో కృత్రిమ కొరత మార్కెట్‌లో తాండవిస్తోంది. హోల్‌సేల్ మార్కెట్లకు కూడా ఎలాంటి మినహాయింపు లేదు. ఎల్పీజిస్టాక్ లేక గ్యాస్ కంపెనీలు చేతులెత్తేసే పరిస్థితి కనుచూపు మేరలో కనపడుతోంది. ఇప్పటికీ బొంబయి, బెంగళూరు, కోల్‌కతా, చెన్నైవంటి ప్రధాన నగరాల్లో కమర్షియల్ ఎల్‌పిజి సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. కొన్ని హోటళ్లను తినుబండారాలు ప్రస్తుత ధరలకు అందించలేక మూతబడ్డాయి. ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ఎల్‌పిజి సిలెండర్లకిచ్చారు. ప్రస్తుతం ఉన్న స్టాక్ అయిపోతే గృహ వినియోగదారుల పరిస్థితి ఇరకాటమే. ఖతార్ నుంచి ఎల్ఎన్‌జి సరఫరా ఆగిపోవడంలో భారతదేశ గృహ వినియోగంపై పెద్ద దెబ్బ తగిలింది. దాదాపు 88శాతం దేశీయ ఇంధన అవసరాలు గల్ఫ్‌దేశాల మీదనే ఆధారపడ్డాయి. మరో ప్రత్యామ్నాయమేదీ కనపడదు. దేశంలోని ముడిచమురు, పెట్రోలియం, ఉత్పత్తులు ఆరువారాల వరకు వస్తాయని కేంద్రమే ప్రకటించింది. కేంద్రం వాణిజ్య సిలిండర్లపై తీసుకున్న నిర్ణయంతో చిన్నమధ్యతరగతి రెస్టారెంట్లు, మెస్‌లు, టిఫిన్ సెంటర్లకు గ్యాస్ బండల కొరత ఏర్పడింది. పెద్దపెద్ద నగరాల్లో 25శాతం హోటళ్లు మూసేసిన వాటిలో ఉంటాయని అంచనా. డొమెస్టిక్ సిలెండర్లకు కొరత రానీకుండా చూడగలమని ప్రభుత్వం ఎంతో ధీమాలో ఉంది. సహజవాయువు దేశీయంగా కొంత తయారవుతుంది. వాటి సరఫరాకు ప్రభుత్వం రేషన్‌పెట్టింది. ప్రభుత్వ ఆదేశాలమేరకు చమురు శుద్ధికర్మాగారాలు ఎల్పీజీ ఉత్పత్తిని 10శాతం పెంచాయి. గ్యాస్ సిలిండర్లు పక్కదారి పట్టకుండా కృత్రిమకొరత సృష్టించే వారిపై అత్యవసర సేవల నిర్వహణ చట్టాన్ని (ఎస్మా)అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్ కల్చర్ ఉన్నప్రధాన నగరాల్లో హాస్టళ్లు గ్యాస్ సిలిండర్ల సమస్యను ఎదుర్కొంటున్నాయి. విద్యార్థులకు పూర్తిస్థాయి ఆహార పదార్థాలను అందించలేక విలవిల్లాడుతున్నాయి. దేశంలో రూ.6.6 లక్షల కోట్ల విలువైన హోటల్ పరిశ్రమపై, వంటగ్యాస్ కొరత వలన పరోక్షంగా ఆ రంగానికి చెందిన ఉద్యోగులు ఉపాధి కోల్పోతారని రెస్టారెంట్ల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనదేశంలో 3.1 కోట్ల టన్నుల ఎల్‌పిజి అవసరముంది. ఇందులో 87 శాతం గృహోపయోగం కోసమే. మిగిలిన వాణిజ్య గ్యాస్ అవసరాలపై కేంద్రం నిషేధం పెట్టడంతో ఆతిథ్యరంగం మూలన పడింది. ఆ అవసరాలపై కోత పెట్టకుండా ఉంటే బాగుండేది. యుద్ధం ఆగినా ఆగకున్నా వంటింటి సెగ ఇప్పట్లో ఆరిపోయేది, ఆగిపోయేది కాదు.

మీరు తప్ప మీకు శాంతిని ఎవరూ ప్రసాదించలేరు. సిద్ధాంతాలు పాలనలో విజయాన్ని సాధించినప్పుడే, మీకు మానసిక శాంతి లభిస్తుంది.



ఎమర్సన్

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### చౌకబారు వ్యాఖ్యలు

మోడీ చాలా రోజుల క్రితమే దేశంలో ముస్లిం జనాభా పెరిగిపోతుంది. అందువలన హిందువులు కూడా ఎక్కువ మందిని కనండి అనిచెప్పాడు. ఆవారసత్వాన్ని చంద్రబాబు పుచ్చుకున్నట్లుగా కనిపిస్తోంది. అది మంచి ఆలోచన కాదు. పిల్లలను ఎక్కువ మందిని కనండి, అవసరమయితే త్రిబుల్ బెడ్‌రూం ఉన్న ఇల్లు కట్టిస్తాం, బియ్యం కోటాఎక్కువ ఇస్తాం, ఒక్కోపిల్లలకు 25 వేలు ఇస్తాం అని చంద్రబాబుగారు నిన్న చెప్పటం ఆయనహుందాను తగ్గించేవిగాఉన్నాయి. ఒకరిద్దరిని కన్నవారేసరిగా చదివించలేక మధ్యలోనే చదువులాపేస్తున్నారు. ఆర్థికభారంతో ఆస్తులు అమ్ముకుంటున్నారు. పూర్వం ఉమ్మడి కుటుంబాలుండేవి. ఆరోజుల్లో పరిస్థితులు వేరు. నలభై సంవత్సరాల క్రితమే ఒకరు లేక ఇద్దరుచాలు అని కుటుంబనియంత్రణ పాటించమని ప్రభుత్వం చెప్పింది. జనాభా పెరిగితే సమస్యలు పెరుగుతాయి. దీనిపై ఆలోచించాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశంజిల్లా

### గిరిజన ఫ్రీడమ్ స్కూల్స్?

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న గిరిజన ఫ్రిడమ్స్ స్కూల్స్‌ను మరింతగా అభివృద్ధిచేయవలసిన అవసరంఉంది. బడ్జెట్ లోప్రత్యేకంగానిధులుకేటాయించాలి. విద్యార్థులకు ఆటలు, పాటలు, డ్రాయింగ్, మ్యూజిక్, సంస్కృతిక కార్యక్రమంలు ఏర్పాటు చేయాలి. చారిత్రాత్మకమైన ప్రదేశాలను సందర్శించే విధంగా నామమాత్రపు ఫీజుతో విహారయాత్రలు ఏర్పాటుచేయాలి. గిరిజన విద్యార్థులకుసంస్కృతి, సాంప్రదాయాలు మొదటగా నేర్పి విద్యవైపు వారి దృష్టి మళ్లించే విధంగా చూడాలి.

-రాపాక రవీందర్, జనగాం

### డబుల్ బెడ్‌రూమ్స్ కేటాయించాలి

ప్రస్తుతంమున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేటి వరకైనా గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇప్పుడు ప్రస్తుతంఉన్నప్రభుత్వం ఇవ్వటానికేఅభ్యంతరం ఏమిటి? ఓట్ బ్యాంకింగ్ తప్ప మరోటి లేదా అయినా లబ్ధిదారులకు కేటాయించాల్సిన కేటాయిస్తే తమకేమి నష్టం వాటిల్లుందోఅర్థం కావటంలేదు. ప్రజలను ఒక రకమైన ఆందోళనకు గురి చేస్తున్నారు. గతప్రభుత్వంలో డబుల్ బెడ్రూం లోనిర్మించి ఇంతవరకు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు.

- సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

### భారత్‌కు కొత్త సవాళ్లు

భారతదేశం శతాబ్దాలుగా వివిధ సంస్కృతులు, భిన్న ప్రజల సమ్మేళనంగా నిలిచింది. ప్రపంచంలో ఎక్కడైనాసంక్షోభం వచ్చినప్పుడు మానవతా దృక్పథంతో ఆశ్రయం కల్పించిన దేశంగా భారత్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఇటీవల ఈశాన్య భారతంలో మయన్మార్, మణిపూర్ ప్రాంతాల నుంచి వచ్చిన శరణార్థుల పరిస్థితి మాత్రం అనిశ్చితితో నిండినదిగా మారింది. వారి జీవితం భవిష్యత్తు ఏమిటన్న ప్రశ్న మధ్యలో నిలిచిపోయినట్లుగా కనిపిస్తోంది. మయన్మార్‌లో రాజకీయ అస్థిరత, సైనిక పాలన, అంతర్గత ఘర్షణలు తీవ్రంగా పెరగడంతో వేలాది మంది ప్రజలు సురక్షితమైన ఆశ్రయం కోసం పొరుగు దేశాల వైపు తరలివచ్చారు. భారతదేశంలోని మిజోరాం, మణిపూర్, నాగాలాండ్ వంటి ఈశాన్యరాష్ట్రాలు భౌగోళికంగా మయన్మార్‌కు సమీపంలో ఉండటంతో అక్కడికి శరణార్థుల ప్రవాహం పెరిగింది. మరోవైపు మణిపూర్‌లో గత కొంతకాలంగా కొనసాగుతున్న జాతి ఘర్షణలు కూడా అనేక కుటుంబాలను తమ ఇళ్లను విడిచిపెట్టే పరిస్థితికి నెట్టాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### హెల్మెట్ తప్పనిసరి

ఇటీవల సంభవిస్తున్న రోడ్‌ప్రమాదాల్లో హెచ్చుశాతం మోటార్ వాహన చోదకులు సరైన హెల్మెట్ ధరించక, లేక ఉన్నప్పటికీ ఎదుటి వాహనాన్ని ఢీకొట్టడం వల్ల తలభాగం మరణానికి కారణమవుతుంది. ఇది ఒక రక్షణకు ముఖ్య వస్తువు, దాన్ని ధరించడం తప్పనిసరి చేయాలి. అందరూ విధిగా చేస్తే ట్రాఫిక్ పోలీసులు లేని వారికి తనిఖీ అవసరమే లేదు. తిరుపతిలో దీన్ని ప్రత్యేకంగా ప్రచార భాగంలో ప్రత్యేకంగా తయారుచేసిన హెల్మెట్లు బంక్ ద్వారా అమ్మకం చేశారు. ఇదిరెండు లాభాలు ఇస్తుంది. మిగిలినజిల్లాల్లో కూడా ఇదేచేస్తే దాన్నేకొని ధరిస్తారు.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### సమాజానికి కొత్త సవాలు

నేటికాలంలో సోషల్ మీడియా మన జీవితాల్లో భాగమైపోయింది. సమాచారం పంచుకోవడం, వ్యక్తిగత అభిరుచులను వ్యక్తపరచడం, ప్రపంచంతో మమేకం కావడం వంటి అనేక ప్రయోజనాలను ఇది అందిస్తోంది. అయితే అదే సమయంలో దీనిదుర్వినియోగం సమాజానికి తీవ్రమైన ప్రమాదాలను కూడా సృష్టిస్తోంది. ముఖ్యంగా వదంతులు, అబద్ధపు వార్తలు వేగంగా వ్యాప్తి చెందడానికి సోషల్ మీడియా వేదిక అవుతోంది..

- కె.రామారావు, నల్గొండజిల్లా

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రాణాంతకంగా మారుతున్న 'ఫైర్‌వర్క్స్'!

**చాలా సంవత్సరాల క్రిందట, దీపావళి మందులషాపులు ఊరికి దూరంగా ఉండేవి. పొరపాటున ప్రమాదాలు సంభవిస్తే నష్టాలు తక్కువగా ఉండే విధంగా జాగ్రత్త చర్యలు అవలంబిస్తున్నారని అర్థమయ్యేది. పోలీసులు ఆ షాపుల దగ్గర ఎక్కువ సంఖ్యలో కనపడుతూ వ్యాపారస్థులు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారా లేదా అని తని ఖీలు మాటిమాటికి చేస్తుండేవారు. టైం ప్రకారం షాపులు తెరవటం, మూసివేయటం జరిగేది. షాపు, షాపుకు మధ్య ఎంత మంది దీపావళి సామాగ్రిని కొనుక్కోటానికి వచ్చినా తిరగటానికీ, అవసరమొస్తే వెంటనే వెళ్లి పోవటానికి వీలుగా ఏర్పాట్లు ఉండేవి. ప్రస్తుతం ఎక్కువ దుకాణాలు రద్దీగా ఉన్న స్థలాల్లో కరువవుతున్నాయి. ఈ ప్రేలుడు పదార్థాలు తయారీ చేసే యూనిట్లు కూడా ఊళ్లకు దూరంగా ఉండటం తో ప్రమాదాలు జరిగినా నష్టం తక్కువగా ఉండేది. ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉండేవి. సంతోషం కోసం ఉండే టపాసులు, షాపులూ, సంతాపాన్ని కలిగించని రీతిలో ఉండటం అవశ్యం అని అనుభవాలు చెప్తున్నాయి.**



రావులపాటి సీతారాంరావు

టపాసులు ప్రాణాంతకంగా మారాయి. రక్షణకు సంబంధించిన నియమాలు పాటించకుండా బజారు దుకాణాల్లో అమ్మేసరుకుల్లా, ప్రతిచోటా, దీపావళి పేరుతో వచ్చే మందులూ, ఫైర్‌వర్క్స్, టపాసులూ తయారు చేయడానికి సాంకేతికంగా నిపుణతలేని మామూలు పనివారితో, పేదవారితో పబ్బంగడుపుకుంటూ వ్యాపారం చేస్తున్న వారిని తక్షణం నియంత్రించకపోతే ఈ ప్రమాదాల్లో పెక్కుమంది ప్రాణాలు కోల్పోయే అవకాశం రోజురోజుకూ పెరుగుతున్నది. జాగ్రత్తలు తీసుకోవటమనేది లేని వ్యాపారంగా ఈ ప్రమాదకరమైన బాణాసంచా తయారీ – తయారయింది. 'హై రిస్క్ ఇండస్ట్రీగా మారిన ఈ బాణా సంచా వ్యాపారాన్ని నియంత్రించకపోతే, అగ్ని ప్రమాదాల సంఖ్యతో పాటు ప్రాణాలు కోల్పోయే వారిసంఖ్య రోజురోజుకూ పెరగక తప్పదు. అక్టోబర్ నెల 2025 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాలో గ్రాండ్‌ఫైర్ వర్క్స్ పెద్ద విస్ఫోటనకు గురై పదిమంది ప్రాణాలను బలిగొంది. శ్రీ సూర్యా ఫైర్ క్రాకర్స్ వేటపాలెం గ్రామంలో ప్రేలిపోవటం వల్ల అక్కడున్న ఇరవైమంది ప్రాణాలు నిష్కారణంగా కోల్పోయారు. ఈరెండు యూనిట్లు ఒకే వ్యక్తికి చెందినవని తర్వాత గుర్తించారు. నిజానికి వేటపాలెం యూనిట్‌ను ఆపివేయమని జనవరి నెలలోనే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా పండగ ఆర్డర్లతో మునిగితేలుతున్న ఈ సంస్థవల్ల మరో గండం ప్రాణాంతకంగా మారటం శోచనీయం. దీపావళి మందులు ఎవరికైనా అమిత ఇష్టాన్ని కలుగచేస్తాయి. కానీ గడిచిన రోజుల్లో ప్రేలుడు పదార్థాలను ఈ మందులలో చాలా తక్కువగా వాడటం వల్ల ఆపద కలగని పరిస్థితులుండేవి. కాకరపువ్వొత్తులు, వెన్నెల మడుగులు, బొంగరాలు, సీమటపాకాయలతో ఏ వీధి చూసినా ఆ రోజులో సందడి సందడిగా ఉండటంతోపాటు పండగలంటే అమిత ఆనందాన్ని ముఖ్యంగా పిల్లలకు కలిగించేవి. మహారాష్ట్రలోని నాగపూర్, తమిళనాడులోని శివకాశీ ఈ ఫైర్‌వర్క్‌కు ప్రసిద్ధి. ఆ రోజుల్లో పెద్దగా 'సేఫ్టీ' నియమాలు పాటించకపోయినా, ప్రేలుడు పదార్థాల వాడకం ఈ ఫైర్‌వర్క్ తయారీలో తక్కువ పాళ్లలో ఉండటం చేత ప్రమాదాలు పెద్దస్థాయిలో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయే రీతిలో ఉండకపోయేవి! కొన్ని జరిగినా, మీడియా ఆ రోజుల్లో ఈ ప్రమాదాలకు ఇచ్చే ప్రచారంవల్ల, ప్రాణనష్టం, ఆస్థినష్టం, సంభవిస్తాయన్న ఎరుకతో ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకొనేవి. అప్పుడు ఈ ఫైర్‌వర్క్స్ మీద నిఘా వేసే అధికారులు కూడా బాధ్యతగా వ్యవహరించి చర్యలు తగు రీతిలోఎప్పటికప్పుడు తీసుకుంటుండేవారు. ఈ రోజుల్లో జరిగే ప్రమాదాలను తల్చుకుంటేనే వొళ్లు గగుర్పొడుస్తుంది. నాగపూర్‌లో ఈ మధ్య ఈ యస్.బి.ఎల్





ఎనర్జీ ఫ్యాక్టరీలో జరిగిన ప్రేలుడు ప్రమాదంలో 90 మంది పనిచేసేవారు మరణించారు. అందులో చాలా మంది మహిళలు! యూనిట్లలోనే గత రెండు సంవత్సరాలలో జరిగిన ప్రమాదాలలో ఇరవై మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు! ఇద్దరు సోలార్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో కూడా చనిపోయిన సంగతి కూడా గుర్తుకు తెచ్చుకోవాలి. ఈ సోలార్ యూనిట్ చాలా పెద్దది. దీని అధిపతికి పద్మశ్రీ పురస్కారం కూడా లభించింది. అక్కడి స్థానికులు ఈ పురస్కారం సంగతి చెబుతూ, దాన్నిబట్టే తెలుస్తుంది. ఎలాంటి రాజకీయ మూలాలున్నాయో ఆ అధిపతికి అని ఎగతాళిగా మాట్లాడుతారు. ఈ రాజకీయ సంబంధాల వల్ల ఇలాంటివన్నీ చట్టాలను అమలు చేసే అధికారులు, చూసీచూడనట్లు ఉండటం అలవాటు అయిపోయింది. దానివల్ల అలాంటి యూనిట్లలో పనిచేసే ఉద్యోగస్థులకు రక్షణ కరువయిపోయింది. ప్రభుత్వాలు పట్టించుకున్నా ప్రమాదాలు తగ్గుమొహం పట్టడం లేదన్నది స్థానికుల బాధ. తగురీతిలో రక్షణ చర్యలతోపాటు యూనిట్ల అధిపతుల మీద చట్టప్రకారం చర్యలు తీసుకోకపోవటం వల్ల ప్రమాదాల దారి ప్రమాదాలదీ, వ్యాపారాల దారి, వ్యాపారాలదీ అవుతున్నదని ప్రజలు వాపోతున్నారు. నిజానికి నాగపూర్‌లోనే పెట్రోలియం, ప్రేలుడుకు సంబంధించిన రక్షణ చర్యలు తీసుకొనే సేఫ్టీ ఆర్గనైజేషన్ ఉంది. ఈ సంస్థలో పనిచేసే వారి నిర్వాకానికి ఫలితంగా ఎంతో మందిపై సిబిఐ విచారణలు కూడా జరిగాయి. లైసెన్సులు, లంచాలు తీసుకొని జారీ చేస్తున్నారనే అభియోగంతో పి.ఇ.యస్.ఓ అధికారుల మీద ఇలాంటి విచారణలు జరిగినా, ఆశించిన రీతిలో ప్రేలుళ్లు, ప్రాణనష్టం ఆగటంలేదు. చేయాల్సింది రక్షణచర్యల విధానాల గురించి సమగ్రంగా సమీక్షించటంతోపాటు, ఇలాంటి సంస్థలలోని పై అధికారులు ఏ విధంగా పర్యవేక్షిస్తున్నారనే విషయాన్ని కూడా లోతుగా అధ్యయనం చేసి కావల్సిన రీతిలో గైడ్‌లైన్స్ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బిజినెస్ చేసే వారు ఏ విధంగా శ్రద్ధపెట్టి రక్షణ నిమిత్తం సౌకర్యవంతమైన ప్రమాదరహితమైన వాతావరణాన్ని కల్పిస్తున్నారో కూడా విచారణలలో తేల్చి తగు సూచనలతోపాటు, ఉల్లంఘించిన వ్యాపారస్థులపై లైసెన్సులు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ చర్యలు కూడా తీసుకున్నప్పుడే ఈ ప్రేలుళ్లకు సంబంధించిన ప్రాణనష్టం, ఆస్థినష్టం ఆగదు. శివకాసిలో ఇలాంటి ప్రమాదాలు జరిగే యూనిట్లలో బాలకార్మికులు పనిచేయకుండా చూడటంతోపాటు ప్రమాదాల నివారణ నిమిత్తం కఠినమైన చర్యలు ప్రభుత్వాలు తీసుకోవడంతో, ప్రేలుళ్ల సంఖ్యతగ్గి, ప్రాణనష్టం కూడా ఈ మధ్యన తగ్గిపోవటం చెప్పుకోవాల్సిన అవసరం ఉంది. చాలా సంవత్సరాల క్రిందట, దీపావళి మందులషాపులు ఊరికి దూరంగా ఉండేవి. పొరపాటున ప్రమాదాలు సంభవిస్తే నష్టాలు తక్కువగా ఉండే విధంగా జాగ్రత్త చర్యలు అవలంబిస్తున్నారని అర్థమయ్యేది. పోలీసులు ఆ షాపులదగ్గర ఎక్కువ సంఖ్యలో కనపడుతూ వ్యాపారస్థులు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారా లేదా అని తనిఖీలు మాటిమాటికి చేస్తుండేవారు. టైం ప్రకారం షాపులు తెరవటం, మూసివేయటం జరిగేది. షాపు, షాపుకు మధ్య ఎంత మంది దీపావళి సామాగ్రిని కొనుక్కోటానికి వచ్చినా తిరగటానికీ, అవసరమొస్తే వెంటనే వెళ్లిపోవటానికి వీలుగా ఏర్పాట్లు ఉండేవి. ప్రస్తుతం ఎక్కువ దుకాణాలు రద్దీగా ఉన్న స్థలాల్లో కరువవుతున్నాయి. ఈ ప్రేలుడు పదార్థాలు తయారీ చేసే యూనిట్లు కూడా ఊళ్లకు దూరంగా ఉండటంతో ప్రమాదాలు జరిగినా నష్టం తక్కువగా ఉండేది. ఫైర్ ఇంజన్లు అందుబాటులో ఉండేవి. సంతోషం కోసం ఉండే టపాసులు, షాపులూ, సంతాపాన్ని కలిగించని రీతిలో ఉండటం అవశ్యం అని అనుభవాలు చెప్తున్నాయి. •

# సమయాన్ని హరించేస్తున్న సోషల్ మీడియా!

తరిగోపుల నారాయణస్వామి

ఇప్పటి ఆధునిక కాలంలో మనిషి జీవన విధానాన్ని అత్యంత వేగంగా మార్చిన పరిణామాలలో ఒకటి సామాజిక మాధ్యమాల విస్తరణ. చేతిలో చిన్న మొబైల్ ఫోన్ ఉంటే ప్రపంచం మొత్తం మన ముందే ఉన్నట్లు అనిపించే స్థితి ఏర్పడింది. ఒకప్పుడు వార్తలు తెలుసుకోవడానికి పత్రికలు చదవడం, పెద్దలతో చర్చించడం, పుస్తకాలు పరిశీలించడం వంటి పద్ధతులు ఉండేవి. ఇప్పుడు అనేక విషయాలు కొన్ని క్షణాల్లోనే మన చేతిలోకి చేరుతున్నాయి. ఈ మార్పు మనిషికి అనేక సౌకర్యాలను అందించినప్పటికీ అదే సమయంలో కొత్త సమస్యలను కూడా తీసుకొచ్చింది. ముఖ్యంగా సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆధారపడటం వల్ల మన జీవన శైలి క్రమంగా మారిపోతున్నది. సామాజిక మాధ్యమాలు మొదట్లో మనుషుల మధ్య సంబంధాలను బలపరచడానికి ఉపయోగపడే సాధనాలుగా కనిపించాయి. దూర ప్రాంతాల్లో ఉన్న స్నేహితులు, బంధువులు సులభంగా ఒకరితో ఒకరు మాట్లాడుకునే అవకాశం ఏర్పడింది. సమాజంలో జరుగుతున్న విషయాలను వెంటనే తెలుసుకునే అవకాశం కూడా కలిగింది. విద్యార్థులకు కూడా కొత్త విషయాలను తెలుసుకోవడానికి విస్తృత అవకాశాలు అందుబాటులోకి వచ్చాయి. కానీ కాలక్రమేణా ఈ సౌకర్యం అలవాటుగా మారి, కొందరికి వ్యసనంగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పుడు చాలా మంది ఉదయం లేవగానే ముందుగా మొబైల్ ఫోన్ వైపు చూస్తున్నారు. రాత్రి పడుకునే వరకు కూడా అదే అలవాటు కొనసాగుతోంది. రోజులో ఎంత సమయం గడిచిపోయిందో కూడా తెలియకుండా సామాజిక మాధ్యమాలలో మునిగిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా యువతలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. చదువుకు కేటాయించాల్సిన సమయం, కుటుంబంతో గడపాల్సిన సమయం, విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం అన్నీకూడా కొన్నిసార్లు ఈమాధ్యమాలకే వెచ్చించబడుతున్నాయి. ఈ పరిస్థితి మన ఆరోగ్యం పైనా ప్రభావం చూపుతోంది. ఎక్కువసేపు మొబైల్ స్క్రీన్ వైపు చూడడం వల్ల కళ్లకు ఇబ్బందులు కలుగుతున్నాయి. శారీరక కదలికలు తగ్గిపోవడం వల్ల అలసట, నిద్రలేమివంటి సమస్యలు కూడా వస్తున్నాయి. అంతేకాదు ఇతరుల జీవితాలను నిరంతరం చూసి మన జీవితాన్ని పోల్చుకోవడం వల్ల మానసిక ఒత్తిడి కూడా పెరుగుతోంది. కొన్నిసార్లు అసత్య సమాచారం వేగంగా వ్యాపించి సమాజంలో అపోహలు కలిగించే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల నుండి కొంతకాలం దూరంగా ఉండడం అనే ఆలోచన ప్రాధాన్యం పొందుతోంది. దీనినే సామాజిక మాధ్యమాల విశ్రాంతి అని చెప్పవచ్చు. అంటే రోజులో కొంత సమయం లేదా కొన్నిరోజులు పూర్తిగా ఈ మాధ్యమాల నుండి దూరంగా గడపడం. ఇలా చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుంది. మన చుట్టూ ఉన్న నిజమైన ప్రపంచాన్ని మరింతగా అనుభవించే అవకాశంకలుగుతుంది. సామాజిక మాధ్యమాల నుండి కొంత దూరంగా ఉన్నప్పుడు మనకు కొత్త అనుభవాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా మాట్లాడుకునే అవకాశం పెరుగుతుంది. పుస్తకాలు చదవడానికి సమయం దొరుకుతుంది. ప్రకృతి మధ్యలో నడవడం, ఆలోచనలు చేసుకోవడం, సృజనాత్మక పనులు చేయడం వంటి అలవాట్లు పెరుగుతాయి. ముఖ్యంగా విద్యార్థులకు ఇది ఎంతో ప్రయోజనకరం. వారు చదువుపై మరింత ఏకాగ్రత సాధించగలుగుతారు. ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే మనుషుల మధ్య ప్రత్యక్ష సంబంధాలు బలపడతాయి. ఒకప్పుడు పల్లెల్లో, పట్టణాల్లో ప్రజలు ఒకరితో ఒకరు కలుసుకుని మాట్లాడుకునే సంస్కృతి ఉండేది. ఇప్పుడు ఆ సంస్కృతి కొంత తగ్గిపోయింది. సామాజిక మాధ్యమాల విశ్రాంతి తీసుకోవడం ద్వారా మళ్లీ ఆ ఆత్మీయత పెరిగే అవకాశం ఉంది. అయితే సామాజిక మాధ్యమాలను పూర్తిగా వదిలేయడం అవసరం లేదు. అవి సరైన విధంగా ఉపయోగిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ముఖ్యమైనది సమయ నియంత్రణ. రోజులో ఎంత సమయం వినియోగించాలి అనే విషయం ప్రతి ఒక్కరూ నిర్ణయించుకోవాలి. అవసరం లేని విషయాలపై ఎక్కువ సమయం గడపకుండా జాగ్రత్త పడాలి. ముఖ్యంగా పిల్లలు, యువత ఈ విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారికి సరైన మార్గదర్శనం ఇవ్వాలి. సాంకేతిక అభివృద్ధి మనిషి జీవితాన్ని సులభతరం చేయడానికి వచ్చినదే కానీ మన జీవితాన్ని పూర్తిగా ఆక్రమించడానికి కాదు అనే విషయం గుర్తుంచుకోవాలి. మన చేతిలో ఉన్న సాధనాలను మనమే నియంత్రించాలి కానీ అవి మనలను నియంత్రించే పరిస్థితి రాకూడదు. అందుకే అప్పుడప్పుడు సామాజిక మాధ్యమాల నుండి కొంతవిశ్రాంతి తీసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరం. అది మన ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా మన ఆలోచనలను కూడా మరింత స్పష్టంగా మార్చుతుంది. మన సమయాన్ని సార్థకంగా వినియోగించడం మన చేతుల్లోనే ఉంది. కుటుంబం, సమాజం, ప్రకృతి, పుస్తకాలు ఇవన్నీ మన జీవితాన్ని సంపన్నం చేసే అంశాలు. వాటికి తగిన సమయం కేటాయించినప్పుడే మన జీవితం సమతుల్యంగా ఉంటుంది. అందువల్ల సాంకేతిక సాధనాలను జాగ్రత్తగా ఉపయోగిస్తూ, అప్పుడప్పుడు వాటి నుండి దూరంగా ఉండే అలవాటు పెంపొందించుకోవడం ద్వారా మన జీవితం మరింత ఆరోగ్యకరంగా సంతోషకరంగా మారుతుంది. •

# స్వచ్ఛమైన 'మంచినీరు' మనకు లభించదా?

ముద్దం నరసింహ స్వామి

ప్రకృతిలోని ప్రతి జీవికి నీరు ప్రాణాధారం. కానీకోట్లాది ప్రజలు నివసించే ఆధునిక సమాజాల్లో కూడా స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఇంకా పెద్ద సవాలుగానే మిగిలింది. గ్రామాల నుంచి మహానగరాల వరకు పరిశుభ్రమైన నీటి సరఫరా వ్యవస్థలు పలు చోట్ల విఫలమవుతున్నాయి. అధిక జనాభా, బలహీనమైన మౌలిక వసతులు, పరిపాలనా నిర్లక్ష్యం కలిసి ఈసమస్యను తీవ్రమైనప్రజారోగ్య సంక్షోభంగా మారుస్తున్నాయి. స్వచ్ఛమైన తాగునీటిని పొందడం ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని భారత అత్యున్నత న్యాయస్థానం పలుమార్లు స్పష్టం చేసింది. జీవించే హక్కులో పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్యకర వాతావరణం అంతర్భాగమని కూడా పేర్కొంది. అయితే ఈ గొప్ప మాటలు చాలా వరకు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వాల స్థానిక సంస్థల అలసత్వం, పర్యవేక్షణ లోపాలు కలిసి తాగునీటిని విషతుల్యంగా మార్చుతున్నాయి. దేశవ్యాప్తంగా తరచూ వెలుగుచూస్తున్న డయేరియా, కలరా, లెప్టోస్పైరోసిస్ వంటివ్యాధుల కేసులు ఈ వైఫల్యానికి నిలుస్తున్నాయి. వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ సమస్య మరింత తీవ్రతరమవుతోంది. బెంగళూరు, గాంధీనగర్, గ్రేటర్ నోయిడా వంటి మహానగరాల నుంచి హైదరాబాద్, ఆదిలాబాద్, విజయవాడ, గుంటూరు, ఆళ్లగడ్డ వంటి పట్టణాల వరకు తాగునీటి కాలుష్యం ప్రజారోగ్యాన్ని సంక్షోభంలోకి నెడుతోంది. మలిన జలాల కారణంగా విజయనగరం జిల్లాలో డయేరియా విజృంభించగా, తాజాగా శ్రీకాకుళం జిల్లాలో కలకలం రేపుతోంది. దేశంలోని అనేక ప్రాంతాల్లో పాతబడిన పైప్‌లైన్లు పగుళ్లబారిపోయి డ్రైనేజీల్లోంచి వెళ్తున్నాయి. దీంతో మురుగు నీరు తాగునీటిలో కలవడం సాధారణమైపోయింది. బోర్ల చుట్టూ చెత్త పేరుకుపోవడం, నీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, క్లోరినేషన్ సక్రమంగా జరగకపోవడం వంటి నిర్లక్ష్యాలు ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్నాయి. గణాంకాలు పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా తెలియజేస్తున్నాయి. గత ఐదేళ్లలో దేశవ్యాప్తంగా దాదాపు 1.54 కోట్ల డయేరియా కేసులు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 3.95 లక్షలు, తెలంగాణలో 3.29 లక్షల కేసులు నమోదవడం ఆందోళనకరం. 2021లో 217కలరా కేసులు నమోదవగా, గత ఏడాదికి అవి 22 రెట్లుపెరగడం పరిస్థితి నియంత్రణలో లేదని సూచిస్తోంది. లెప్టో స్పైరోసిస్ కేసులు కూడా గణనీయంగా పెరిగాయి. అపరిశుభ్రమైననీటి వల్ల ఏటా కోట్లాది మంది అనారోగ్యానికి గురవుతున్నారని అంచనాలు చెబుతున్నాయి. ప్రతి ఇంటికీ శుద్ధమైన నీరు అందిస్తే లక్షలాది అర్ధాంతర మరణాలను నివారించవచ్చని



ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే హెచ్చరించింది. అయినప్పటికీ పాలకుల అలక్ష్యం మారడం లేదు. వేసవి కాలంలో బ్యాక్టీరియా వేగంగా వ్యాపించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల నీటి శుద్ధిచర్యలు మరింత కట్టుదిట్టంగా ఉండాలి. కానీ అనేక ప్రాంతాల్లో నీటినమూనాల పరీక్షలు కూడా సక్రమంగాజరగడం లేదు. ఇటీవల నిర్వహించిన సర్వేలోగృహాలకు సరఫరా అవుతున్న నీటిలోదాదాపు 24శాతం నమూనాలు ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. 485 పట్టణాల్లో కేవలం 46ప్రాంతాల్లో మాత్రమే నాణ్యమైన నీరు అందుతున్నట్లు వెల్లడైంది. ఒకవైపు దేశం అంతరిక్ష రంగంలో విజయాలను సాధిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో కీలక స్థానాన్ని సంపాదిస్తోంది. కానీ అదే సమయంలో ప్రాథమికమైన తాగునీటి భద్రతను నిర్ధారించలేకపోవడం అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. సాంకేతికంగా ముందంజలో ఉన్న దేశం ప్రజలకు సురక్షిత తాగునీరు అందించలేకపోతే ఆ పురోగతికి అర్థమేంటి? ఈ సమస్యకు పరిష్కారం అసాధ్యం కాదు. నీటి సరఫరా వ్యవస్థలను సమగ్రంగా పునరుద్ధరించడం అత్యవసరం. పాతపైప్‌లైన్లను తక్షణమే మార్చాలి. డ్రైనేజీ, మంచినీటి లైన్లను వేరు చేసి సాంకేతికంగా బలోపేతం చేయాలి. నీటి ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్, నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలి. ప్రతిమునిసిపాలిటీ, పంచాయతీ స్థాయిలో నీటి నాణ్యత పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసి పరీక్షా ఫలితాలను ప్రజలకు పారదర్శకంగా వెల్లడించా లి. గ్రామీణ ప్రాంతాల్లో బోర్లచుట్టూ పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలి. స్వచ్ఛతా కార్యక్రమాలకు పెట్టే ప్రతిరూపాయి ఆరోగ్య వ్యయాలను తగ్గించి సమాజానికి అనేక రెట్లులాభం చేకూరుస్తుందని అంచనాలు చెబుతున్నాయి. అంటే ఇది ఖర్చుకాదు దీర్ఘకాలిక పెట్టుబడి. ప్రజారోగ్యంపై పెట్టుబడి పెట్టడం ద్వారా వైద్య ఖర్చులు తగ్గుతాయి. పనిదినాల నష్టం తగ్గుతుంది, ఉత్పాదకత పెరుగుతుంది. దేశ ఆర్థికాభివృద్ధికీ ఇదికీలకం. ఇదే సమయంలో జల వనరుల సంరక్షణ కూడా సమానంగా ముఖ్యమైనది. పూడుకుపోయిన కుంటలు, చెరువులను పునరుద్ధరించడం, అడవులను పెంచడం, వాన నీటి సంరక్షణను తప్పనిసరి చేయడం వంటి చర్యలు చేపట్టాలి. నగరాల్లో కురిసే వాన నీరు డ్రైనేజీల్లోకిపోకుండా భూగర్భంలోకి ఇంకేలా వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. గ్రామస్థాయిలో నీటి కుంటలు, చెరువుల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. సేంద్రియ వ్యవసాయం వంటి పద్ధతుల ద్వారా నీటి వినియోగాన్ని కూడా సమతుల్యం చేయాలి. స్వచ్ఛమైన నీరు కేవలం ఒక సేవ కాదు, అది జీవనాధారం. దాన్నిఅందించడం ప్రభుత్వాల రాజ్యాంగబద్ధ కర్తవ్యం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిధులు, సాంకేతిక సహకారం అందించాలి. స్థానికసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రజలు కూడా నీటివనరుల సంరక్షణలో భాగస్వాములు కావాలి. సాంకేతికంగా గానీ, పలురంగాల్లో గానీ అభివృద్ధి ఎంత సాధిస్తున్నా, తాగునీరు కలుషితమై ప్రజలు ప్రాణాలు కోల్పోతే ఆ పురోగతికి విలువ ఉండదు. జీవించే హక్కు సజీవ సత్యంగా నిలవాలంటే ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందాలి. అదే నిజమైన అభివృద్ధి. •

# గల్ఫ్ భారతీయుల్ని వెనక్కి తెస్తాం



## గల్ఫ్‌లోని రాయబార కార్యాలయాలను అలర్ట్ చేశాం

## ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ రాజకీయం చేస్తోంది

## కోచి బహిరంగసభలో ప్రధాని మోడీ

**కోచి, మార్చి 11:** ప్రస్తుత సంక్షోభ సమయంలో విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని ఇండియాకు తీసుకొస్తామని, ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని ప్రధాని మోదీ అన్నారు. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేస్తోందని మోదీ విమర్శించారు. బుధవారం కేరళంలోని కోచిలో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి నిర్వహించిన కార్యక్రమంలో మోదీ పాల్గొన్నారు. త్వరలో కేరళం అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ అక్కడి కార్యక్రమానికి హాజరయ్యారు. విదేశాల్లో చిక్కుకున్న భారతీయుల్ని వదిలిపెట్టబోం. వారిని ఇండియాకు తీసుకొస్తాం. పశ్చిమాసియా సంక్షోభంలో మిగిలిపోయిన భారతీయులకు తగిన సాయం అందిస్తున్నాం. వాళ్ల క్షేమం, సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. గల్ఫ్ కంట్రీస్‌లో ఉన్న భారతీయుల రక్షణ కోసం చర్యలు తీసుకుంటున్న అక్కడి ప్రభుత్వాలకు కృతజ్ఞతలు. మనవారి సేవలు గుర్తించి, తగిన సహాయం అందిస్తున్నాయి అక్కడి ప్రభుత్వాలు. ఆయా దేశాల్లోని భారతీయ రాయబార కార్యాలయాలు కూడా నిరంతరం పని చేస్తున్నాయి. ఒకవైపు ప్రపంచం సంక్షోభంలో ఉంటే కాంగ్రెస్ పార్టీ దీనిపై రాజకీయం చేస్తోంది. రెచ్చగొట్టేలా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు చేస్తోంది. విదేశాల్లో ఉన్న భారతీయుల విషయంలో రాజకీయం చేయడం తగదు. ఒకవైపు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుంటే ఈ అంశంలో రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. డ్రోన్ల తయారీలో దేశ యువత సాధిస్తున్న విజయాల గురించి కాంగ్రెస్ యువరాజు (రాహుల్ గాంధీ)కి అవగాహన లేదు. కేరళ సహా అనేక రాష్ట్రాల్లోని స్టార్టప్‌లు డ్రోన్లు తయారు చేస్తున్నాయి. సంకుచిత మనస్తత్వం గలవారు ఇలాంటి దేశ ప్రగతిని చూడలేరు. బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమికి కేరళలో ఒక్కసారి అవకాశం ఇవ్వండి. అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చూపిస్తాం. రాష్ట్రం పేరును కేరళ నుంచి కేరళంనకు మార్చినందుకు ఆనందంగా ఉంది. గత ప్రభుత్వాలు కేరళకు ఏమీ చేయలేదు.

**ఖతార్‌నుంచి 1000 మంది భారతీయులు రాక**




**దోహా, మార్చి 11:** పశ్చిమాసియాలో నెలకొన్న భద్రతా పరిస్థితుల నేపథ్యంలో ఖతార్‌లో చిక్కుకుపోయిన సుమారు 1000 మంది భారతీయ ప్రయాణికులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారు. న్యూఢిల్లీ, ముంబై, కొచ్చి నగరాలకు తరలించినట్లు దోహాలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ప్రయాణికుల తరలింపు ప్రక్రియను సులభతరం చేసేందుకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎంబసీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో పంచుకున్న వివరాల ప్రకారం నిన్న ఖతార్ ఎయిర్‌వేస్‌కు చెందిన విమానాల్లో ఈ ప్రయాణికులు భారత్‌కు చేరుకున్నారు. చిక్కుకుపోయిన భారతీయుల ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు, ముఖ్యంగా మానవతా దృక్పథంతో అత్యవసర కేసులకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ఖతార్ ఎయిర్‌వేస్‌తో సమన్వయం చేసుకున్నట్లు పేర్కొంది. వారి సహకారానికి ఎంబసీ కృతజ్ఞతలు తెలిపింది. ఇవాళ న్యూఢిల్లీకి మరో విమానం షెడ్యూల్ అయినట్లు కూడా వెల్లడించింది. విమాన ప్రయాణంతో పాటు రోడ్డు మార్గంలో ప్రయాణించే వారికి కూడా ఎంబసీ సహాయపడుతోంది. సౌదీ అరేబియాలోని సల్వా సరిహద్దు గుండా ప్రయాణించడానికి వీలుగా భారతీయులకు 96 గంటల వ్యాలిడిటీతో తాత్కాలిక ట్రాన్సిట్ వీసాలను జారీ చేస్తున్నట్లు వివరించింది. ఇదే మార్గంలో, ఖతార్‌లో చిక్కుకుపోయిన భారత బాస్కెట్‌బాల్ జట్టు కూడా సౌదీ అరేబియా నుంచి విమానాల్లో స్వదేశానికి చేరుకుందని తెలిపింది. ఈ విషయంలో సహకరించిన సౌదీ అరేబియా, ఖతార్ అధికారులకు ఎంబసీ ధన్యవాదాలు తెలియజేసింది. సహాయం కోసం ఎంబసీలో 24/7 కంట్రోల్ రూమ్ పనిచేస్తోందని, దీంతో పాటు భారతీయ కమ్యూనిటీ సంస్థలైన ఐసీసీ, ఐసీబీఎఫ్‌కు చెందిన హెల్ప్ లైన్‌లు కూడా అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. ఇదిలా ఉంటే.. బహ్రెయిన్‌లోని భారత రాయబార కార్యాలయం జారీచేసిన ప్రకటనలో పొరుగు దేశాలకు ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నట్లు కొన్ని ప్రైవేట్ వ్యాపార బృందాలు చేస్తున్న ప్రచారంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. ప్రైవేట్ పార్టీలు చేసే రవాణా ఏర్పాట్లకు ఎంబసీ బాధ్యత వహించదని, ఈ విషయాన్ని అందరూ గమనించాలని సూచించింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ సుప్రీం లీడర్ ఆచూకీ ఎక్కడ?



**టెహ్రాన్, మార్చి 11:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఆచూకీపై తీవ్ర గందరగోళం నెలకొంది. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారి కూడా ప్రజల ముందుకు రాకపోవడం, కనీసం ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కొనసాగుతున్న యుద్ధంలో ఆయన గాయపడ్డారని వార్తలు వస్తున్నప్పటికీ, ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో ఆయన పరిస్థితిపై రకరకాల ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ మొజ్తబా గాయపడినట్లు అంగీకరించింది. ఆయన్ను 'జాన్‌బాజ్ ఆఫ్ రంజాన్' (గాయపడిన యుద్ధ వీరుడు) అని అభివర్ణించింది. ఈ గాయం ఎప్పుడు, ఎక్కడ, ఎలా తగిలింది, దాని తీవ్రత ఎంత అనే వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఈ గాయం కారణంగా ఆయన తన అధికారిక బాధ్యతలను నిర్వర్తించగలుగుతున్నారా లేదా అనే విషయంపై కూడా స్పష్టత ఇవ్వలేదు. దీంతో మిస్టరీ మరింత పెరిగింది. జెరూసలేం పోస్ట్ తన కథనం ప్రకారం అంతర్గత వర్గాల సమాచారం మేరకు మొజ్తబా యుద్ధంలో గాయపడింది నిజమే అయినప్పటికీ, ఆయన దేశ వ్యవహారాలను చక్కదిద్దే స్థితిలోనే ఉన్నారని తెలుస్తోంది. అయినప్పటికీ, నాయకత్వ మార్పు సజావుగా జరిగిందని ప్రభుత్వ అధికారులు చెబుతున్నా, ఇప్పటివరకు మొజ్తబాకు సంబంధించిన ఒక్క కొత్త ఫోటో గానీ, వీడియో గానీ విడుదల కాలేదు.

## ఇరాక్‌లో యుఎస్ కేంద్రంపై డ్రోన్ దాడి

**బాగ్దాద్, మార్చి 11:** ఇరాన్, అమెరికా ఇజ్రాయెల్ కూటమి మధ్య యుద్ధం 12వ రోజుకు చేరుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇరాక్ రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య మద్దతు కేంద్రం పై డ్రోన్ల దాడి జరిగింది. మొత్తం ఆరు డ్రోన్లు ఈ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోగా, ఐదింటిని అమెరికా రక్షణ వ్యవస్థలు గాలిలోనే కూల్చివేశాయి. అయితే, ఒక డ్రోన్ మాత్రం కార్యాలయ ప్రాంగణాన్ని తాకడంతో స్వల్ప నష్టం వాటిల్లింది. ఈ దాడిలో ఎవరికీ గాయాలు కాలేదని ప్రాథమిక సమాచారం. బుధవారం సూర్యోదయానికి ముందే ఇరాన్ తన క్షిపణిని ప్రయోగించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, హైఫా నగరాలను లక్ష్యంగా చేసుకుని భారీగా క్షిపణులను ప్రయోగించింది. బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నావికా దళానికి చెందిన స్థావరంపై కూడా ఇరాన్ దాడులు చేసినట్లు అక్కడి మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్ అంతటా భీకరమైన వైమానిక దాడులను కొనసాగిస్తున్నాయి. యుద్ధం ఆపకపోతే గల్ఫ్ నుంచి ప్రపంచ దేశాలకు వెళ్లే చమురు రవాణాను పూర్తిగా అడ్డుకుంటామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించింది. హార్ముజ్ జలసంధిలో మైన్లను (మందుపాతరలు) అమర్చి షిప్పింగ్‌ను నిలిపివేసేందుకు ఇరాన్ యత్నిస్తోంది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో స్పందించారు. ఒకవేళ చమురు సరఫరాను ఇరాన్ అడ్డుకుంటే, ఎన్నడూ చూడని రీతిలో ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు.

## ఆర్థికసంస్థలు, బ్యాంకులపైనా దాడులు: ఇరాన్ సెంట్రల్ కమాండ్




**టెహ్రాన్, మార్చి 11:** ఇరాన్ ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రారంభమై 12వ రోజుకు చేరుకుంది. ఇదే సమయంలో యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు సిద్ధమని ఇరాన్ ప్రకటించింది. ఇకపై అమె రికా, ఇజ్రాయెల్‌కు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ సెంట్రల్ ఆపరేషనల్ కమాండ్ ఖాటమ్ అల్ అన్బియా ప్రకటించారు. ప్రజలు ఈ సంస్థలు, బ్యాంకులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ఒక కీలక బ్యాంకుపై ఇజ్రాయెల్ అర్ధరాత్రి దాడి చేసింది. ఈ ఘటనలో చాలా మంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. దీనిపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇకపై తాము కూడా అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందిన ఆర్థిక సంస్థలు, బ్యాంకులపై దాడి చేస్తామని, అక్కడి ప్రజలు ఆ ప్రదేశాలకు దూరంగా ఉండాలని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ తమ బ్యాంకులపై దాడి చేయడం ద్వారా తాము కూడా అలాంటి సంస్థలపై దాడులు చేసేందుకు తగిన కారణాన్ని ఇచ్చిందని ఇరాన్ తెలిపింది. ఈ నేపథ్యంలో అమెరికన్ సంస్థల టార్గెట్ లిస్టును ఇరాన్ ప్రకటించింది. ఇందులో ప్రముఖ అమెరికన్ టెక్ కంపెనీలు, ఇన్‌ఫ్రా కంపెనీలున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబీఎం, పాలంటిర్, నివి డియా, ఒరాకిల్ వంటి సంస్థలున్నాయి. ఈ సంస్థలు గల్ఫ్ కంట్రీస్‌లో, ఇజ్రాయెల్‌లలో పలు ఆఫీసుల నుంచి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి.

## థాయిలాండ్, వియత్నాంలో ఇంధన అత్యవసర పరిస్థితి

**బ్యాంకాక్, మార్చి 11:** హార్మొజ్ జలసంధిలో రాజుకున్న ఉద్రిక్తతలు పశ్చిమాసియా సరిహద్దులు దాటి ఆగ్నేయాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడటంతో, థాయ్‌లాండ్, వియత్నాం ప్రభుత్వాలు తమ దేశాల్లో ఇంధన అత్యవసర పరిస్థితి తరహా చర్యలకు శ్రీకారం చుట్టాయి. చమురు ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరుకోవడంతో, ప్రభుత్వ యంత్రాంగాలు ఇంధన పొదుపు మంత్రాన్ని పఠిస్తున్నాయి. వియత్నాంలో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. ఫిబ్రవరి చివరి వారం నుంచి అక్కడ పెట్రోల్ ధరలు 32 శాతం పెరగ్గా డీజిల్, కిరోసిన్ ధరలు ఏకంగా 56 నుండి 80 శాతం వరకు ఎగబాకాయి. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి వియత్నాం ప్రధాని ఫామ్ మిన్ మిన్ స్వయంగా రంగంలోకి దిగి కువైట్, ఖతార్ వంటి దేశాలతో చర్చలు జరుపుతున్నారు. మరోవైపు, రాజధాని హనోయిలోని వీధుల్లో పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిని అదుపు చేసేందుకు పారిశ్రామిక, వాణిజ్య శాఖ అధికారులు ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్‌హోమ్ వెసులుబాటు కల్పించాలని స్థానిక సంస్థలకు కీలక సూచ నలు చేశారు. అటు థాయ్‌లాండ్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి వారానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే పనిదినాలను అమలు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అత్యవసర సేవలకు మినహాయింపు ఇస్తూనే, మిగిలిన విభాగాల సిబ్బందిని ఇంటి నుండే విధులు నిర్వర్తించాలని ఆదేశించింది. సొంత వాహనాల వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి, సైకిళ్లు లేదా ప్రజా రవాణాను ఆశ్రయించాలని పౌరులకు విజ్ఞప్తి చేసింది. అధికారుల విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధిస్తూనే, కార్‌పూలింగ్ వంటి పద్ధతులను ప్రోత్సహిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు అదుపులోకి వచ్చే వరకు ఈ కఠిన నిబంధనలు పాటించక తప్పదని ఇరు దేశాల ప్రతినిధులు స్పష్టం చేస్తున్నారు.

## యుద్ధ నిబంధనలు అతిక్రమించిన ఇజ్రాయెల్,అమెరికా

### ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసిన ఇరాన్ ప్రతినిధి

**టెహ్రాన్, మార్చి 11:** అమెరికా, ఇజ్రాయెల్ కలిసి తమ దేశంపై జరుపుతున్న సైనిక దాడుల్లో భారీగా పౌర మరణాలు సంభవిస్తున్నాయని ఇరాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. గతనెల 28 నుంచి జరిగిన ఈ దాడుల్లో 1300 మందికి పైగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారని, సుమారు 9,669 పౌర ప్రాంతాలు ధ్వంసమయ్యాయని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయీద్ ఇరవానీ ఫిర్యాదుచేసారు. ధ్వంసమైన వాటిలో 7,943 నివాస గృహాలు, 1,617 వాణిజ్య కేంద్రాలు, 65 పాఠశాలలు, 32 వైద్య సదుపాయాలు ఉన్నాయని ఇరవానీ వివరించారు. అమెరికా, ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా మా పౌరులను, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అంతర్జాతీయ చట్టాలకు ఎలాంటి గౌరవం ఇవ్వకుండా ఈ నేరాలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. టెహ్రాన్‌లోని ఇంధన నిల్వ కేంద్రాలు, మెహ్రాబాద్ విమానాశ్రయం, క్వెష్మ్ ద్వీపంలోని మంచినీటి శుద్ధి ప్లాంట్‌పై జరిగిన దాడులను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఈ దాడుల వల్ల తీవ్రమైన వాయు కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, లెబనాన్‌లోని బీరుట్‌లో ఆదివారం జరిగిన ఉగ్రదాడిలో నలుగురు ఇరాన్ దౌత్యవేత్తలు మరణించారని ఇరవానీ తెలిపారు. మరో దేశంలో దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకుని చంపడం యుద్ధ నేరమని, తీవ్రమైన ఉగ్రవాద చర్య అని అభివర్ణించారు. ఇరాన్ ప్రజలపై జరుగుతున్న ఈ దాడులను అంతర్జాతీయ సమాజం తక్షణమే ఆపాలని, తమ ప్రజలను, భూభాగాన్ని కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# 12 నెలలు, 13 రీఛార్జ్‌లు

## వ్యాలిడిటీ 28 రోజులకే పరిమితమేంటి?

## నెల అంటే 30రోజులు కాదా? ఇదో పెద్ద కుంభకోణం!

## టెలికాం కంపెనీల నయా దోపిడీ

## రీఛార్జ్ ముగిస్తే ఇన్‌కమింగ్ కాల్స్ ఎందుకు ఆపేస్తారు?

## రాజ్యసభలో ఎండగట్టిన ఆప్ ఎంపి రాఘవ్ చద్దా



**న్యూఢిల్లీ, మార్చి 11:** పార్లమెంట్ వేదికగా టెలికం కంపెనీలు సాగిస్తున్న దోపిడీని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపి రాఘవ్ చద్దా ఎండగట్టారు. ప్రిపెయిడ్ మొబైల్ రీచార్జ్ పద్ధతులపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత వ్యవస్థ వినియోగదారులపై అన్యాయమైన భారాన్ని మోపుతున్నదని ఆరోపించారు. టెలికం కంపెనీలు ఉపయోగించే 28 రోజుల రీచార్జ్ సైకిల్‌తోపాటు ప్లాన్‌లు గడువు ముగిసిన తర్వాత వినియోగదారులపై విధించిన ఆంక్షలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. మొబైల్ వినియోగదారులు విస్తృతంగా ఉపయోగించే 28 రోజుల రీఛార్జ్ సైకిల్‌ను రాఘవ్ చద్దా తీవ్రంగా విమర్శించారు, దీనిని "స్కామ్" అని పిలిచారు. "28 రోజుల రీఛార్జ్ ప్లాన్ ఒక మోసపూరితమైనది. సంవత్సరంలో 12 నెలలు ఉంటాయి, కానీ మీరు 13 సార్లు రీఛార్జ్ చేసుకోవాలి (28 రోజులు, 13 సార్లు = 364 రోజులు)" అని ఆయన అన్నారు. రీఛార్జ్ చెల్లుబాటును 30 లేదా 31 రోజుల క్యాలెండర్ నెలలతో సమలేఖనం చేయాలని ఆయన అన్నారు. ప్రస్తుత వ్యవస్థ వినియోగదారులను ప్రతి సంవత్సరం అదనపు రీఛార్జ్ కోసం చెల్లించమని సమర్థవంతంగా బలవంతం చేస్తున్నదని ఆరోపించారు. "నేటి కాలంలో, మొబైల్ ఇకపై విలాసవంతమైనది కాదు, కానీ సాధారణ పౌరుడికి ఇది అవసరంగా మారింది," అని చద్దా అన్నారు, టెలికం కంపెనీలు వినియోగదారుల పట్ల న్యాయమైన, పారదర్శక విధానాన్ని అవలంబించాలని కోరారు.

**రీఛార్జ్ ముగిసినా ఇన్ కమింగ్ ఆపొద్దు: ఎంపి చద్దా**

మొబైల్ యూజర్లసమస్యలపై ఆప్ ఎంపి రాఘవ్ చద్దా పార్లమెంటులో గళమెత్తారు. మంత్లీ ప్లాన్స్ పేరిట 28 రోజుల రీఛార్జ్ సంస్థలు ఏటా 13సార్లురీఛార్జ్ చేయించుకుంటూ దండుకుంటున్నా యని విమర్శించారు. రీఛార్జ్ ముగిసినా ఏడాది పాటు ఇన్కమింగ్ కాల్స్, ఓటిపిలు ఆపకూడదని, మూడేళ్ల వరకు నంబర్ డీయాక్టివేట్ చేయవద్దని డిమాండ్ చేశారు. ఇప్పుడు మొబైల్ విలాసం కాదని, సామాన్యుడి ప్రాణాధారమని ఆయన స్పష్టం చేశారు.

## భార్యను చంపిన భర్త ఆచూకీ కోసం ఎఫ్‌బిఐ భారీ రివార్డు

**న్యూయార్కు, మార్చి 11:** అమెరికాలో 11 ఏళ్ల క్రితం భార్యను దారుణంగా హత్య చేసి పరారీలో ఉన్న భద్రేశ్‌కుమార్ చేతన్‌భాయ్ పటేల్ అనే భారతీయుడిపై అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) భారీరివార్డు ప్రకటించింది. అతని ఆచూకీ తెలిపిన వారికి ఇచ్చే రివార్డును 2,50,000 డాలర్ల నుంచి ఏకంగా 1 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ. 9.18 కోట్లు) పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎఫ్‌బీఐ టాప్ 10 మోస్ట్ వాంటెడ్ జాబితాలో భద్రేశ్‌కుమార్ ఉన్నాడు. 2015 ఏప్రిల్ 12న మేరీల్యాండ్‌లోని హానోవర్‌లో ఉన్న ఓ డంకిన్ డోనట్ షాపులో భద్రేశ్‌కుమార్, అతని భార్య పాలక్ పటేల్ (21) నైట్ షిఫ్ట్‌లో పనిచేస్తున్నారు. ఈ సమయంలోనే భార్యను దారుణంగా హత్య చేసినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. షాపులోని సీసీటీవీ ఫుటేజీలో ఇద్దరూ కిచెన్ వైపు వెళ్లడం రికార్డయింది. ఆ తర్వాత కొంతసేపటికి కస్టమర్లు వచ్చి పిలిచినా ఎవరూ స్పందించకపోవడంతో అనుమానం



వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి చూడగా, కిచెన్‌లో పాలక్ మృతదేహం లభ్యమైంది. దర్యాప్తు ప్రకారం భారత్‌కు తిరిగి వెళ్లిపోవాలని పాలక్ కోరుకోవడం, దీనికి భద్రేశ్‌కుమార్ అంగీకరించకపోవడంతో ఇద్దరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఘటన జరిగిన రోజు పాలక్ తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడుతున్నప్పుడు ఈ వాగ్వాదం పెరిగి హత్యకు దారితీసిందని ఎఫ్‌బీఐ అధికారులు తెలిపారు. హత్య తర్వాత, దగ్గరలోని తమ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి కొన్ని వస్తువులు, నగదు తీసుకుని ట్యాక్సీలో న్యూజెర్సీలోని నెవార్క్ ఎయిర్‌పోర్ట్ సమీపంలోని ఓహోటల్‌కు వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం అక్కడి నుంచి నెవార్క్ పెన్ స్టేషన్‌కు వెళ్లి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభ్యం కాలేదు. గత 11 ఏళ్లలో 300కు పైగా ఆధారాలు లభించినప్పటికీ, భద్రేశ్‌కుమార్‌ను పట్టుకోలేకపోయామని అధికారులు చెబుతున్నారు. ఈ 1 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటనతో మా అన్వేషణకు మరింత ప్రచారం లభించి, పాలక్‌కు న్యాయం చేయడానికి అవసరమైన సమాచారం వస్తుందని ఆశిస్తున్నామని ఎఫ్‌బీఐ బాల్టిమోర్ ఫీల్డ్ ఆఫీస్ స్పెషల్ ఏజెంట్ జిమ్మీ పాల్ తెలిపారు. టీచర్ కావాలని కలలు కన్న పాలక్‌ను ఆమె కుటుంబం ఎంతగానో మిస్ అవుతోందని, నిందితుడిని పట్టుకోవడానికి ప్రజల సహాయం కీలకమని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## నౌకాదళ రహస్యాలు లీక్: ఆదర్శ్‌కుమార్ అరెస్ట్

**లక్నో, మార్చి 11:** భారత నౌకాదళానికి సంబంధించిన అత్యంత కీలక సమాచారాన్ని పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐకి చేరవేస్తున్న ఒక నేవీ ఉద్యోగిని ఉత్తరప్రదేశ్ యాంటీ టెర్రరిజం స్క్వాడ్ అరెస్ట్ చేసింది. దేశ భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరిస్తున్నాడనే ఆరోపణలపై లాన్స్ నాయక్ హోదాలో పనిచేస్తున్న ఆదర్శ్ కుమార్ అలియాస్ లక్కీని అదుపులోకి తీసుకున్నారు. యూపీలోని ఆగ్రాకు చెందిన ఆదర్శ్ కుమార్ కేరళలోని కొచ్చిలో ఉన్న సదరన్ నేవల్ కమాండ్‌లో లాన్స్ నాయక్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా అతడు పాకిస్థాన్‌కు చెందిన ఒక ఐఎస్ఐ ఏజెంట్‌తో నిరంతరం టచ్‌లో ఉన్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఎలక్ట్రానిక్, ఫిజికల్ సర్వైలెన్స్ ద్వారా ఇతడి కదలికలను గమనించిన ఏటీఎస్ పక్కా ఆధారాలతో లక్నోలో అరెస్ట్ చేసింది.

## మహిళా ఆర్థికసాయం పథకం విస్మరించిన ఆప్

### పంజాబ్ అసెంబ్లీలో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య వాగ్వాదం

**అమృత్‌సర్, మార్చి 11:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మహిళా ఆర్థిక సహాయ పథకంపై పంజాబ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష కాంగ్రెస్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం చోటుచేసుకుంది. అసెంబ్లీ సాక్షిగా ఇరుపక్షాలు ఒకరిపై ఒకరు వ్యక్తిగత విమర్శలు చేసుకోవడంతో సభ దద్దరిల్లింది. 2022 ఎన్నికల సమయంలో మహిళలకు నెలకు రూ.1000 ఇస్తామని హామీ ఇచ్చిన ఆప్ నాలుగేళ్ల పాటు మౌనంగా ఉండి ఇప్పుడు ఎన్నికల ముందు ఈ పథకాన్ని తీసుకురావడాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ నేత ప్రతాప్ సింగ్ బాజ్వా తప్పుబట్టారు. మహిళలకు ఇవ్వాల్సిన పాత బకాయిలు రూ.48,000 సంగతేంటి కేవలం ఓట్ల కోసమే ఈ జిమ్మిక్కులు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దీనికి స్పందించిన సీఎం భగవంత్ మాన్ మేము ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నాం, ప్రతి మహిళా అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తామని దీటుగా సమాధాన మిచ్చారు. ఈ చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా చేసిన కొన్ని వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోశాయి. మహిళా మంత్రులపై, పథకం అమలుపై ఆయన చేసిన వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని అధికార పక్షం ఆరోపించింది. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుంటూ కాంగ్రెస్ నాయకులకు మహిళల పట్ల గౌరవం లేదు. సభలో మహిళా మంత్రులను కించపరచడం దురదృష్టకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, రాష్ట్ర ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా ఈ పథకం కోసం రూ. 9,300 కోట్లు కేటాయించినట్లు ప్రకటించగా రాష్ట్ర అప్పులు రూ. 4.5 లక్షల కోట్లకు చేరాయని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. కేవలం అంకెలు మార్చి ప్రజలను మోసం చేస్తున్నారని పర్గత్‌సింగ్ వంటి కాంగ్రెస్ నేతలు విమర్శించారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొ నడంతో స్పీకర్ సభ్యులను శాంతింపజేయడానికి తీవ్రంగా ప్రయత్నించాల్సి వచ్చింది.



## మాంసాహారం తిన్నాడని పూజారిని చితకబాదిన గ్రామస్తులు

**కాన్పూర్, మార్చి 11:** యూపీలోని కాన్పూర్‌కు చెందిన ఓ పూజారి మాంసాన్ని సేవించినట్లు ఫోటో వైరల్ కావడంతో అతన్ని గుడి విధుల నుంచి తొలగించారు. కేశవపురంలోని శ్రీ భూతేశ్వర్ ధామ్ ఆలయంలో ఈ ఘటన జరిగింది. ఆ గుడిలోనే ప్రధాన పూజారిగా ఉన్న అతని తండ్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫోటోలో ఉన్న వ్యక్తి తన కుమారుడు ప్రశాంత్ గిరి అని తండ్రి సంతోష్ గిరి గుర్తించాడు. పూజారిగా ఉంటూ మాంసం తిన్న ప్రశాంత్ గిరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఊరేగింపు సమయంలో గుడి వద్ద ఆ వ్యక్తిని బయటకు లాగి చితకబాదారు. ఆ తర్వాత ఆ పూజారీ ఆచూకీ లేదు. నా భార్య, కోడలు ఆపేప్రయత్నం చేసినా స్థానికులు వారిపై కూడా దాడి చేసినట్లు సంతోష్ గిరి తెలిపాడు. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## అమ్మా...తిరిగొస్తానో లేదో..

### యుఎఇకి వెళ్లిన యువ పైలట్ తల్లికి సందేశం



**చండీగఢ్, మార్చి 11:** ఇరాన్‌వార్‌లో భారతీయులను స్వదేశానికి తరలిస్తున్న క్రమంలో ఒక యువ మహిళా పైలట్ తన తల్లితో ఉద్వేగంతో చెప్పిన మాటలు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ రెస్క్యూ మిషన్‌కు ముందు తాను తిరిగి వస్తానో లేదోనని తన తల్లితో ఆమె అన్నది. హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన 23 ఏళ్ల దీపిక అధానా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో పైలట్. ఈనెల 6న ఉదయం 10:15 గంటల సమయంలో రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా యూఏఈలోని రాస్ అల్ ఖైమాకు వెళ్లాలని అకస్మాత్తుగా ఆమెకు ఆదేశాలు వచ్చాయి. వాస్తవానికి ఆమె సహోద్యోగి ఆ విధులు చేపట్టాల్సి ఉన్నది. ఆ పైలట్ అందుబాటులో లేకపోవడంతో టేకాఫ్‌కు కేవలం రెండు గంటల ముందు ఆ బాధ్యత చేపట్టాలని దీపికకు ఆదేశాలు అందాయి. విమాన సిబ్బందికి తగిన సూచనలు చేయడంతో పాటు భద్రతకు భరోసా ఇచ్చారు. రెస్క్యూ మిషన్‌కు ముందు పైలట్ దీపిక తన తల్లితో మాట్లాడింది. అమ్మా నేను తిరిగి వస్తానో లేదో తెలియదు. బై బై అని చెప్పింది. కెప్టెన్ జస్వీందర్ కౌర్, పైలట్ దీపికాతో సహా మరో నలుగురితో కూడిన పూర్తి మహిళా సిబ్బందితో ఆ విమానం టేకాఫ్ అయ్యింది. 6న మధ్యాహ్నం 2:00గంటలకు యూఏఈలోని రాస్ అల్ ఖైమా ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా విమానం ల్యాండ్ అయింది. విమాన సిబ్బందికి అక్కడ అసాధారణ వాతావరణం కనిపించింది. మరోవైపు గంట తర్వాత 169 మంది భారతీయ ప్రయాణికులు విమానం ఎక్కారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఢిల్లీకి బయలుదేరింది. యుద్ధ పరిస్థితి నేపథ్యంలో టేకాఫ్ సమయంలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)తో సంబంధాలు క్లుప్తంగా తెగిపోయాయి. ఆ తర్వాత నెట్‌వర్క్ సాధారణ పరిస్థితికి వచ్చింది. సాయంత్రానికి ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ విమానం సురక్షితంగా ల్యాండ్ అయింది. యూఏఈలో చిక్కుకున్న 169 మంది భారతీయులను సురక్షితంగా దేశానికి తీసుకువచ్చింది. యూఏఈలో చిక్కుకున్న తమను సురక్షితంగా భారత్‌కు తీసుకువచ్చినందుకు ప్రయాణికులు ఆ విమాన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. యువ పైలట్ దీపిక కూడా క్షేమంగా తిరిగి రావడంతో ఆమె కుటుంబం ఊరట చెందింది.

## ఎయిరిండియాకు తృటిలో తప్పిన ప్రమాదం



**పుకెట్, మార్చి 11:** ఎయిరిండియాకు చెందిన ఎక్స్‌ప్రెస్ జెట్ విమానం థాయ్‌లాండ్లో హార్డ్ ల్యాండింగ్ అయింది. దీంతో ఎయిర్‌పోర్ట్ పరిధిలో ఆందోళనకర పరిస్థితి నెలకొంది. ఈ ఘటనతో ఎయిర్‌పోర్ట్ రన్‌వేను అక్కడి అధికారులు మూసేశారు. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 737-800 అనే విమానం బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్‌లోని పుకెట్ ఐలాండ్ బయల్దేరింది. షెడ్యూల్ ప్రకారం ఉదయం 11.40 గంటలకు విమానం పుకెట్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ అవ్వాలి. అంతకంటే ముందుగా 11.24 గంటలకు విమానంఎయిర్‌పోర్ట్‌లో హార్డ్ ల్యాండ్ అయింది. ప్రయాణికులు అంతా క్షేమంగానే ఉన్నారని, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఎయిర్‌పోర్ట్ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో విమానం గేర్ భాగం కొద్దిగా దెబ్బతింది.

## కుమార్తెకు విషమిచ్చి చంపిన తల్లి

### ప్రియుడిని ఇరికించేందుకు యత్నించి అరెస్టు

**లక్నో, మార్చి 11:** ఒక మహిళ తన కుమారుడితో కలిసి కుమార్తెకు విషం ఇచ్చి చంపి కుమార్తె ప్రియుడిని ఈ కేసులో ఇరికించేందుకు యత్నించిన కేసులో పోలీసులు అసలు నిందితులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్ జిల్లాలో గాజీపూర్ ప్రాంతానికి చెందిన 19 యేళ్ల ఫర్జానాకు గత ఏడాది అక్టోబర్‌లో సోషల్ మీడియా ద్వారా సునీల్ యాదవ్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి పేరుతో అతడు ఆమెను లోబర్చుకున్నాడు. ఈ నేపథ్యంలో ఫర్జానా గర్భం దాల్చింది. సునీల్ ఆమెకు అబార్షన్ చేయించాడు. పెళ్లి చేసుకునేందుకు నిరాకరించాడు. అబార్షన్ వల్ల ఫర్జానా అనారోగ్యం చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి 48 ఏళ్ల అఫ్సానా కుమార్తెను ఇంటి నుంచి వెళ్లగొట్టింది. ఫర్జానా ఈ విషయాన్ని సునీల్‌కు చెప్పింది. దీంతో ఆమెను ఐదు రోజుల పాటు తన వద్ద ఉంచుకున్నాడు. అయితే తన కుమార్తె కనిపించడం లేదని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి వెతికారు. మరోవైపు గతనెల 26న ఫతేపూర్ రైల్వే స్టేషన్‌లో ఫర్జానా అపస్మారక స్థితిలో కనిపించింది. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు ఆ యువతిని జిల్లా ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. ఆమె గురించి అడగ్గా ప్రియుడు సునీల్ పరిచయం, అతడి ద్వారా గర్భం దాల్చడం, అబార్షన్ తర్వాత తనను రైల్వే స్టేషన్ వద్ద వదిలేసి వెళ్లినట్లు ఆమె ఆరోపించింది. సునీల్‌పై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఫర్జానాకు చికిత్స తర్వాత ఆమె స్టేట్‌మెంట్ రికార్డ్ చేసేందుకు పోలీసులు సిద్ధమవుతుండగా కుటుంబీకులు ఆమెను ఆసుపత్రి నుంచి ఇంటికి తరలించారు. మార్చి 1న అర్ధరాత్రి వేళ సునీల్ పొలానికి ఫర్జానాను ఆమె తల్లి,సోదరుడు తీసుకెళ్లారు. అక్కడ బలవంతంగా సల్ఫోస్ పౌడర్ తినిపించగా ఆమె మరణించింది. ప్రియుడు సునీల్ తన కుమార్తెను హత్య చేసినట్లు తల్లి అఫ్సానాపోలీసులకు ఫిర్యాదు చేసింది. మరోవైపు ఫర్జానా మృతదేహానికి పోలీసులు పోస్ట్‌మార్టం నిర్వహించి దర్యాప్తు చేశారు. సీసీటీవీ ఫుటేజ్, ఫోన్ కాల్స్ వంటి ఆధారాలు పరిశీలించారు. అఫ్సానా, తన కుమారుడైన 26ఏళ్ల అఫ్సర్‌తో కలిసి బలవంతంగా విషం తినిపించి కుమార్తెను చంపినట్లు దర్యాప్తులో తెలిసింది.

### రాష్ట్రమంతటా జనసేన
# ఆవిర్భావ వేడుకలు
### - ఆ పార్టీ అగ్రనేత, డి.సిఎం పవన్ కల్యాణ్

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 14న అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాలు, నగరాలు, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పార్టీ పతాకాన్ని జనసైనికులు, వీరమహిళలు, నాయకులు, సభ్యత్వం పొందిన వారి సమక్షంలో ఎగురవేయాలి. సైద్ధాంతిక బలంతో, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఏ విధంగా జనసేన ముందుకు వెళ్తుందో పార్టీ శ్రేణులకు, ప్రజలకు నాయకులు వివరించాలి. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్త దాన శిబిరాలు, ఆహార వితరణ, పర్యావరణ సంబంధిత కార్యక్రమాలను చేపట్టాలి అని పవన్ కల్యాణ్ ఆదేశించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ దఫా రాష్ట్ర స్థాయిలో పిఠాపురంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉంటాయనే నివేదికను పరిగణనలోకి తీసుకుని అందుకు అనుగుణంగా వేడుకల నిర్వహణ స్వరూపాన్ని మార్చినట్లు జనసేన పార్టీ ఓ ప్రకటనలో పేర్కొంది.

రాష్ట్ర స్థాయి కార్యక్రమం కాకుండా రాష్ట్రమంతటా నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది. జనసేన పార్టీ ఉద్యమ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మార్చి 17 వరకు పొడిగించాలని పవన్ కల్యాణ్ నిర్ణయించారు. సభ్యత్వ నమోదు గడువు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, పార్టీ ఎమ్మెల్యేలు కోరిన మీదట మార్చి 17 వరకు పొడిగించినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

# వేసవిలోనూ నిరంతర విద్యుత్తు సరఫరా
### • సోలార్ విద్యుత్‌పై మరింత అవగాహన • ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్



తిరుపతి, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. వేసవి దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ ను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాతోపాటు మెరుగైన, సత్వర సేవలను అందించడం ద్వారా వినియోగదారుల నుంచి మన్ననలు పొందాలని సూచించారు. విద్యుత్ సరఫరా తీరుపై సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్, సెక్షన్ స్థాయిల్లో సంబంధిత అధికారులు నిరంతరం సమీక్షిస్తూ, అంతరాయాలను పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ స్థాయి నుండి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ స్థాయి వరకు హాజరైన అధికారులతో సిఎండి శివశంకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగదారుల సేవల్లో అలసత్వాన్ని దరి చేరనీయవద్దని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు అందుతున్నాయని, సిబ్బంది పనితీరు మరింత మెరుగు పడాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ పరిధిలో అధికారులు, సిబ్బందిపై ఫిర్యాదులు అందినట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు.

సంస్థ పరిధిలో పిఎం సూర్య ఘర్ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఇక పిఎంకుసుమ్ పథకం కింద ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ పనులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా వ్యవసాయానికి మెరుగైన విద్యుత్తును సరఫరా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. విద్యుత్ పునర్వ్యవస్థీకరణ పంపిణీ పథకం పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

11కెవి ఫీడర్లకు, డిటిఆర్‌లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలన్నారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని, వినియోగదారులు అడిగిన వెంటనే సర్వీసులను మంజూరు చేయాలని సూచించారు.

సంస్థ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే మార్చాలని ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్ల విఫలం ఎక్కువగా వున్నట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై వినియోగదారుల్లో అవగాహనను మరింతగా పెంపొందించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

వినియోగదారులు విద్యుత్ అంతరాయాలు, సమస్యలపై 1912, 1800 425 155333కు కాల్ చేయడం, చాట్‌బోట్ నంబరు: 91333 31912తో వాట్సాప్ చాట్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటిని త్వరితగతిన పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్(టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్‌ఎసి) కె. రామమోహన రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, కె. ఆదిశేషయ్య, ఎం.కృష్ణా రెడ్డి, ఎం.ఉమాపతి, కె.సంపత్ కుమార్, సిహెచ్ రామచంద్రరావు, ఎం.మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు/ సూపరింటెండింగ్ ఇంజనీర్లు మురళీధర్, విజయన్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, జగదీష్, తిరుమలరావు, సుబ్బారావు, రవికుమార్. హేమలత, రమణ, ఇస్మాయిల్ అహ్మద్, శేషాద్రి శేఖర్, ప్రదీప్ కుమార్, సుధాకర్, రాఘవేంద్రం, చంద్రశేఖర్ రావు, సోమశేఖర్ రెడ్డి మోజెస్, పిఆర్ఒ తోట మధుసూదన ఇంజనీర్లు పాల్గొన్నారు.

# బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలి
### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి తర్వాత లాభాపేక్షతో బడా వ్యాపారస్తులు సాగిస్తున్న బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టి సరసమైన ధరలకు వంట గ్యాస్, ఇతర సరుకులు అందించాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. వంట గ్యాస్ ధర పెరగడంతో పాటు బ్లాక్ మార్కెటింగ్ వల్ల సిలిండర్లు దొరకని కారణంగా దేశమంతటా నగరాలు, పట్టణాల్లో హోటళ్లు మూతపడడం లేదా కొన్ని రకాల వంటకాలు లభించడం లేదు అని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సాధారణమైన తోపుడుబండ్లు, చిన్న చిన్న కాకా హోటళ్ల నిర్వాహకుల బతుకులు బజారున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత కార్మికులు, చిరుద్యోగులకు లభించే టీ, టిఫిన్, భోజనం సరసమైన ధరకు దొరక్కుండా పోయే ప్రమాదం ఏర్పడుతుందని, ఈలోగా వాటి ధరలు అమాంతం పెరిగిపోతాయన్నారు. వంట గ్యాస్ కొరత మూలంగా ఆహార లభ్యత మొదలు ఉపాధి వరకు వివిధ రూపాల్లో సమాజంపై దుష్ప్రభావం పడుతుందన్నారు. ఇప్పటికే గృహ వినియోగదారులు సిలిండర్ కోసం బుక్ చేస్తుంటే తగిన స్పందన ఉండడం లేదని తెలిపారు. ఇంతకుముందు బుక్ చేసిన వారికి కూడా ఐదారు రోజులైనా గ్యాస్ బండ రావడం లేదు అని చెప్పారు. ఇళ్లలో, మార్కెట్లలో ఇలాంటి సమస్యలు ఏర్పడుతుండగా వ్యవసాయ రంగానికి కూడా ఎరువుల లభ్యత సమస్యగా మారనుందని వివరించారు. గ్యాస్ కొరత రాకుండా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే తగు చర్యలు చేపట్టాలని శ్రీనివాసరావు కోరారు. బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు
### • సనాతన ధర్మం ఏ ఒక్కరూ తీసుకురాలేదు
### • శృంగేరిపీఠాధిపతి విధు శేఖర భారతీ స్వామి



ఆలయాధికారులు, భక్తులకు అనుగ్రహ భాషణంలో పీఠాధిపతి

శ్రీకాళహస్తి, మార్చి 11 ప్రభాతవార్త: దేవాలయాలు ఆధ్యాత్మిక నిలయాలని, అయితే నేడు వాటిని కొందరు భక్తిభావం మర్మంతెలియక విహార కేంద్రాలుగా మలచుకుంటున్నారని శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర్ భారతీ స్వామి ఆవేదన వ్యక్తం చేసారు. ధర్మ ఆచరణ అంటే భగవంతుని ఆరాధన చేయటంతో పాటు పరోపకారం ధార్మికతను కల్గి ఉండాలన్నారు. ధర్మానికి పుణ్యక్షేత్రాలు శక్తి కేంద్రాలని ఆ క్షేత్రాల పవిత్రతను కాపాడే విధంగా పాలకులు, అధికారులు, అర్చకులు ఆగమ శాస్త్రాలకు సంప్రదాయాలకు పెద్ద పీట వేయాలని స్వామి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని భరద్వాజతీర్థంలోని గంగా సదన్‌లో దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్‌నారాయణ రెడ్డితో కొంత సేపు పలు అంశాలకు సంబంధించి చర్చించారు. అంతకు ముందు శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని సందర్శించారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఒ బి.కె.వెంకటేశు, రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ వేదపండితులు, ఆలయ అర్చకులతో స్వాగతం పలికారు.

**అమరావతి, విజయవాడ మాస్టర్‌ప్లాన్‌లపై మంత్రితో చర్చ**

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర్ భారతీ స్వామి గంగాసదన్‌లో అనుగ్రహ భాషణ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి మంత్రితో కలసి ఆశీర్వచనాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రితో పీఠాధిపతి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ మాస్టర్ ప్లాన్ గురించి సుదీర్ఘంగా చర్చించారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### యనమలకుదురు శివాలయంలోని హుండీ
# దోపిడికి పాల్పడింది ఆలయ సిబ్బందే

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: యనమలకుదురు శివాలయంలోని హుండీ దోపిడికి పాల్పడింది ఆలయ సిబ్బందేనని ఆధారాలు బయటపెట్టాయి. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. యనమలకుదురు శివాలయాన్ని శివరాత్రి సందర్భంలో భారీగా విరాళాలను భక్తులు హుండీ వేసారు. దాంతో హుండీ ఆదాయంపైన ఆలయ సిబ్బంది కన్ను పడింది. దేవుడి సొమ్మును ఎలాగైనా కాజేయాలని ప్లాన్ వేశారు. ఇందులో భాగంగా అంతరాలయంలో ఉండే ప్రధాన హుండీకి రహస్యంగా ఒక మారుతాళం (డూప్లికేట్ కీ) తయారు చేయించారు. దాన్ని ఉపయోగించి ఎవరికీ అనుమానం రాకుండా రూ.10 లక్షలపైగా నగదును దొంగిలించారు. దేవుడి సొమ్మును దొంగిలించిన తర్వాత ఆ సొమ్మును పంచుకునే క్రమంలో వారి మధ్య విభేదాలు వచ్చాయి. ఎవరికి ఎంత వాటా రావాలనే పంపకాల్లో తేడా వచ్చింది. దీంతో ఆ

**పరారీలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి!**

దొంగలంతా కలిసి పక్కనే ఉన్న ఒక మద్యం దుకాణంలో కూర్చుని పంచాయతీ పెట్టుకున్నారు. మద్యం మత్తులో డబ్బుల కోసం ఒకరిపై ఒకరు గట్టిగా అరుచుకున్నారు. దీంతో ఆలయంలో జరిగిన దొంగతనం బాగోతం కాస్తా బయటపడింది. హుండీ డబ్బులు మాయమైన విషయం తెలుసుకున్న ఆలయ ట్రస్ట్ చైర్మన్ సంగా నరసింహారావు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ చోరీలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఇద్దరు పూజారులతో పాటు మరో ఉద్యోగిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ఆలయ ఈవో భవాని ప్రస్తుతం పరారీలో ఉన్నారు. తన గుట్టు బయటపడుతుందని గ్రహించిన ఆమె చాకచక్యంగా వ్యవహరించారు. ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా లాంగ్ లీవ్ (దీర్ఘకాలిక సెలవు) పెట్టి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆమె ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంచారు. ఎఫ్ఐఆర్‌లో ఇఒ పేరు కూడా ఉండటంతో పోలీసులు ఆమె కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

ఈ ఘటనపై దేవాదాయ శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే ఆలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు ప్రాథమిక నివేదిక కూడా పంపించారు. పరారీలో ఉన్న ఇఒ భవాని స్థానంలో కానూరుకు చెందిన సుబ్రహ్మణ్యంను కొత్త ఇన్‌ఛార్జి ఇఒగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# రాష్ట్ర పండుగగా మొల్ల జయంతి
### • రేపు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహణ
### • విజయవాడలో రాష్ట్ర స్థాయి జయంత్యుత్సవం
### • బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి



విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: మొట్టమొదటి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల (మొల్ల మాంబ) జయంతిని ఈ నెల 13న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆమె వెల్లడించారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ(మొల్ల) తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి అని కొనియాడారు. నన్నయ్య ఆదికవి అయితే ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. సంస్కృతంలోని వాల్మీకి రామాయణాన్ని తెలుగు భాషలోకి అనువదించారన్నారు. మొల్ల రచించిన ఆ రామాయణం మొల్ల రామాయణంగా ప్రఖ్యాతిగాంచిందన్నారు. మొల్ల స్వస్థలం కడప జిల్లా గోపవరం గ్రామవాసి అని తెలిపారు. 16వ శతాబ్దానికి చెందిన మొల్ల సామాన్యమైన కుమ్మరి కుటుంబంలో జన్మించారన్నారు. తెలుగు సాహిత్యానికి మొల్ల చేసిన సేవలు అభినందనీయమన్నారు. మొల్ల రాష్ట్ర స్థాయి జయంతిని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలోనూ మొల్ల జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో కూటమి ప్రభుత్వం పేర్కొందన్నారు. మొల్ల జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

**మంత్రి సవితకు ఆహ్వానం:** ఈ నెల 13న మొల్లమాంబ రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రం నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయి మొల్ల జయంతి కార్యక్రమంలో హాజరుకావాలంటూ మంత్రి ఎస్.సవితను రాష్ట్ర కుమ్మరి, శాలివాహన డవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ ఆహ్వానించారు. ఈ మేరకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి ఆయన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కుమ్మరి, శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా!?
### - భూమన కరుణాకర్‌రెడ్డికి భానుప్రకాశ్‌రెడ్డి సవాల్

తిరుపతి, మార్చి 11 ప్రభాతవార్త: టిటిడి ఛైర్మన్‌గా ఎంత అవినీతికి పాల్పడ్డారో భక్తులకు తెలుసని, అవినీతికి పాల్పడలేదని కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధమా? అని భానుప్రకాశ్‌రెడ్డి భూమనకు సవాల్ విసిరారు. అవినీతి జరగలేదని తడిబట్టలతో తాను ప్రమాణం చేస్తానని, కమీషన్లు తీసుకోలేదని ప్రమాణం చేస్తావా? అని కరుణాకర్‌రెడ్డికి సవాల్ విసిరారు. కరుణాకర్‌రెడ్డి కాదు, ఆయన జేమ్స్ బాండ్ 007 అని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తిరుమలలో ఎప్పుడో జరిగిన విషయాన్ని నేడు జరిగినట్లు సృష్టించే వ్యక్తి, 2024 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పి, రాజకీయ నిరుద్యోగులుగా మార్చినా ఉనికికోసం అబద్దాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేకే వైసీపీ నాయకులు తిరుమల చుట్టూ రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ అనకొండలు తిరుమలపై రాజకీయం చేస్తే, ఆది శేషుని దెబ్బ మరోమారు రుచి చూస్తారని ఘాటుగా స్పందించారు. ఒక్కసారి ఆదిశేషుడు తోకతో కొడితేనే 11 సీట్లకు పరిమితం అయ్యారని న్నారు. రవికుమార్‌ను విచారించిన వివరాలను భూమన బయట పెట్టాలని, రవికుమార్ దొంగతనం చేసిన సమయంలో సీసీటీవీ విజువల్స్ ఎందుకు లేవో వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఉగాదిన టిడ్కో ఇళ్లు అందజేత
### పేదల ఇంటి కలల సాకారానికి సుముహూర్తం ఖరారు



శ్రీకాళహస్తి, మార్చి 11 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పొలిమేరల్లో నిరుపేదల భాగస్వామ్యంతో గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నపుడు ఎంపిక చేసిన లబ్దిదారులకు ఉగాది నాటికి ఇళ్ళను అప్పగించుటకు మున్సిపల్, హౌసింగ్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఇళ్ళను నిరుపేదల కలల మేరకు అందించాలని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పట్టుబట్టారు. ఉగాది నాటికి రూ.500ల డిపాజిట్ చేసిన వారికి మినహా మిగిలిన వారికి అందజేయటానికి సిద్ధం చేస్తున్నారు. గతంలో లబ్దిదారులకు పట్టాలు అందించారు. వాటి స్థానంలో పక్కా రిజిస్ట్రేషన్‌తో ఇళ్ళను అందించుటకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ మంచినీటి సదుపాయం తప్ప మిగిలిన సదుపాయాల కల్పన పూర్తి అయినట్లు సమాచారం.

**సిద్ధమౌతున్న ఇళ్ళు:** శ్రీకాళహస్తికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో రాజీవ్‌నగర్, శివనాథ పాళెం పరిధిలో టిడ్కో ఇళ్ళను నిర్మించారు. 2017 తెలుగుదేశం అధికారంలో ఉన్నపుడు ఇక్కడి శాసనసభ్యుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి లబ్దిదారులను ఎంపిక చేసారు. అప్పటిలోనే లబ్దిదారులను ఎంపిక చేసిన ఏ ఇల్లు ఎవరికి కేటాయించారో ప్రకటించారు. లబ్దిదారుల ఇళ్ళను పారదర్శకంగా లాటరీ పద్ధతిలో ఎంపిక చేసారు. టిడ్కో ఇళ్ళకు నాడు ఏడువేల మంది దరఖాస్తు చేసుకోగా 5600 మందికి అర్హత ఉన్నట్లు గుర్తించారు. వారిలో అధికంగా రూ.500లు చెల్లించిన వారే ఉన్నారు. తరువాత 360 చదరపు అడుగులు, 400 చదరపు అడుగుల ఇళ్ళను ఎంపిక చేసారు. ఆ లబ్దిదారులను కూడా నాడే కేటాయించారు.

**కూటమి వచ్చిన తరువాత పరుగులు:** కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి టిడ్కో ఇళ్ళకు సంబంధించి చొరవ చూపారు. అధికారులతో పలుమార్లు చర్చించారు. అలాగే ప్రభుత్వం దృష్టికి మున్సిపల్ శాఖ మంత్రి నారాయణతో చర్చించారు. కాంటాక్టు తీసుకున్న కాంట్రాక్టర్‌ను ఒప్పించారు. పనులు పూర్తి చేయుటకు ప్రభుత్వం ఆదేశించింది. అయితే పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఏజెన్సీకి చేదు అనుభవం ఎదురైంది. ఇక్కడ ఇళ్ళకు సంబంధించి ఏర్పాటు చేసిన కిటికీలు, విలువైన వస్తువులను దొంగతనానికి గురయ్యాయి. దాంతో కాంట్రాక్టర్ మీద అదనపు భారం పడింది. అయినా కాంట్రాక్టర్ వెంటపడ్డారు. పనులు పూర్తి చేయటానికి సహకరించాలని అభ్యర్థించారు. ఈ నేపథ్యంలో కొన్ని ఇళ్ళను కాంట్రాక్టర్ పూర్తి చేసాడు. ఉగాది నాటికి శివనాథపాళెం వద్ద ఉన్న 360 అడుగులు ఇళ్ళు 304, 400 చదరపు అడుగుల ఇళ్ళు 541 పూర్తి అయ్యాయి. ఇక ఫేస్ 2 రాజీవ్‌నగర్‌లో 1920 ఇళ్లు సిద్ధం చేసారు. ఉగాది నాటికి తెలుగుసంవత్సరాది నాటికి లబ్దిదారులకు అందించిన ఆశీర్వాదం పొందటానికి సిద్ధం చేస్తున్నారు. ఈమేరకు మున్సిపల్ అధికారులు రిజిస్ట్రేషన్‌కు డాక్యుమెంట్లు సిద్ధం చేస్తున్నారు.

**కమిషనర్ వివరణ:** టిడ్కో ఇళ్ళకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్‌ను వివరణ కోరగా ఉగాది నాటికి లబ్దిదారులకు తెలుగు సంవత్సరాది కానుకగా అందించుటకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. శాసనసభ్యులు ఎలాగైనా ఉగాది నాటికి ఇళ్లను అందించాలని ఆదేశించారని, ఆ నాటికి మంచినీటి సరఫరాకు కూడా అందించుటకు యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకున్నామని వివరించారు.





# ప్రకృతి సేద్యానికి పది లక్షల మంది రైతులు
### - రైతు సాధికార సంస్థ సిఇఓ రామారావు

గుంటూరు, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతం చేసే లక్ష్యంతో ఈ ఏడాది 10 లక్షల మంది రైతులను ఎస్ టు ఎస్ (విత్తనం నుంచి విత్తనం వరకు) రైతులుగా చేయడమే ప్రధాన లక్ష్యమని రైతు సాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామారావు పేర్కొన్నారు. బుధవారం గుంటూరులోని ఎం.హెచ్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 నుండి ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ద్వారా రాష్ట్రంలో ఇప్పటివరకు 40 లక్షల మంది రైతులను ఈ సాగు పద్ధతిలోకి తీసుకువచ్చామని తెలిపారు. 2026 సంవత్సరాన్ని ఎస్ టు ఎస్ సంవత్సరంగా ప్రకటిస్తున్నామని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రతి రైతు సేవ కేంద్రం పరిధిలోని సిబ్బంది, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 365 రోజుల పాటు భూమిని పచ్చదనంతో కప్పి ఉంచే ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతిని ప్రతి రైతుకూ చేరువ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డి.డి.ఏ. కళ్యాణ్ కుమార్, డి.డి.హెచ్. ప్రభాకర్, రైతు సాధికార సంస్థ అధికారులు రామచంద్రరావు, చంద్రశేఖర్, చక్రవర్తి, గోపీచంద్, రాజేశ్వరరావు, హేమ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా
# ఎపికి రూ.2416.92 కోట్లు
**రాజ్యసభలో వైసిపి ఎంపి మేడా రఘునాథరెడ్డికి ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానమిచ్చిన కేంద్ర మంత్రి**

రాజంపేట, మార్చి 11 ప్రభాతవార్త: మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.2416.92 కోట్ల విలువైన మత్స్య అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, అందులో కేంద్ర భాగస్వామ్యం రూ.569.86 కోట్లు ఉన్నట్లు కేంద్ర మత్స్యశాఖ, పశుసంవర్ధక, పాల ఉత్పత్తుల శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వెల్లడించారు. బుధవారం రాజ్యసభలో వైసిపి ఎంపీ మేడా రఘునాథరెడ్డి ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో ముఖ్యంగా కాకినాడ - ఉప్పాడ ప్రాంతాలలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న చేపల నిల్వలు తగ్గుదల, పరిశ్రమల వల్ల కలుగుతున్న సముద్ర కాలుష్యం సమస్యపై ప్రశ్న లేవనెత్తారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో పరిశ్రమల కాలుష్యం కారణంగా చేపల నిల్వలు తగ్గుతున్నాయని మత్స్యకారులు చేస్తున్న ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించిందా? సముద్ర జలాల నాణ్యతను పరీక్షించేందుకు కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ఎలాంటి చర్యలు తీసుకున్నది? ప్రభావితమైన మత్స్యకారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎలాంటి సహాయం లేదా నష్టపరిహారం అందించనున్నది? అనే విషయాలను ప్రస్తావించారు. అందుకు కేంద్ర మంత్రి లిఖితపూర్వ సమాధానంలో ఉప్పాడ ప్రాంతంలో సముద్ర కాలుష్యంపై వచ్చిన ఫిర్యాదులను ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రతినిధులతో కూడిన మూడు సభ్యుల నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి పరిశ్రమల నుండి సముద్రంలోకి వెళుతున్న వ్యర్థ జలాలపై పరిశీలన చేపట్టినట్లు



పేర్కొన్నారు. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన్ మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా కింద ఆంధ్రప్రదేశ్‌కి రూ.2416.92 కోట్ల విలువైన మత్స్య అభివృద్ధి ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని వివరించారు. అలాగే ఈ పథకం ద్వారా సంప్రదాయ మత్స్యకారులకు పడవలు, వలలు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, ఐస్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు, చేపల మార్కెట్లు, రవాణా సదుపాయాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధితో పాటు మత్స్యకార కుటుంబాల సంక్షేమానికి కూడా సహాయం అందుతున్నట్లు తెలిపారు. మత్స్యకారుల జీవనోపాధికి హక్కులు, సంక్షేమమే తమ లక్ష్యమని ఎంపీ మేడా రఘునాథ రెడ్డి తెలిపారు.

# రాజధాని అమరావతిలో అగ్నికీలలు



గుంటూరు, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వెలగపూడి సీడ్ యాక్సిస్ రెడ్డులోని ఎన్9 జంక్షన్ వద్ద అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఎల్‌అండ్‌టీ సంస్థకు చెందిన ప్లాస్టిక్ పైపులు భారీ శబ్దంతో తగలబడిపోయాయి. పెద్దఎత్తున మంటలు చెలరేగి దట్టమైన పొగ విస్తరించటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఆరు ఫైరింజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పైపుల విలువ కోటి రూపాయల పైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

**విచారణకు ఆదేశించిన హోం మంత్రి:** రాజధానిలో అగ్నిప్రమాద ఘటనపై హోంమంత్రి అనిత విచారణకు ఆదేశించారు. పైపులకు మంటలు ప్రమాదవశాత్తా అంటుకున్నాయా లేక ఎవరిదైన హస్తం వుందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టనున్నారు. పైపులకు మంట సమీప పొలంలో నుంచి వచ్చిందని ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు అంటున్నారు. పొలంలో నుంచి పైపుల వరకూ గడ్డి పేర్చి నిప్పు పెట్టిన ఆనవాళ్లను సంస్థ ప్రతినిధులు చూపించారు రెండు రోజుల క్రితం పైపులు నిల్వ చేసిన ప్రాంతంలో అధికారులు చెత్తాచెదారాన్ని తొలగించారు. అయినా అగ్నిప్రమాదం జరగడం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది రాజధాని నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధాని వచ్చిన సమయంలోను ఇదే తరహాలో అగ్నిప్రమాదం జరిగింది.



స్కూల్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

### ప్రైవేటు స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం...

## విద్యార్థికి ప్రాణాపాయస్థితి

కర్నూలు విద్య, మార్చి 11 ప్రభాతవార్త: ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా 9వ తరగతి విద్యార్థి ప్రాణపాయస్థితిలో ప్రభుత్వాసుప్రతిలో చికిత్స పొందున్నాడు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐఎస్ఎ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, వైఎస్సార్ఎస్‌యు, ఆర్పీఎస్ఎఫ్, బిసి విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్కూల్ ముందు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఎఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు రమణకుమార్, వైఎస్సార్ఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కటారి కొండసాయి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సాయి, ఎఐఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అశోక్, నగర కార్యదర్శి అభి, ఆర్పీఎస్ఎఫ్ అధ్యక్షులు నాగరాజు, బిసి సంఘం రంగన్న, గిరిష్‌లు మాట్లాడుతూ తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ స్కూల్ యాజమాన్యం విద్యార్థులకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలమయిందని తెలిపారు. డోన్ మండల కేంద్రానికి చెందిన 9వ తరగతి విద్యార్థి రాంచరణ్ తేజ్ ఉల్చాల రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్‌లో మూడు రోజుల క్రితం విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో అతని బీజాలపై తీవ్రంగా దాడిచేయడంతో పరిస్థితి విషమించి ఒక బీజాన్ని పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అయితే దాడి జరిగిన వెంటనే విద్యార్థిని ఆసుపత్రికి తరలించకుండా స్కూల్ యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఆతని పరిస్థితి మరింత పూర్తిగా విషమించిందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. విద్యార్థుల పట్ల బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్న స్కూల్ గుర్తింపును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డన్, ప్రిన్సిపాల్, ఎజిఎంపై క్రిమినల్ కేసులు నమోదుచేయాలన్నారు. బాధిత విద్యార్థికి అన్నివిధాలుగా మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో రాం, వీరేష్, సునీల్, కిరణ్, రాజా, సూర్య వాసు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం... డస్ట్ బిన్‌లోకి

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం భోజనాన్ని తినలేక డస్ట్ బిన్ లో విద్యార్థులు పారబోసారు. మూడు నెలలుగా మొత్తుకుంటున్నా తమకు ఇదే తరహా భోజనం పెడుతున్నారంటూ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం దేవుని చెరువులోని ఎంపీపీ పాఠశాలలో ఘటన చోటు చేసుకుంది. గత మూడు నెలలుగా నాణ్యతలేని ఆహారం పంపిణీ. మధ్యాహ్న భోజనం అధ్వాన్నంగా ఉంటున్నా అధికారులు పట్టించుకోలేదంటున్న విద్యార్థులు చివరికి విషయం తల్లిదండ్రుల దృష్టికి తీసుకుని వెళ్ళారు. దాంతో 112కి ఫోన్ చేసి ఫిర్యాదు విద్యార్థుల తల్లిదండ్రులు చేసారు. స్కూల్‌కు వెళ్లి పోలీసులు ఆరాతీసారు. భోజనం తినలేకపోతున్నామని పోలీసులకు విద్యార్థులు ఫిర్యాదు చేసారు.

## విజయకీలాద్రి ఆలయంలో ఉక్కు తలుపులు



విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలోని విజయ కీలాద్రిపై ఉన్న శ్రీ విఘ్నవిమోచక హనుమాన్ ఆలయంలో దేశంలోనే ఎత్తయిన ఉక్కు తలుపులు ఏర్పాటు చేశారు. సుమారు 40 అడుగుల ఎత్తుతో రూపొందించిన ఈ భారీ తలుపులను హైదరాబాద్‌కు చెందిన ఆక్సెస్ టఫ్ డోర్స్ సంస్థ ఇంజినీరింగ్ చేసి తయారు చేసింది. దాదాపు 1.4 టన్నుల బలమైన నిర్మాణ ఉక్కుతో ఈ తలుపులను నిర్మించారు. రెండు వైపులా స్లైడ్ అయ్యే డబుల్ షట్టర్ వ్యవస్థతో పాటు రిమోట్ కంట్రోల్ ఆటోమేషన్ సాంకేతికతను ఇందులో అమర్చారు. దీని వల్ల భారీ పరిమాణంలో ఉన్నప్పటికీ తలుపులు సులభంగా, సురక్షితంగా తెరుచుకునేలా రూపొందించారు. ఈ తలుపులను హైదరాబాద్‌లో రూప కల్పన చేసి తయారు చేసి, అనంతరం విజయకీలాద్రికి తరలించి ఆలయంలో అమర్చారు. ఆధునిక ఇంజినీరింగ్ నైపుణ్యంతో పాటు సంప్రదాయ ఆలయ నిర్మాణ శైలిని సమన్వయం చేస్తూ ఈ తలుపులను రూపొందించారు.

## దుర్గా ఘాట్ వద్ద ఇఓ క్షేత్రస్థాయి పరిశీలన

### హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు.. నేడు శ్రీ సరస్వతి యాగం


శ్రీ అమ్మవారి హుండీ లెక్కింపులు

ఇంద్రకీలాద్రి, మార్చి 11 ప్రభాత వార్త: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా, బుధవారం దుర్గా ఘాట్ ప్రాంతంలో ఇఓ శీనా నాయక్, ఉన్నతాధికారులతో క్షేత్ర స్థాయి పరిశీలన నిర్వహించారు. ఘాట్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి, భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు ఘాట్‌కు చేరుకోవడానికి ప్రస్తుతం అందుబాటులో ఉన్న సబ్‌వేలు మరియు నూతనంగా నిర్మించతలపెట్టిన నూతన మార్గాలను ఏ విధంగా వినియోగించుకోవాలో ప్రణాళికలు రూపొందించారు. స్నానఘట్టాల వద్ద భక్తులకు అవసరమైన కనీస సౌకర్యాలు, రక్షణ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించడం. భవిష్యత్తులో వచ్చే భారీ సంఖ్యలోని భక్తులను దృష్టిలో ఉంచుకుని, ఎక్కడా అసౌకర్యం కలగకుండా శాశ్వత ప్రాతిపదికన ఈ మార్పులు చేపట్టనున్నట్లు ఇఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

**హుండీ ఆదాయం రూ.3.35 కోట్లు:** శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో గత 18 రోజుల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించగా రూ.3,35,86,637, 302 గ్రాములు బంగారం, 3 కిలోల 010 గ్రాములు వెండి, 1337 అమెరికా డాలర్లు, ఇంగ్లాండ్ పౌండ్లు 55, మలేషియా(రింగిట్) 10, సింగపూర్ (డాలర్లు) 132 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దిర్హామ్స్) 335, ఆస్ట్రేలియా (డాలర్లు) 55, కువైట్ (దీనార్)లు 60 1/4, ఖతార్ (రియాల్స్) 220, హాంకాంగ్ (డాలర్లు) 20, మారిషస్ (రూపాయి)లు 200, కెనడా (డాలర్లు) 240, సౌదీ అరేబియా (రియాల్స్)1, బహ్రెయిన్ (దీనార్) 1, ఫిలిప్పీన్స్ (పెసో) 100లు లభించాయని ఇఓ వికె శీనానాయక్ తెలిపారు.

**నేడు మూల నక్షత్రం సరస్వతి యాగం:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై ఫాల్గుణ బహుళ నవమి సందర్భముగా కొండపైన పాత చండీ యాగశాల నందు ఉదయం 9 గం.లకు సరస్వతి యాగం నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**శ్రీ అమ్మవారికి భక్తుల విరాళాలు:** శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో జరుగుతున్న నిత్య ఉచిత ప్రసాద పథకంకు రూ.2,25,000లు, గో సంరక్షణ పథకం నిమిత్తం రూ.2,25,000లు వెరసి రు.4,50,000 లను విరాళంగా హైదరాబాద్‌కు చెందిన కోటిరావు, అంజు కుమారి, కుటుంబ సభ్యులు ఇఓ వికె శీనానాయక్‌కు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలందించారు.

# రేపు గన్నవరంలో సిఎం పర్యటన

- అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయనున్న చంద్రబాబు


సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న విప్ యార్లగడ్డ వెంకట్రావ్

గన్నవరం, మార్చి 11 ప్రభాతవార్త: రాష్ట్రముఖ్యమంత్రి చంద్రబాబు 13వ తేదీ గన్నవరంలో పర్యటించనున్నారు. గన్నవరం మండలం సూరంపల్లి, మాదలవారిగూడెం గ్రామాల్లో సియం పర్యటించి పియం కిసాన్ అన్నదాత సుఖీభవ మూడవ విడత నిధులు విడుదల కార్యక్ర మాన్ని ప్రారంభిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శుక్రవారం సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి హెలికాప్టర్‌లో ఎన్‌డిఆర్ఎఫ్ ప్రాంగణానికి చేరుకుని అక్కడి నుండి రహదారి మార్గంలో వెళ్తూ రైతులతో ముఖాముఖీ మాట్లాడి మాదల వారిగూడెం గ్రామంలో ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్, జిల్లా జయింట్ కలెక్టర్ యం.నవీన్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గౌడ కార్పోరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, ముఖ్యమంత్రి కార్యక్రమం సమన్వయకర్త ఎమ్మెల్సీ సత్యన్నారాయణరాజు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ సియం పర్యటనలో పాల్గొనే రైతులకు ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ముఖ్యంగా భద్రత పేరుతో రైతులను ఇబ్బంది పెట్టవద్దని పోలీసు లకు సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున కార్యక్రమానికి హాజరయ్యే రైతులు, ప్రజలకు తాగునీరు, మజ్జిగ, ఆహారం అందుబాటులో ఉంచాలన్నారు. సియం పర్యటించే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అదికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లు చేయాలని జెసి ఆదేశించారు. కార్యక్రమం జరిగే ప్రాంతంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలకు ఇన్‌చార్జీలను నియమించారు.



## తిరుమల కల్తీ నెయ్యి కేసు...

# కర్త, కర్మ, క్రియ ఎవరు?

- తేల్చేందుకు ఏకసభ్య కమిషన్ కార్యాచరణ
- నోటీసులిచ్చి, విచారణ దిశగా అడుగులు



తిరుపతి, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల లడ్డూలకు కల్తీ నెయ్యి సరఫరా బాగోతంలో సిబిఐ సిట్ రికార్డులు, టిటిడి అధికారుల నుండి సమాచారం సేకరించిన ఏకసభ్య కమిషన్ విశ్రాంత ఐఎఎస్ దినేశ్‌కుమార్ ఇక కార్యాచరణతో రంగంలోకి దిగనున్నారు. ఇప్పటికే ఈ కేసులో నిశితంగా అన్ని స్థాయిల్లో రికార్డులు, నివేదికలు పరిశీలించి కీలక సమాచారం సేకరించిన ఈ కమిటీ ఇక బాధ్యులైన వారిని విచారణకు పిలిచేందుకు సిద్దమవుతోంది. వైసిపి ప్రభుత్వంలోని గత వైసిపి బోర్డు పెద్దల అనూహ్య నిర్ణయాలతో తిరుమల లడ్డూలకు కల్తీనెయ్యి సరఫరా టెండర్ల నిబంధనలు మార్పు, పూర్తిగా నాణ్యత పాటించకపోవడం వంటి అంశాలపై కల్తీ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియ ఎవరున్నారనేది తేల్చేందుకు ఈ కమిటీ ముందుకు కదలనుంది. నోటీసులు ఎవరికి పంపాలనేది కూడా ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. కమిటీ నోటీసులిచ్చి దర్యాప్తు చేపడితే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోబోతున్నాయనేది అందరిలోనూ ఆందోళన కలిగించే విషయం. 2019-24 మధ్య కాలంలో కల్తీ నెయ్యి సరఫరా చేసినా టిటిడిలో పట్టించుకోని పాపంలో కీలక సూత్రధారులను తేల్చే పనిలో ముందుకు కదులుతోంది. ఏకపక్ష కమిటీ గత ఐదు రోజులుగా సమగ్రంగా పూర్తిస్థాయిలో రికార్డులు తిరిగేసింది. ఇందుకు అసలు కీలక వ్యక్తులు ఎవరనేది ఓ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కల్తీనెయ్యి సరఫరా చేశారనే అంశంలో తమిళనాడు ఏఆర్ డైరీ యాజమాన్యం ఎండి రాజశేఖరన్, సరఫరా దారులు ఉత్తరప్రదేశ్‌కు, ఉత్తరాఖండ్ రూర్కే బోలేబాబా డైరీకి చెందిన అప్పటి డైరెక్టర్లు విపిన్‌జైన్, పోమిల్‌జైన్, వైష్ణవీడైరీ (పూనంబాక) సిఇఒ అపూర్వ వినయ్‌కాంత్ చావ్డాలను సిబిఐ అధికారులు కటకటాల్లోనికి పంపడం, బెయిల్‌పై బయటకు రావడం జరిగింది. ఇంకా వైష్ణవీ డైరీకి సంబంధించి నెయ్యి సరఫరా కేసులో లారీ డ్రైవర్లే డైరెక్టర్లుగా కాగితాలపై చలామణి అయ్యి ఈ లోపాయికారి ఒప్పందం, తప్పిదాలు చేశారనేది సిబిఐ విస్తుపోయే నిజాలు సేకరించినట్లు తెలిసింది. గత ఐదేళ్లలో నాణ్యతలేని, కల్తీ నెయ్యి తక్కువ ధరకు సరఫరా చేస్తామని డైరీల యాజమాన్యం, కాంట్రాక్టర్లు ఆసక్తిచూపడం, కల్తీ నెయ్యే వినియోగించారనేది నిందితుల రిమాండ్ రిపోర్టులో చోటుచేసుకున్న విషయం. గత ఐదేళ్ళలో పనిచేసిన టిటిడి అధికారులు, గత టిటిడి బోర్డుకు ఈ వాస్తవాలు ఎంతవరకు తెలిసిందనేది ఈ కమిటీ తేల్చేయనుంది. మొత్తం 36మంది నిందితులుగా పేర్కొంటూ అందులో 12మంది టిటిడి అధికారులు ప్రమేయం ఉందని నిగ్గుతేల్చారు. అసలు సూత్రదారులు బయటకు రావడానికి ఈ కమిటీ ఎంతవరకు సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందనేది చూడాల్సిందే.

## ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే రాలేదని టిడిపి నేత ఆత్మహత్యాయత్నం

- ఎమ్మెల్యే పాల్గొనే ఇఫ్తార్ విందులను మైనార్టీలు బహిష్కరిస్తారని షకీల్ షఫీ హెచ్చరిక
- ఇది చిన్న విషయం అని ఎమ్మెల్యే దగ్గుబాటి వివరణ



అనంతపురం, మార్చి 11 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం నగరంలో టిడిపి మైనార్టీ నాయకుడు నూర్ మహమ్మద్ ఆదివారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. టిడిపిలో కొందరు డివిజన్ స్థాయి నాయకులు వద్దని చెప్పడం వల్లే ఇఫ్తార్ విందుకు తన ఇంటికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రాలేదని, దీంతో అవమానం పాలయ్యానని టిడిపి మైనార్టీ నాయకుడు ఆత్మహత్య కార్యక్రమానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై వివిధ పార్టీలో ఉన్న మైనార్టీ నాయకులు రాజకీయాలకు అతీతంగా పలువురు మైనార్టీ నాయకులు స్పందించి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నూరు మహమ్మద్‌ను పరామర్శించి ధైర్యం చెప్పడంతో పాటు ఎమ్మెల్యే దగ్గుబాటిపై తీవ్ర ఆగ్రహావేషాలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దగ్గుబాటి తీరు సరికాదని, తమ పద్ధతులు మార్చుకోకపోతే ఎమ్మెల్యే పాల్గొనే ఇఫ్తార్ విందులను మైనార్టీలు బహిష్కరించాల్సి వస్తుందని ప్రముఖ మైనార్టీ నేత కేపం షకీల్ షఫీ హెచ్చరించారు.

అయితే ఒక డివిజన్‌లో ఇద్దరు నాయకుల మధ్య జరిగిన చిన్న వివాదమని, ఇది రాజకీయ నిరుద్యోగులు సమస్యగా చేస్తున్నారని ఎమ్మెల్యే దగ్గుబాటి వివరణ ఇచ్చారు.

ఈ సంఘటనకు సంబంధించి వివరాలకు వెళ్తే.. అనంతపురం నగరంలోని ఆజాద్ నగర్‌కు చెందిన టిడిపి స్థానిక నాయకుడు నూర్ మహమ్మద్ ఆదివారం దోమల ముందు లిక్విడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం సంచలనం సృష్టించింది. నూర్ ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేశాడు. ఆజాద్ నగర్‌లో గడచిన పది సంవత్సరాలుగా తాను నివాసం ఉంటున్నట్లు అందులో పేర్కొన్నాడు. ఈనెల 9వ తేదీన ముస్లింలకు ప్రత్యేకంగా నూర్ మహమ్మద్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశాడు. అయితే స్థానిక టిడిపి కార్పొరేటర్ రాయల్ మధుకు విషయం చెప్పకుండా నేరుగా ఎమ్మెల్యేకి ఆహ్వానం పంపడంతో గొడవ మొదలైంది. తమ అనుమతి లేకుండా ఇఫ్తార్ విందు ఏవిధంగా పెడతారు అని మధుతోపాటు కొండకమర్ల ఇస్మాయిల్ ఆజాద్ పలుమార్లు బెదిరించారని నూరు మహమ్మద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక బూత్ కన్వీనర్ సైతం ఈ వ్యవహారంలో పాలుపంచుకున్నట్లు పేర్కొన్నాడు. ఈ ముగ్గురి వల్ల తనకు తీవ్రమైన వేధింపులు చోటు చేసుకుంటున్నాయని, ఆత్మహత్య శరణ్యమని వీడియోలో మాట్లాడుతూ లిక్విడ్ తాగేశాడు. జిల్లా ఎస్పీ ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు. తన కుటుంబానికి హాని జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశాడు. ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యేను రానీయకుండా చేశారని పేర్కొన్నారు. మందు తాగిన విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. వైద్యులు ఆగమేఘాల మీద సేవలు అందించి ప్రాణాపాయం నుంచి తప్పించినట్లు తెలిపారు.

# ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఎ లైసెన్స్ ఇవ్వాలి

### ఏప్రిల్ 10న ఉమ్మడి అనంతపురం జిల్లా బంద్‌కు సిపిఐ పిలుపు



అనంతపురం, మార్చి 11 ప్రభాతవార్త బ్యూరో: పాలక ప్రభుత్వాలకు దీటుగా అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో దశాబ్దాలు కాలం నుంచి సేవలందిస్తున్న ప్రముఖ స్వచ్ఛత సంస్థ ఆర్డిటికి ఎఫ్‌సిఆర్ఎ లైసెన్స్ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 10న ఉమ్మడి అనంతపురం జిల్లా బందుకు సిపిఐ పార్టీ పిలుపునిచ్చింది.. ఈ సంఘటన రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వైసిపి పార్టీ కూడా పార్లమెంటు సమావేశాలు ముగిసే లోగా ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్ఎ లైసెన్సీ ఇవ్వకపోతే ప్రభుత్వ కార్యకలాపాలను స్తంభింప చేస్తామని హెచ్చరిక చేసిన విషయం తెలిసిందే. మంగళవారం కళ్యాణ్ దుర్గం నియోజకవర్గం కుందుర్పిలో పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతరామిరెడ్డి, ఇతర వైసీపీ సమన్వయకర్తలు తమ ప్రసంగాల్లో ఆర్డిటి పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎవరిస్తున్న తీరుపై తీవ్రంగా స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిపిఐ కూడా ఘాటుగా స్పందించింది. బుధవారం సిపిఐ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ మీడియాతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో పేద ప్రజలకు ఆర్డిటి సంస్థ ఆక్సిజన్ లాంటిదని, ఆ డ్యూటీకి ఎఫ్‌సిఆర్ఎ లైసెన్స్ విలువలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్షయంగా వ్యవహరిస్తోందన్నారు. దశాబ్దాలుగా విద్య, వైద్యం, క్రీడలు, గ్రామీణాభివృద్ధి, రైతులకు వాటర్‌షెడ్లు, పేదలకు గృహ నిర్మాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని సంపాదించిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఎ అకౌంట్ రెన్యువల్‌ను నిలిపివేయడం వల్ల విదేశాల నుంచి వచ్చే నిధులు పూర్తిగా ఆగిపోయాయని ఆయన విమర్శించారు. ఈ పరిణామాల కారణంగా ఆర్డిటి నిర్వహిస్తున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికే సంస్థలో పనిచేస్తున్న సుమారు వందలాది మంది సిబ్బందికి వేతనాలు చెల్లించలేక ఉద్యోగాల నుంచి తొలగించాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. అలాగే స్టేడియాలు, వైద్యసేవలు వంటి అనేక సంస్థలు మూతపడే ప్రమాదం నెలకొన్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్డిటికి నిధులు అందకపోవడంతో సంస్థ ఆస్తులను విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ మేరకు పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం కూడా పరిస్థితి తీవ్రతను చూపిస్తోందన్నారు. పత్రికలలో వెలువడిన ప్రకటనను మీడియా ముందు ప్రదర్శించారు.


కేంద్ర మంత్రి రామ్మోహన నాయుడు ఇంట్లో ఎంపీల ఆత్మీయ కలయిక

## ఢిల్లీలో కూటమి ఎంపీల ఆత్మీయ కలయిక సందడి చేసిన మంత్రి నారా లోకేష్

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: ఢిల్లీ పర్యటనలో ఉన్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కూటమి ఎంపీల ఆత్మీయ సమావేశంలో సందడి చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన నాయుడు తన నివాసంలో బుధవారం మధ్యాహ్నం ఇచ్చిన విందుకు కూటమి ఎంపీలు, మంత్రి నారా లోకేష్ హాజరయ్యారు. రామ్మోహన నాయుడు మాతృమూర్తి లోకేష్‌ను ఆశీర్వదించారు. రామన్న పిల్లలను ఎత్తుకున్న లోకేష్ వారితో సరదాగా మాట్లాడించారు. పెద్దమ్మ పురందరేశ్వరి ఆశీస్సులు తీసుకున్నారు. ఎంపీలందరినీ పేరుపేరునా పలకరిస్తూ సందడి చేశారు.

## పాడి ఉత్పత్తులు ఎక్కడైనా విక్రయించొచ్చు

### విజయ డెయిరీ వివాదంపై మంత్రి లోకేష్

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: విజయ డెయిరీ వివాదంపై మంత్రి లోకేష్ గుత్తా అమిత్‌రెడ్డి ప్రకటనకు స్పందనగా ఎక్స్‌వేదికగా "ట్వీట్" చేసారు మీ ఆందోళనలను గమనించి సమీక్షిస్తున్నాం. ఎపిడిడిసిఎఫ్ నాణ్యత పరీక్షలను నిర్వహిస్తోంది అని మంత్రి నారా లోకేష్ తెలిపారు. సిఎల్ఎఫ్-ఎన్‌డిడిబి పరీక్ష నివేదికలను కూడా పరిశీలిస్తాం అన్నారు. ఇప్పుడు మార్కెట్లో ర్యాండమ్‌గా శాంపిల్స్ సేకరణ, వన్ నేషన్, వన్ మార్కెట్ అనేది మోడీ నినాదం, పాడి ఉత్పత్తులు ఇతర రాష్ట్రాల్లో కూడా విక్రయించవచ్చు. నాణ్యత, వినియోగదారుల ఆరోగ్యం. ఎపి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతాంశాలు అంటూ లోకేష్ తన పోస్టులో స్పష్టం చేసారు.



గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మహిళ

## కడుపులో గడ్డను బిడ్డ అని చెబుతూ 9 నెలలుగా డాక్టర్లు వైద్యం

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో కడుపులో గడ్డను బిడ్డ అని చెబుతూ 9 నెలలుగా ప్రభుత్వ డాక్టర్లు వైద్యం చేశారు నెలలు నిండుతున్నా.. బిడ్డలో కదలికలు లేవంటూ వైద్యులకు చెప్పిన మహిళ. కానీ.. చిరాకు పడుతూ మహిళపై వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చారు. కడుపుతీపితో 9 నెలలు వైద్యులు ఇచ్చిన మందులు వేసుకున్న మహిళ. అంగన్వాడీలోనూ టీకాలు వేయించుకుందా మహిళ. ఆఖరికి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి స్కానింగ్ చేయించుకోగా బిడ్డ లేదు పెరిగింది గడ్డ అని ప్రైవేట్ వైద్యులు తేల్చారు. స్కానింగ్ రిపోర్టు తీసుకెళ్లి గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుల్ని ఆ మహిళ ప్రశ్నించగా వారు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దాంతో ఆమె వైద్యులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు చేశారు.

### బిఆర్‌నాయుడు కనబడుట లేదని

## వైసిపి శ్రేణుల వింత ఫ్లెక్సీ

### - చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్




**తిరుపతి,మార్చి 11 ప్రభాత వార్త ప్రతినిధి:** హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవ స్థానంపై వైసిపి నేతలు చేస్తున్న ఆరోపణలు, విమర్శలు రోజుకో వేడి పుట్టిస్తున్నాయి. తాజాగా టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కనబడుట లేదని బుధవారం వైసిపి శ్రేణులు ఓ ఫ్లెక్సీవేసి ఏకంగా టిటిడి పరిపాలన భవనం ప్రహరీగోడకు పెట్టడం సంచలనం కలిగించింది. ఈ వింత ప్రవర్తనతో తిరుపతి వాసులేగాక కొందరు టిటిడి ఉద్యోగ సంఘాలు, టిడిపి శ్రేణులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇంత జరుగుతున్నా టిటిడి భద్రత సిబ్బంది ప్రేక్షకపాత్ర వహించడం వెనుక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుపై వైసిపి ఉమ్మడిచిత్తూరుజిల్లా ఇన్‌ఛార్జి,టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పలు రకాలుగా విమర్శలు చేస్తున్న విషయం విదితమే.. దీనిపై బుధవారం ఉదయం తిరుపతి వైసిపి శ్రేణులు పసుపులేటి సురేష్,ఆరే అజయ్ కుమార్, ఉదయ్ వంశీ, కట్టా గోపి యాదవ్, వాసుదేవ యాదవ్ తదితరులు కలసి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు కనబడుటలేదని ఫ్లెక్సీని వేశారు. దాన్ని టిటిడి పరిపాలన భవనం గోడకు పెట్టి వింత ధోరణితో నిరసన వ్యక్తం చేశారు.

ఎప్పుడూ రద్దీగా ఉండే కెటిరోడ్డులోని టిటిడి పరిపాలన భవనం వద్ద ఇంత రాద్ధాంతం ఇంత జరుగుతున్నా కాపలాగా ఉండే టిటిడి భద్రత సిబ్బంది పట్టించుకోకపోవడం మరీ విచిత్రం. ఆ ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాల్సిన భద్రత సిబ్బంది అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దేనికి సంకేతమని విమర్శలు వినిపిస్తున్నాయి. తీరా ఇంత జరిగిన తరువాత కూడా ఫ్లెక్సీ పెట్టిన వారిపై కనీసం పోలీసులకు, టిటిడి ఉన్నతాధికారులకు ఫిర్యాదు కూడా చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. టిటిడి పరిపాలన భవనం వద్ద విదుల్లో ఉన్న భద్రత సిబ్బందిపై టిటిడి ఉద్యోగ సంఘాలు, టిడిపి శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. వైసిపితో టిటిడి భద్రత సిబ్బంది కొందరు మిలాఖత్ అంటూ విమర్శలు గుప్పించారు. దీని వెనుక భూమన కుట్ర దాగివుందని, రాజకీయమేనంటున్న ఉద్యోగులు. తీరా మధ్యాహ్నం కొందరు ఆ ఫ్లెక్సీని అక్కడ నుండి తొలగించారు.

## లోక్‌సభ స్పీకర్‌పై తీర్మానాన్ని వ్యతిరేకించిన వైసిపి - ఎంపి గురుమూర్తి వెల్లడి

విజయవాడ, మార్చి 11 ప్రభాతవార్త ప్రతినిధి: లోక్‌సభ స్పీకర్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకిస్తున్నట్లు తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దిల గురుమూర్తి స్పష్టం చేశారు. లోక్‌సభలో మాట్లాడుతూ స్పీకర్ పదవికి, పార్లమెంటు సంప్రదాయాలకు ఉన్న గౌరవాన్ని కాపాడటం కోసమే తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. తమ పార్టీ ఏ కూటమికీ చెందినది కాదని, తాము ఎన్డీయే కూటమిలోనూ లేమని, ఇండియా కూటమిలోనూ లేమని ఆయన పేర్కొన్నారు. సభ గౌరవం, స్పీకర్ స్థానం పరిరక్షణ దృష్ట్యా ఈ విషయంలో తాము స్పష్టమైన వైఖరి తీసుకున్నామని చెప్పారు. స్పీకర్ పదవి రాజకీయ పదవి కాదని, అది రాజ్యాంగబద్ధమైన పదవని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఆ కుర్చీకి ప్రతి సభ్యుడు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలకు మేలు జరిగే అంశాల్లో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను తమ పార్టీ సమర్థిస్తుందని, అదే సమయంలో ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉంటే ప్రభుత్వాన్ని వ్యతిరేకించడానికీ వెనుకాడబోమని స్పష్టం చేశారు. స్పీకర్ తీసుకునే ప్రతి నిర్ణయం అందరికీ నచ్చకపోవచ్చు కానీ అవన్నీ పార్లమెంటరీ నిబంధనల ప్రకారమే జరుగుతాయని చెప్పారు. సభ సజావుగా నడవాలంటే స్పీకర్ స్థానాన్ని గౌరవించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన సమస్యలను లోక్‌సభలో లేవనెత్తడానికి స్పీకర్ శ్రీ ఓం బిర్లా తగిన అవకాశాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. అందువల్ల స్పీకర్‌పై ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున తాము వ్యతిరేకిస్తున్నామని ఎంపీ గురుమూర్తి స్పష్టం చేశారు. సభ హుందాతనాన్ని, పార్లమెంటరీ సంప్రదాయాలను కాపాడాలనే ఉద్దేశంతోనే తమ పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ఆట

### వరల్డ్ బాక్సింగ్ ఫ్యూచర్స్ కప్‌లో

## భారత్ బాక్సర్లకు ఐదు విజయాలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఫ్యూచర్స్ కప్-2026లో భారత యువ బాక్సింగ్ జట్టు బలమైన ప్రదర్శనను అందించింది. రెండు సెషన్లలో ఐదు విజయాలను నమోదు చేసింది. చంద్రిక పూజారి (50 కిలోలు) ఆధిపత్య ప్రదర్శన చేసి వెనిజులాకు చెందిన తన ప్రత్యర్థిపై 5-0 తేడాతో ఏకగ్రీవంగా విజయం సాధించింది. జోయ్‌శ్రీ దేవి (54 కిలోలు) కూడా టోర్నమెంట్‌లో తన అద్భుతమైన ప్రదర్శన కొనసాగించింది. స్థిరమైన దాడులతో బౌట్‌ను నియంత్రించిన తర్వాత



కజకిస్తాన్‌తో జరిగిన మూడవ రౌండ్‌లో రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్ విజయాన్ని సాధించింది. పురుషుల విభాగంలో కూడా భారత్‌కు చెందిన ఎల్. అంబేకర్ (50 కిలోలు) ఈక్వెడార్‌పై 5-0 ఏకగ్రీవ నిర్ణయాత్మక విజయంతో ముందుకు సాగాడు. రెండో సెషన్‌లో భారత జట్టు మరో రెండు విజయాలు సాధించి, ఫలవంతమైన రోజును ముగించింది. గుంజన్ (48 కిలోలు) తన ఇటలీ ప్రత్యర్థిని తీవ్రంగా ఎదుర్కొని, తీవ్రమైన పోటీ తర్వాత 3-2 తేడాతో విజయం సాధించింది. ప్రాచి (60 కిలోలు) తన బౌట్ ప్రారంభ రౌండ్‌లో ఈక్వెడార్ ప్రత్యర్థిని ఓడించి భారత్‌కు ఐదవ విజయాన్ని నమోదు చేసింది.

## టీ20లో నం. 1 అభిషేక్



**న్యూఢిల్లీ:** ఐసీసీ టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్ దుమ్ము రేపాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో మెరుగైన ప్రదర్శనతో కెరీర్ బెస్ట్ ర్యాంక్ అందుకున్నాడు. రెండు స్థానాలు ఎగబాకి 871 రేటింగ్ పాయింట్స్‌తో రెండో స్థానంలో నిలిచాడు. మెగా టోర్నీలో ఇషాన్ కిషన్ 9 మ్యాచ్‌లు ఆడి 317 పరుగులు చేశాడు. న్యూజిలాండ్‌తో ఫైనల్లో హాఫ్ సెంచరీతో సత్తా చాటిన అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని కాపాడుకున్నాడు. 875 రేటింగ్ పాయింట్స్‌తో నెంబర్ వన్ బ్యాటర్‌గా కొనసాగుతున్నాడు. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మకు మధ్య 4 రేటింగ్ పాయింట్సే ఉన్నాయి. పాకిస్థాన్ ఓపెనర్ షాహిబ్జాదా ఫర్హాన్ ఒక స్థానం దిగజారి మూడో స్థానంలో నిలవగా, ఫిల్ సాల్ట్, పాతుమ్ నిస్సంక, టీమ్ సీఫెర్ట్ వరుసగా టాప్6లో కొనసాగుతున్నారు. తెలుగు తేజం తిలక్ వర్మ ఒక స్థానం దిగజారి 7వ స్థానంతో సరిపెట్టుకున్నాడు.

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 9వ స్థానంలో నిలిచాడు. టీమిండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తన అగ్రస్థానాన్ని కోల్పోయాడు. సూపర్8 దశ నుంచి వరుణ్ తడబడటంతో 740 రేటింగ్ పాయింట్స్‌తో ఒక స్థానం దిగజారి రెండో స్థానంలో నిలిచాడు. 753 రేటింగ్ పాయింట్స్‌తో అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా ఒక స్థానం ఎగబాకి టాప్6లో నిలిచాడు. అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు దిగజారి 16వ స్థానానికి పడిపోగా, అక్షర్ పటేల్ 6 స్థానాలు ఎగబాకి 17వ స్థానాన్ని సరిపెట్టుకున్నాడు.

## మహిళల ఆసియా కప్: చైనీస్ తైపీ చేతిలో భారత్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియాలోని వెస్ట్రన్ సిడ్నీ స్టేడియంలో జరిగిన ఎఎఫ్‌సి మహిళల ఆసియా కప్-2026, చివరి గ్రూప్ గేమ్‌లో భారత మహిళల ఫుట్‌బాల్ జట్టు చైనీస్ తైపీ చేతిలో ఓటమిపాలై, టోర్నీ నుండి నిష్క్రమించింది. గత మ్యాచ్‌లలో రెండు పరాజయాలను చవిచూసిన తర్వాత భారత్ ఈ టోర్నమెంట్‌లో సజీవంగా ఉండాలంటే కనీసం 2 గోల్స్ చేసి, ఆ తర్వాత మ్యాచ్ గెలవాల్సి ఉంటుంది. ఆటలో ఎక్కువ భాగం ఆధిపత్యం చెలాయించినప్పటికీ వరుసగా మూడవ ఓటమిని ఎదుర్కొంది. ఫలితంగా 3-1 తేడాతో ఓటమి చెందిన భారత్ జాతీయ ఫుట్‌బాల్ జట్టు గ్రూప్ దశ నుండి వైదొలగింది. ఈ మ్యాచ్‌లో ఎక్కువ భాగాన్ని నియంత్రించి అనేక అవకాశాలను సృష్టించినప్పటికీ, వారు పూర్తి చేయకపోయింది. 2వ నిమిషంలో భారత జట్టు చేసిన ఘోర తప్పిదంతో చైనీస్ తైపీ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సంజు ఇచ్చిన పేలవమైన బ్యాక్ పాస్ రిజా చెన్ బంతిని తీసుకొని స్కోర్ చేయడానికి వీలు కల్పించింది. మనీషా కళ్యాణ్ వ్యక్తిగత ప్రతిభతో 39వ నిమిషంలో భారత్ ధీటుగా స్పందించి స్కోరును సమం చేసింది. వింగర్ అద్భుతమైన లాంగ్‌రేంజ్ స్ట్రైక్‌తో గోల్ కీపర్‌ను ఓడించి సమంచేశాడు.మొదటి అర్ధభాగంలో ఆటముగిసే సమయానికి చైనీస్ తైపీ తిరిగి ఆధిక్యాన్ని సాధించింది. ప్యారీ జాక్సా పెనాల్టీ ఏరియా లోపల బంతిని హ్యాండిల్ చేసిన తర్వాత, రిఫరీ స్పాట్‌కిక్ ఇచ్చాడు. దీంతో చైనీస్ తైపీ హాఫ్ టైంముగిసే సమయానికి2-1 ఆధిక్యంలో ఉంది.రెండవ అర్ధభాగంలో సమంచేసే ప్రయత్నంలో భారత్ ముందుకు సాగింది, కానీ 77వ నిమిషంలో మళ్ళీ క్యాచ్ అవుట్ అయింది. యు చిన్ చెన్ పాంథోయ్‌ను ఓడించి గోల్‌తో భారత్ ఓటమిని శాసించాడు.

### స్విస్ ఓపెన్‌లో 16వ రౌండ్‌కు

## సాత్విక్- చిరాగ్, హరిహరన్- అర్జున్



**న్యూఢిల్లీ:** స్విట్జర్లాండ్‌లోని బాసెల్‌లో జరిగిన 2026 స్విస్ ఓపెన్ సూపర్ 300లో ప్రపంచ నం.4 జంట సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి 16వ రౌండ్‌కు దూసుకెళ్లారు. వారు చాలా తక్కువ ర్యాంక్‌లో ఉన్న సింగపూర్ జంట ఇంగ్ కో-జునుసుకే కుబోలను 21-19, 21-19 తేడాతో వరుస గేమ్‌లలో ఓడించి విజయంతో ప్రచారాన్ని ప్రారంభించారు. మరో భారత పురుషుల డబుల్స్ జత హరిహరన్ అంసకరు ఐన్-ఎంఆర్ అర్జున్ కూడా వరుస గేమ్‌ల విజయంతో రెండవ రౌండ్‌లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు. రెండో గేమ్‌లో 21-16, 24-22 తేడాతో సుదీర్ఘ డ్యూస్ పాయింట్ల తర్వాత వారు చైనీస్ తైపీ జత చెన్ ఝీ రే-లిన్ యు చిహ్‌లను ఓడించారు. మహిళల డబుల్స్‌లో, భారత అగ్రశ్రేణి జంట ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ గాయం కారణంగా మొదటి గేమ్ సగంలోనే వైదొలగడంతో దురదృష్టకర ముగింపును ఎదుర్కొన్నారు. 713 స్కోరు వద్ద, ట్రీసీ తన కుడి కాలులో కొంత నొప్పిగా అనిపించి ఆట నుండి వైదొలగాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయంతో తైపీ జంట హు లింగ్ ఫాంగ్-జెంగ్ యు చీహ్‌లకు విజయాన్ని అందించింది. గత వారం ఆల్ ఇంగ్లాండ్ తర్వాత ఈ భారత్ డబుల్స్ వరుసగా రెండో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించడం ఇది రెండో సారి.

## ఔషధ తయారీ రంగంపై వార్ ఎఫెక్ట్

### తడిసిమోపెడవుతున్న నిర్వహణ వ్యయం

**న్యూఢిల్లీ, మార్చి 11:** భారత ఔషధ రంగాన్ని ఇరాన్ యుద్ధం తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. యుద్ధం కారణంగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, మందుల తయారీ ముడి సరకు ధరలు పెరగడమే ఇందుకు కారణం. దేశీయంగా పారాసిటమాల్ సహా పలు రకాల మందుల ధరలు పెరుగుతున్నట్లు ట్రేడర్లు చెపుతున్నారు. ఔషధాల తయారీలో కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్(ఏపిఐ), ద్రావకాల ధరలు గత 2 వారాల్లో ఏకంగా 30 శాతం పెరిగాయి. భారత్ ఫార్మా అవసరాల కోసం, ముడి పదార్థాల కోసం చైనాపైనే అధికంగా ఆధారపడుతుంది. ఇరాన్ యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా సంక్షోభంతో కంటైనర్ల కొరత ఏర్పడింది. సరకు రవాణా నౌకల మళ్లింపుతో చైనా నుంచి వచ్చే ముడి పదార్థాల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. యుద్ధం కారణంగా సముద్రపు మార్గాల్లో రవాణాకు ముప్పు ఏర్పాడింది. షిప్పింగ్ కంపెనీలు సరకు రవాణా ఛార్జీలు ఒక్కసారిగా పెంచేశాయి. ప్రతి షిప్‌మెంట్‌పై 4 8 వేల డాలర్ల వరకు అదనపు ఛార్జీలు విధిస్తున్నాయి. ఇది దిగుమతి చేసుకునే దేశాలకు పెను భారంగా మారింది.



అదనపు భారాన్ని భరించలేక ఔషధ తయారీ కంపెనీలపై వేస్తున్నారు. గత డిసెంబర్ నెలతో పోలిస్తే గ్లిజరిన్ ధర 64 శాతం పెరిగింది. అత్యంత అవసర ఔషధాల్లో ఒకటైన పారాసిటమల్ తయారీ ముడి పదార్థాల ధర 26 శాతం మేర పెరిగింది. మందుల తయారీలో వాడే ద్రావకాలు పెట్రోకెమికల్స్ నుంచి తయారవుతాయి. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ఈ ద్రావకాల ధరలు వారం రోజుల్లోనే భారీగా పెరిగాయి. ఔషధాల ఉత్పత్తిలో ఉపయోగపడే పదార్థాలు కావడంతో తయారీ ఖర్చు తడిసి మోపెడవుతోంది. భారత్‌లో నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ రూల్స్ ప్రకారం ధరలు నిర్ణయిస్తారు.ధరల నియంత్రణ నిబంధనల కారణంగా కంపెనీలు నష్టపోతున్నాయని, మరో 15 రోజులు ఇలాగే కొనసాగితే నిత్యావసర మందుల కొరతా ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### రూ.25 లక్షలకోట్లతో అమెరికాలో

## అంబానీ అతిపెద్ద రిఫైనరీ!

**ముంబయి, మార్చి 11:** అమెరికా ఇంధన రంగంలో ఒక చారిత్రాత్మక అధ్యాయం మొదలైంది. గత 50 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా, అమెరికాలో మొట్టమొదటి కొత్త ఆయిల్ రిఫైనరీని నిర్మిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెక్సాస్‌లోని బ్రౌన్స్‌విల్లే పోర్ట్ వద్ద నిర్మించబోయే ఈ భారీ ప్రాజెక్టులో భారతీయ దిగ్గజ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ భాగస్వామిగా ఉందని ట్రంప్ తన సోషల్‌మీడియా ట్రూత్‌లోప్రకటించారు. ఈ ప్రాజెక్టు విలువ సుమారు 300 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 25 లక్షల కోట్లు. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద డీల్ అని ట్రంప్ అభివర్ణించారు. భారత దేశంలోని మా భాగస్వాములకు, అక్కడి అతిపెద్ద ప్రైవేట్ ఇంధన సంస్థ రిలయన్స్‌కు ఈ భారీ పెట్టుబడి పెట్టినందుకు ధన్యవాదాలని పేర్కొన్నారు. అమెరికా ఫస్ట్ రిఫైనింగ్ అనే సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టనుంది. ఇది ప్రపంచంలోనే అత్యంత స్వచ్ఛమైన రిఫైనరీగా నిలుస్తుందని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమాసియాలో చమురు సరఫరాకు ఆటంకాలు కలుగుతున్న సమయంలో, ఈ కొత్త రిఫైనరీ అమెరికా ఇంధన భద్రతను బలోపేతం చేయడమే కాకుండా, వేలాది మందికి కొత్త ఉద్యోగాలను కల్పిస్తుందని ఆయన చెప్పారు. ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద రిఫైనరీని జామ్‌నగర్‌లో నిర్వహిస్తోంది. ఇప్పుడు అమెరికాలో నిర్మించబోయే ఈ భారీ ప్రాజెక్టులో రిలయన్స్ భాగస్వామ్యం కావడం ద్వారా ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు మరో స్థాయికి చేరుకున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. పన్నుల తగ్గింపు, అనుమతుల సరళీకరణ వల్లే ఇలాంటి భారీ పెట్టుబడులు అమెరికాకు తిరిగి వస్తున్నాయని ట్రంప్ ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు.



వాణిజ్యం




### ఇరాన్‌పై యుద్ధంతో

## కుప్పకూలిన సెన్సెక్స్, నిఫ్టీ

### భారీ కంపెనీల్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు విత్‌డ్రా

### మూడు పెద్దబ్యాంకులకు రూ.55వేల కోట్ల నష్టం

**ముంబయి, మార్చి 11:** ఎంపికచేసిన భారీ కంపెనీల్లో అమ్మకాల ఒత్తిడిపెరగడం, మధ్యప్రాచ్యంలో పెరిగిన ఉద్రిక్తతలతో స్టాక్ మార్కెట్లు భారీగా కుదేలయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు స్టాక్స్‌నుంచి పెట్టుబడులను విత్‌డ్రాచేసుకున్నారు. దీనితో మార్కెట్లపై ఒత్తిడిపెరిగింది. డాలరుతోరూపాయి మారకం కూడా మళ్లీ క్షీణించింది.దేశంలో మూడు అతిపెద్ద బ్యాంకులు హెచ్‌డిఎఫ్‌సి,ఐసిఐసిఐ, ఎస్‌బిఐలు సమిష్టిగా 55 వేల కోట్ల రూపాయల మార్కెట్ విలువలు నష్టపోయాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 1342.27 పాయింట్లు క్షీణించి 76,863.71 పాయింట్లవద్ద ట్రేడింగ్‌ముగిస్తే ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 50 సూచీ కూడా 394.75 పాయింట్లు క్షీణించి 23,866.85 పాయింట్ల వద్ద ముగిసింది. బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.13శాతం దిగజారితే స్మాల్‌క్యాప్‌సూచీ కూడా 0.32శాతం క్షీణించింది. బ్యాంకింగ్ స్టాక్స్‌లో యాక్సిస్ బ్యాంకు 4.62శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.77శాతం రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.56శాతంచొప్పున క్షీణించాయి. మార్కెటపరంగా ప్రతికూలంగానే ముగిసాయి. బిఎస్‌ఇలో 1881 షేర్లు పెరిగితే 2381 షేర్లు దిగజారాయి. 169 కంపెనీల్లో మాత్రమే స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారకం విలువలు 92 వద్దముగిసింది. ముందురోజు 91.85తో పోలిస్తే మరింత క్షీణించింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌నాటి సెంటిమెంట్లుపరంగాచూస్తే 0.71శాతం క్షీణించి రూ.162,161గా నడిచాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల డెలివరీకి సంబంధించి 3.28 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 91.8డాలర్లుగా కొనసాగింది. స్టాక్స్‌పరంగా జియోఫైనాన్షియల్, డాక్టర్ రెడ్డీస్, సన్‌ఫార్మా, కోల్ ఇండియా ఎన్టీపీసీ షేర్లు రాణిస్తే బజాజ్‌ఫైనాన్స్, యాక్సిస్‌బ్యాంకు బజాజ్ ఫిన్‌సెర్వ్, ఎంఅండ్‌ఎం, ఐషర్‌మోటార్స్ స్టాక్స్‌నష్టపోయాయి.

పశ్చిమాసియాలో యుద్ధంముగింపుపై స్పష్టత లేకపోవడం చమురుధరల్లో అస్థిరతలకారణంగానే అమ్మకాలు జోరందుకున్నాయి.

### సర్ ఛార్జీలపేరిట ఎయిరిండియా

## ఛార్జీల పెంపు!

**ముంబయి, మార్చి 11:** గల్ఫ్‌ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలవల్ల దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో ఇంధన సర్‌ఛార్జీలను దశల వారీగా పెంచాలని ఎయిరిండియా నిర్ణయించింది. విమాన టికెట్లపై విధించే ఈ ఫ్యూయల్ సర్‌ఛార్జీలు డొమెస్టిక్ సౌత్ ఏసియన్ అసోసియేషన్ ఫర్ రీజనల్ కోఆపరేషన్ విమానాలకు రూ.399 చొప్పున పెంచాలని నిర్ణయించింది. ఇంటర్నేషనల్ ఫ్లైట్ టికెట్లపై ఈ సర్‌ఛార్జీని 200 డాలర్లు పెంచాలని నిర్ణయించినట్లు ఎయిరిండియా గ్రూప్ ప్రకటించింది. ఈ సర్ ఛార్జీ పెంపు అనేది 3 దశల్లో అమలు చేయనున్నది. మొదటి దశ సర్ ఛార్జీలను గురువారం ఉదయం 1 గంట నుంచి అమలులోకి తీసుకొస్తున్నది. ఇక రెండో దశ సర్ ఛార్జీల అమలును ఈనెల 18, 2026 నుంచి అమలు చేస్తామని తెలిపింది. ఆ తర్వాతే మూడో దశ అమలు చేస్తామని వెల్లడించింది.




ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎటీఎఫ్ ధరలు భారీగా పెరుగుతున్న క్రమంలోనే ఈ ఫ్యూయల్ సర్‌ఛార్జీలను పెంచాలని ఎయిరిండియా నిర్ణయించినట్లు వివరించింది. ఒక్కసారిగా ప్రయాణికులపై భారం మోపకుండా దశల వారీగా అమలు చేస్తున్నట్లు తెలిపింది. విమాన కంపెనీ ఆపరేటింగ్ ఖర్చులో 40 శాతం మేర ఈ జెట్ ఫ్యూయల్ ఉంటుంది. ఏటీఎఫ్ ధర పెరిగితే ఆపరేషన్స్ ఖర్చు భారీగా పెరుగుతుంది. విమాన సంస్థలు భారీ నష్టాల్లో కూరుకుపోకుండా ఉండేందుకు విమాన టికెట్లపై ఫ్యూయల్ సర్ ఛార్జీలు విధిస్తుంటాయి. దేశీయ మార్గాల్లో విమాన ప్రయాణికులకు టికెట్లపై రూ.400 మేర అదనపు భారం పడుతుంది. ఇంటర్నేషనల్ టికెట్లపై ఇప్పటికే ఫ్యూయల్ సర్‌ఛార్జీ ఉంటుంది. ఇప్పుడు అది మరింత పెరగనుంది. ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ఎయిర్ లైన్స్ సర్ ఛార్జీలను పెంచక తప్పదని కంపెనీలు వాదిస్తున్నాయి. ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగి ఫ్యూల్ ఛార్జీలు తగ్గిన తర్వాత పెంచిన సర్ ఛార్జీల విషయంలో విమాన సంస్థలు పునఃసమీక్ష చేస్తాయనే నమ్మకం ఉందని, ఈ ఛార్జీలను ఎత్తివేయవచ్చున్న అంచనాలున్నాయి.

### ఆర్‌బిఐ రూ.50 వేల కోట్ల

## ప్రభుత్వ బాండ్ల కొనుగోళ్లు




**ముంబయి, మార్చి 11:** ఆర్థికవ్యవస్థలోకి నగదును మరింతగా చొప్పించేందుకు వీలుగా భారత రిజర్వుబానయంకు రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ బాండ్లను ఓపెన్ మార్కెట్ ఆపరేషన్‌ద్వారా వేలంలో కొనుగోలుచేస్తోంది. శుక్రవారం ఈ బాండ్లకొనుగోలు ప్రక్రియతో ఆర్థికవ్యవస్థలోకి నగదు చెలామణి పెరిగి సమతుల్యత పెరుగుతుందని అంచనా. మల్టీప్రైస్ అంటే బహుళధరల పద్ధతిలో ఈసెక్యూరిటీలను కొనుగోలుచేస్తుంది. 2029వరకూ ఉండే ప్రభుత్వ సెక్యూరిటీలు 6.45శాతం, 2032వరకూ చెల్లుబాటయ్యే ప్రభుత్వ సెక్యూరిటీలు 7.95శాతం, 2034వరకూ ఉన్న సెక్యూరిటీలు 6.79శాతం, 2035వరకూ ఉండే ప్రభుత్వ సెక్యూరిటీలు 6.64శాతం, 2036వరకూ ఉన్న జిసెక్స్ 7.41శాతం, 2039వరకూ ఉన్న సెక్యూరిటీలు 7.62శాతం, 2046 వరకూ ఉండే సెక్యూరిటీలు 7.06శాతం వరకూ కొనుగోళ్లు ఉంటాయి. అయితే మొత్తం కొనుగోళ్లు రూ.50వేల కోట్లకు మించకుండా ఉంటుంది. ఎంపికచేసిన ప్రభుత్వ సెక్యూరిటీలను మాత్రమే కొనుగోలుచేస్తుంది.

ప్రతి ప్రభుత్వ బాండ్‌కొనుగోలులోనూ ఎంతమొత్తం వేలంలో కొనుగోలుచేయాలన్న సడలింపులు ఆర్‌బిఐకి ఉంటుందని తెలిపింది. ఎక్కువమొత్తం లేదా తక్కువ మొత్తం కొనుగోలుకు కూడా ఆర్బీఐకి పూర్తి అధికారాలుంటాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త


## చించినాడ వంతెన మరమ్మతులకు మళ్లీ చర్యలు - రాకపోకలు పాక్షికంగా నిలుపుదల

నరసాపురం ప్రభాతవార్త :పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ మరియు డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం దిండి గ్రామాలను కలిపే 216 జాతీయ రహదారి పై గల వసిష్ఠ వారధి( చించినాడ వారధి ) మరమ్మత్తుల నిమిత్తం 12వ తేదీ రాత్రి(తెల్లవారితే గురువారం) 12.00 గంటల నుండి ఉదయం 5.00 గంటల వరకూ మరలా ప్రతి 3 రోజులకు ఒక్కసారి అనగా మార్చి నెల 15, 18, 21, 24, 27 మరియు 30వ తేదిలలో పైన తెల్పిన సమయములో అనగా రాత్రి 12.00గంటల నుండి ఉదయం 5.00 గంటల వరకు, వంతెన పై పూర్తిగా రాకపోకలను నిలుపుదల చేస్తారు. చించినాడ 216 జాతీయ రహదారి వెంబడి పర్యటించే వాహనదారులు ఈ విషయాన్ని గమనించి పూర్తిగా సహకరిస్తూ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని నర్సాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు.

# జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదు,

# ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవద్దు

## జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ




ఏలూరు, మార్చి 11 ( ప్రభాత వార్త) : జిల్లాలో గ్యాసు సిలిండర్ల కొరత లేదని, ప్రజలు ఎవ్వరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా గృహ అవసరాలకు మరియు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు వినియోగించే వంట గ్యాసు సిలిండర్ల కొరత ఏమాత్రం లేదని తెలిపారు. జిల్లాలో గ్యాసు సిలిండర్ల సరఫరా మరియు డిమాండు మధ్య సమతుల్యత సక్రమంగా ఉందని, గృహ వినియోగ దారులకు డొమెస్టిక్ గ్యాసు సిలిండర్ల పంపిణీ ఎలాంటి అంతరాయం లేకుండా యధావిధిగా కొనసాగుతోందని తెలిపారు. గ్యాసు ఏజెన్సీలు వద్ద తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, సంక్షేమ వసతి గృహాలకు అవసరమైన గ్యాసు సిలిండర్ల పంపిణీలో ఎలాంటి జాప్యం జరగడం లేదని అన్నారు. విద్యార్థులకు భోజన సదుపాయంలో ఇబ్బంది రాకుండా గ్యాసు సరఫరాను పౌరసరఫరాలు శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోందని, ప్రజలు అవసరాలకు మరియు డిమాండుకు తగినట్లుగానే ఆయిల్ కంపెనీలు నుండి గ్యాసు సరఫరా క్రమం తప్పకుండా జరుగుతోందని అన్నారు. జిల్లాలో గ్యాసు కొరత ఉందంటూ వచ్చే ఎలాంటి వదంతులను, అపోహలను ప్రజలు నమ్మవద్దని, అనవసరంగా భయాందోళనలకు గురై వంట గ్యాస్ నిల్వ చేయవద్దన్నారు. గ్యాసు బుకింగు లేదా డెలివరీకి సంబంధించి వినియోగ దారులకు లేదా వసతి గృహాలు నిర్వాహకులకు ఇబ్బందులు ఎదురైతే, వెంటనే సంబంధిత మండల తహశీల్దారు లేదా జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు దృష్టికి తీసుకురావాలని జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదు - ప్రజలు ఆందోళన చెందవద్దు

### -జె.సి. రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం మార్చి 11 ప్రభాతవార్త :జిల్లా కలెక్టరేట్ ఛాంబర్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి జిల్లాలో వంట గ్యాస్ సరఫరాపై సంబంధిత అధికారులు, గ్యాస్ ఏజెన్సీల యాజమాన్యాలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వంటగ్యాస్ సిలిండర్ల కొరత ఎక్కడా లేదని, ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గృహ వినియోగానికి అలాగే ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల అవసరాలకు సరిపడా వంటగ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల సరఫరా మరియు డిమాండ్ మధ్య సమతుల్యత సక్రమంగా కొనసాగుతోందని తెలిపారు. గృహ వినియోగదారులకు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఎలాంటి అంతరాయం లేకుండా యథావిధిగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల వద్ద తగినంత నిల్వలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు అవసరమైన గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల భోజన సదుపాయంలో ఎలాంటి అంతరాయం కలగకుండా గ్యాస్ సరఫరాను పౌర సరఫరాల శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు. ప్రజల అవసరాలు మరియు డిమాండ్‌కు అనుగుణంగా ఆయిల్ కంపెనీల నుండి గ్యాస్ సరఫరా క్రమం తప్పకుండా కొనసాగుతోందని చెప్పారు. జిల్లాలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉందంటూ వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని సూచించారు. అవసరానికి మించి గ్యాస్ సిలిండర్ల బుకింగ్ చేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్యాస్ బుకింగ్ లేదా డెలివరీకి సంబంధించి వినియోగదారులకు లేదా వసతి గృహాల నిర్వాహకులకు



ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఎన్. సరోజ, సహాయ సరఫరాల అధికారి ఎం.రవిశంకర్, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి ఎన్.వి.అరుణ కుమారి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఏ.వి.సూరిబాబు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి డి.పుష్పరాణి, తదితరులు పాల్గొన్నారు.

# పేదల భూమి... పెద్దలు పాగా

### - భాస్కరరావుపేట లో ప్రభుత్వ భూమి అక్రమ తవ్వకాలు


కలిదిండి,మార్చి 11 (ప్రభాతవార్త) : పేదల భూములు కనబడితే చాలు పెద్దలు పాగా వేయడం ఆనవాయితీగా మారింది. అక్రమార్కులు అధికారులను లోబర్చుకుని, పేదలకు దక్కిన ప్రభుత్వ భూములను అడ్డదారిలో ఆక్రమించి చెరువులుగా మారుస్తున్నారు. ఇది ఎక్కడో కాదండోయ్ కలిదిండి మండలం భాస్కరరావుపేట గ్రామంలో సుమారు 80 ఎకరాలు ప్రభుత్వ అసైన్డ్ భూములు తవ్వుతున్నారు.

**అసలేం జరిగింది**

కలిదిండి మండలం భాస్కరరావుపేట గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలు గత కొన్ని ఏళ్లుగా చెరువులుగా మార్చుకుని చిన్న సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్నారు. ఇక్కడికి కదంతా సాఫీగా ఉన్న తరుణంలో కొంతమంది పెద్దలు ఇదే అదునుగా చూసుకుని ప్రభుత్వ భూమి తక్కువ లీజుకు వస్తుందనే నెపంతో 80 ఎకరాల చిన్న,సన్నకార రైతుల వద్ద నుండి తక్కువ లీజుకు తీసుకుని ఏకచెరువుగా మారుస్తున్నారు. గత నెల రోజులుగా అక్రమ తవ్వకాలు జరుగుతున్నా పట్టించుకోవాల్సిన అధికారులు ముడుపులు దండుకుని అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూముల తవ్వకాలను నిలుపుదల చేస్తారో లేదో వేచి చూడాలి.

**తాసిల్దార్ వివరణ**

ఈ అక్రమ తవకాలపై కలిదిండి తాసిల్దార్ ను వివరణ కోరగా ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు చేపట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## నిషేదిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ & ప్లాస్టిక్ కవర్ల నిర్మూలన పై కఠిన చర్యలు

### రూ లక్ష విలువైన కవర్లు స్వాధీనం - ఎన్ని ఫోన్లు వచ్చిన వెనకడుగు వేయని కమిషనర్



నరసాపురం ప్రభాతవార్త :స్థానిక మున్సిపల్ కమీషనర్ ఆర్. వెంకటరామి రెడ్డి ఆద్వర్యములో మరియు శానిటేషన్ టాస్క్ ఫోర్స్ టీముల వారితో పట్టణములోని దాన్యం బజార్ ఏరియా నందు గల డిస్ పొసబుల్ హోల్ సేల్ షాపులు, కిరాణ షాపులు, హోటల్స్, స్వీట్ షాప్స్ , మొదలగు షాపుల పై ప్రజారోగ్యం దృష్ట్యా ఆకస్మిక దాడులు జరిపి పర్యావరణము నకు హాని కలిగించే నిషేదిత ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు సుమారు రూ 1,00,000/- (లక్ష రూపాయలు) విలువ చేసే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను స్వాదిన పరచుకొని షాపుల వారికి రూ. 12000/- జరిమానాలు విధించారు. సదరు షాపుల యజమానులకు ప్లాస్టిక్ వలన పర్యావరణ కాలుష్యం తో పాటు పశువులు ప్లాస్టిక్స్ ను తిని చనిపోవడం జరుగుతుందని, కావున ప్లాస్టిక్ ప్రత్యామ్నయ సాధనములు వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించి పట్టణ పారిశుద్ధ్యానికి పౌరుల వంతు సహకారం అందించగలరని షాపుల యజమానులకు అవగాహన కల్పించుట జరిగినది. ఈ కార్యక్రమములో శానిటరీ ఇనస్పెక్టర్లు- హెల్త్ అసిస్టెంట్ వారు, వార్డు శానిటేషన్ ఎన్విరాన్మెంట్ సెక్రెటరీ లు, శానిటరీ మేస్త్రి లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నాసిరకంగా

### కాలు వతూడు తొలగింపు



మొగల్తూరు మార్చి 11 పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి మొగల్తూరు మీదుగా ముత్యాలపల్లి వరకు ఉన్న దర్బరేవు డ్రైన్ కాలువ కాలువలో తూడు తొలగింపు పనులు వారం రోజుల క్రితం నాసిరకంగా జరగడంతో కొత్త కాయల తిప్ప వంతెన సమీపంలో తూడు గుర్రపు డెక్క కిక్కిసు ఎప్పటి మామూలుగానే ఏర్పాటు అయింది. తూడు కిక్కిసు తొలగింపులో నాణ్యత లోపించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని బుధవారం స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరుతున్నారు. అదేవిధంగా కొత్త కాయలు తిప్ప సమీపంలో ఉన్న తూరలు తొలగించి ఆ స్థానంలో కాంక్రీట్ వంతెన నిర్మాణం చేపట్టాలని రైతుల కోరుతున్నారు.

## చిదంబరానికి 1409 కటాఫ్ ఓట్లు- బార్ కౌన్సిల్ ఎన్నికల్లో రెండవ స్థానం

### నరసాపురం బార్ లో ఆనంద హేల



నరసాపురం ప్రభాతవార్త : ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ ఎన్నికలు ఓట్ల లెక్కింపు తుది దశకు చేరుకుంది. మొదటి స్థానంలో చలసాని అజయ్ వర్మ 2200 పైగా ఓట్లు సాధించారు. ద్వితీయ స్థానం స్థానిక చినమామిడిపల్లికి చెందిన హైకోర్టు సీనియర్ అడ్వకేట్ కె చిదంబరం 1409 ఓట్లు సాధించి అవసరమైన కటాఫ్ ఓట్లను పొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా బార్ కౌన్సిల్ నందు చిదంబరం సభ్యుడిగా ఉన్నారు. ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో హైకోర్టు బారోసియేషన్ అధ్యక్షునిగా పనిచేశారు. జనసేన పార్టీ రాష్ట్ర నాయకులుగా ఉన్నారు. మృదుస్వభావి స్నేహశీలి అయిన చిదంబరం ఈ ప్రాంతంలో కోర్టుల అభివృద్ధికి తనదైన కృషి చేశారు. యువ న్యాయవాదులకు మార్గదర్శిగా ఉన్నారు. చిదంబరం నరసాపురం బార్ నుంచి వెళ్లి ఎంతో ఉన్నత స్థితికి వెళ్లారు. ఆయన గెలుపు నల్లేరు మీద నడక కావడంతో నరసాపురం బార్లో కేక్ కట్ చేసి ఆనందాలను పంచుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు బూసి విశ్వేశ్వరరావు ప్రధాన కార్యదర్శి వెన్న సూర్య ప్రకాష్ పోలిశెట్టి నారాయణ స్వామి బాబ్జి అందే రాజా పోలిశెట్టి రఘురాం డి సురేష్ కామన బాల సత్యనారాయణ కే శేఖర్ గన్నాబత్తుల వల్లభ రావ్ జ్యోతి మాంగల్య పద్మజ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్పందనలో పశ్చిమ ఫస్ట్



భీమవరం మార్చి 11,ప్రభాతవార్త : ప్రజల సానుకూల అభిప్రాయం 74.1 శాతంతో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఈవిషయం లో కలెక్టర్ చదలవాడ నాగరాణి నిరంతర కృషి ఉందన్నది అందరి అభిప్రాయం. అమరావతి సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం నుండి రెండు రోజులపాటు నిర్వహిస్తున్న కలెక్టర్ల సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించడంతో పాటు వివిధ జిల్లాల పనితీరుపై చర్చ జరిగింది. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తృతీయ త్రైమాసికం (డిసెంబర్ 25, 2025 నుండి ఫిబ్రవరి 24, 2026 వరకు) కాలానికి ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయ సేకరణ నిర్వహించగా పశ్చిమగోదావరి జిల్లా 74.1 శాతం ప్రజల సానుకూల అభిప్రాయం నమోదు చేసుకుని రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలు, పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై మొత్తం 41 అంశాలపై ఐవీఆర్ఎస్ ద్వారా సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో ప్రజలు ఇచ్చిన అభిప్రాయాల ఆధారంగా జిల్లాకు అత్యుత్తమ ఫలితాలు నమోదు కావడం జరిగింది. ఈ సర్వేలో ముఖ్యంగా అన్నా క్యాంటీన్ల నిర్వహణ, ఏపీఎస్ఆర్టీసీ సర్వీసుల మెరుగుదల, మహిళలపై నేరాల నియంత్రణ చర్యలు, దీపం టు పథకం అమలు, ఎఫ్ లైన్ సేవలు, విద్యుత్ సరఫరా సేవలు, గంజా నియంత్రణ చర్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు , పట్టణ ఆరోగ్య కేంద్రాలు అందిస్తున్న వైద్య సేవలు, గృహ నిర్మాణ కార్యక్రమాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ, పంచాయతీ స్థాయిలో అందుతున్న సేవలు, ఆర్ అండ్ ఎస్ రిజిస్ట్రేషన్లు, చౌక ధరల దుకాణాల ద్వారా వస్తువుల పంపిణీ, ఆర్ అండ్ ఆర్ సర్వే, పారిశుద్ధ్య నిర్వహణ, దేవాలయ సేవలు తదితర అంశాలలో జిల్లా మెరుగైన పనితీరును ప్రదర్శించింది. జిల్లాలోని వివిధ శాఖల అధికారులు సమిష్టిగా కృషి చేయడం, ప్రజలకు వేగవంతంగా సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల అభిప్రాయాలను ఆధారంగా తీసుకుని సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం కృషి కొనసాగిస్తుందని పేర్కొన్నారు. మార్చి 12వ తేదీన రెండవ రోజు కూడా కలెక్టర్ల సమావేశం కొనసాగనుండగా, రాష్ట్రవ్యాప్తంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష జరగనుంది.

## పది పరీక్షలు విద్యార్థుల జీవితాల్లో కీలక మలుపు,

### ఎమ్మెల్యే పితాని



పెనుమంట్ర, మార్చి 11, (ప్రభాతవార్త) :పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల జీవితాల్లో కీలక మలుపు అని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. బుధవారం పెనుగొండ డా బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని పరీక్షలకు సమాయత్త మైన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పెనుగొండ రామచంద్రరావు పేట మండల ప్రజా పరిషత్ స్కూల్, అంగన్వాడి సెంటర్ లను ఆయన పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ, మారెమ్మగూడెం నుండి శాంతినగర్ నగర్ వరకు 60 లక్షలతో నిర్మిస్తున్న సిసి రహదారి నిర్మాణం పనులు మారెమ్మగూడెం మండల ప్రజా పరిషత్ స్కూల్, చెరుకువాడ జడ్పీ హైస్కూల్ కోటి 20 లక్షల నిధులతో నిర్మిస్తున్న జడ్పీ హైస్కూలు, చెరుకువాడ కొన్ని డ్రైన్ పనుల నాయన పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట కూటమి నాయకులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాజీ కేంద్రమంత్రి కావూరి సాంబశివరావు మృతి తీరని లోటు



నూజివీడు, మార్చి 11 ప్రభాతవార్త: సీనియర్ రాజకీయ నాయకులు, కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు గారి మృతి పట్ల బిజెపి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం నూజివీడు పట్టణంలో కావూరికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కావూరి మృతి ఏలూరు జిల్లాతోపాటు రాష్ట్రానికే తీరనిలోటని, 2 సార్లు ఏలూరు నుంచి, 3 సార్లు మచిలీపట్నం నుంచి మొత్తంగా 5 సార్లు లోక్ సభకు ప్రాతినిధ్యం వహించిన కావూరి సాంబశివరావు రాష్ట్రానికి విశేష సేవలు అందించారన్నారు. మన్మోహన్ సింగ్ కేబినెట్‌లో కేంద్ర జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన కావూరి జౌళి రంగంలో ఆధునీకరణకు ఆయన అనేక సంస్కరణలు చేపట్టారని కొనియాడారు. అంతేకాకుండా 'కావూరి ఛారిటబుల్ ట్రస్ట్' ద్వారా విద్య, వైద్య రంగాల్లో ఆయన చేసిన సామాజిక సేవలు నేటికీ ఎంతో మందికి అండగా నిలుస్తున్నాయన్నారు. పారిశ్రామికవేత్తగా, సీనియర్ రాజకీయ నాయకునిగా ఎన్నో సేవలు అందించిన కావూరి సాంబశివరావు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు

### డీఈవో ఇ. వి.వీ.ఎస్.ఎస్.బి.ఎల్. నారాయణ



కాళ్ళ, మార్చి 11 (ప్రభాతవార్త) :విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు ప్రభుత్వ బడుల్లోనే జరుగుతుందని లభిస్తుందని పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఇ.వి.వీ.ఎస్.ఎస్.బి.ఎల్. నారాయణ అన్నారు. మండలంలోని పెదఅమిరంలో యూ.టీ.ఎఫ్. మండల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పిద్దాం - మన ఊరి బడిని కాపాడుకుందాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న చక్కని సౌకర్యాలు విద్యార్థులకు ఇస్తున్న నాణ్యమైన కిట్ తో పాటు అనుభవం కలిగిన ఉపాధ్యాయుల గురించి తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. మండల విద్యాశాఖాధికారి డి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాఠశాల పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. మండలంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ఎస్.విజయరామరాజు మాట్లాడుతూ హక్కులు బాధ్యతలు రెండు నేత్రాలుగా ఏర్పడ్డ యు.టి.ఎఫ్.హక్కుల కోసం పోరాటంతో పాటు తమ బాధ్యతల పట్ల కూడా అంతే అంకితభావంతో ఉంటుందన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ప్రసన్న భారతి ప్రభుత్వ అనుమతి లేని అనేకమైన పాఠశాలలో ఉన్నాయని డీఈవో దృష్టికి తీసుకొని రాగా వాటిపై చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, ఉప సర్పంచ్ జవ్వాది కిషోర్, రైల్వే బోర్డు నెంబర్ కోరా రామ్మూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ఎస్.విజయరామరాజు, పి. క్రాంతి కుమార్, కార్యదర్శిలు జి. రామ కృష్ణంరాజు, సిహెచ్ కుమార్ బాబ్జి, కాళ్ళ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.రాజమౌళి కోటేశ్వర స్వామి, ఎం.శంకర్, నాయకులు పి. ఆరోగ్యం, బి.కిషోర్,పి. విజయకుమార్, పిఎస్ విష్ణు ప్రసాద్, కె.రవిచంద్రకుమార్, ఎన్. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి పెద్ద పీట

### 58 మందికి రూ. 33.70 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేసిన ఆరిమిల్లి



తణుకు, మార్చి 11 (ప్రభాత వార్త): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజారోగ్యానికి పెద్దపీట వేసినట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. తణుకు ప్రభుత్వ ఆసుపత్రి త పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని సదుపాయాలు కల్పించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తణుకు నియోజకవర్గం లోని 58 మంది లబ్ధిదారులకు రూ. 33.70 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బుధవారం అందజేసిన ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో కూటమి అధికారంలోకి వచ్చిన 20 నెలలు కాలంలోనే 919 మందికి దాదాపు రూ. 7 కోట్లు మేర సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందించడం జరిగిందని అన్నారు. సొంత ఖర్చులతో వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయించి వారిని ఆదుకుంటున్నారని చెప్పారు. తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రంలో 15 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. చంటి దంత వైద్యానికి సంబంధించి ప్రత్యేక విభాగాలు ఉన్నాయని తెలిపారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న అన్ని విభాగాలకు సంబంధించి మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరూ వైద్య పరంగా ఇబ్బందులు పడకూడదని, ఆర్థికంగా నష్టపోకూడదని ప్రభుత్వం చర్యలు తీసుకుంటూ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బి

## మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

లింగపాలెం మండలం మార్చి 11 (ప్రభాతవార్త) :లింగపాలెంలోని ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ తనిఖీలో రూ55 వేలు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలోని 2004 2005 సంవత్సరంలో జరిగిన 20 కోట్ల రూపాయల పనులపై తనిఖీ నిర్వహించారు. దుర్వినియోగం అయిన నిధులు క్షేత్ర సాయి టెక్నికల్ అసిస్టెంట్, ఏపీవో చెల్లించాలని అధికారులు తెలిపారు. మండలంలో జరిగే పనులు నిర్వహించారు 2027- 26 సంవత్సరాలు వి దుదప్లైన పనులపై సిబ్బంది శ్రద్ధ చూపాలని తెలిపారు ఎస్ఆర్పిఎస్ సత్యనారాయణ తిరుపతిరావు, డ్వామా విజిలెన్స్ అధికారి శ్రీనివాసరావు. ఏపీడి విచారణ అధికారి. అశీబుడ్స్ పర్సన్. మహబూబ్ బాషా.



ఎంపీడీవో వాణి ఏపీవో వరలక్ష్మి టెక్నికల్ అసిస్టెంట్ ఎఫ్ఏలు సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ పి వి వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలి

### పోలవరం ఎమ్మెల్యే చిర్రి

జీలుగుమిల్లి, మార్చి 11, (ప్రభాతవార్త) మహిళలు, బాలికల్లో సంక్రమించే గర్భాశయ క్యాన్సర్ నిరోధానికి హెచ్ పి వి వ్యాక్సిన్ ను విధిగా వేయించుకోవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రం జీలుగుమిల్లి ప్రభుత్వాసుపత్రిలో హెచ్ పి వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ క్యాన్సర్ నివారించేందుకు కూటమి ప్రభుత్వం హెచ్ పి వి వ్యాక్సిన్ వేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశంలో 79 వేల కేసులు ఉండగా, ఇప్పటివరకు ఈ క్యాన్సర్ ద్వారా 34,000 మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాక్సిన్ ప్రైవేట్ గా కొనుగోలు చేస్తే చాలా ఖరీదని, ప్రభుత్వం దీనిని ఉచితంగా అందిస్తుందని అన్నారు. మండలంలో 81 మందికి ఈ వ్యాక్సిన్ వేసేందుకు గుర్తించామని,



ప్రస్తుతం 41 డోసులు బాలికలకు వేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీసీల్దార్ వెంకటేశ్వరరావు, కె ఆర్ పురం డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ సురేష్, ఎంపీడీవో వెంకటలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, నా లి శ్రీను, గుడెల్లి లక్ష్మీనారాయణ, పి ఎ సిఎస్ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ రాజు, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖలో ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సన్మానం

జీలుగుమిల్లి, మార్చి 11, (ప్రభాతవార్త) :మండల కేంద్రం జీలుగుమిల్లి విద్యుత్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద బుధవారం లైన్‌మ్యాన్ దివస్ సందర్భంగా విద్యుత్ శాఖలో ఉత్తమ సేవా పురస్కారం పొందిన సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (రి.నం.1104) జంగారెడ్డిగూడెం డివిజన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కుక్కునూరు, వేలేరుపాడు సెక్షన్లలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం కృషి చేసిన లైన్‌మ్యాన్ తగరం వెంకటరత్నం, జూనియర్ లైన్‌మ్యాన్లు కె. సంకురు, కె. అనురామ్, కె. ముఖేష్, కె. రామచంద్రరావులను డివిజన్ అధ్యక్షుడు మడకం రాంబాబు, కార్యదర్శి సీహెచ్ రాజు, సహాయ కార్యదర్శి వై.వి. భాస్కర్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు వి. జగన్ మోహన్ రావు సన్మానించారు. ఈ సందర్భంగా ఏజెన్సీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను



ప్రస్తావించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ లేని ప్రాంతాల్లో మొబైల్ అప్లికేషన్ ద్వారా లైన్ క్లియర్ తీసుకోవాల్సి రావడం వల్ల విధుల్లో జాప్యం జరుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మీకు కావాలంటే దీనిని ఇంకా పత్రికా శైలిలో కొంచెం కుదించి లేదా హెడ్‌లైన్‌లతో కూడా తయారు చేసి ఇవ్వగలను.

## టెన్త్ పరీక్షలకు 580 మంది

అత్తిలి, మార్చి 11( ప్రభాతవార్త )అత్తిలి మండలంలో ఈనెల 16 నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలకు 580 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు మండల విద్యాధికారులు ఎన్ రమేష్, ఎం వి ఎల్ కె ప్రసాద్ తెలిపారు. మండలంలోని 11 ప్రభుత్వ,జిల్లా పరిషత్ పాఠశాలల నుండి 449 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 4 ప్రైవేట్ పాఠశాలల నుండి 131 మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. 10వ తరగతి పరీక్షల నిమిత్తం ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్తిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,బాలికల ఉన్నత పాఠశాల,బల్లిపాడు, ఆరవల్లి, కొమ్మర ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లను,డిపార్ట్మెంట్ ఆఫీసర్లు నియామకం జరిగినట్లు తెలిపారు.

## ఏలూరు మాజీ ఎంపీ కావూరి ఇకలేరు: చింతలపూడితో వీడని అనుబంధం

కామవరపుకోట, మార్చి 11(ప్రభాత వార్త): ఏలూరు బిజెపి పార్టీ సీనియర్ నేత కావూరి.సాంబశివరావు చికిత్స పొందుతూ కన్నుమూశారు. గత కొంతకాలంగా రాజకీయ వర్గాల్లో విషాదం నెలకొంది.చింతలపూడి హైదరాబాద్‌లోని కావూరి నివాసానికి వెళ్ళి ఆయన లర్పించారు. ఈ సందర్భంగా కావూరితో తనకున్న గుర్తుచేసుకున్నారు.చింతలపూడి నియోజకవర్గంతో



పార్లమెంట్ మాజీ సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి, (82) బుధవారం హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి రామకృష్ణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘన నివాళు విడదీయలేని అనుబంధాన్ని మురళి రామకృష్ణ కావూరి సాంబశివరావుకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఈ ప్రాంత సాగునీటి కష్టాలను తీర్చేందుకు, చింతలపూడి ఎత్తిపోతల పథకం సాధనలో ఆయన కీలక పాత్ర పోషించారు. మెరక ప్రాంత రైతాంగం ప్రయోజనాల కోసం నిరంతరం తపించేవారని, స్థానిక నేతలతో ఆయనకు ఆత్మీయ సంబంధాలు ఉండేవని ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు గుర్తు చేసుకున్నారు.చింతలపూడిని తన సొంత గడ్డలా భావిస్తూ, ఇక్కడి కార్యకర్తలకు ఆయన ఎప్పుడూ కొండంత అండగా ఉండేవారు.కావూరి సాంబశివరావు సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఐదుసార్లు లోక్‌సభ సభ్యునిగా ఎన్నికై రికార్డు సృష్టించారు. 1984, 1989, 1998లలో మచిలీపట్నం నుండి.. 2004, 2009లలో ఏలూరు పార్లమెంట్ నుండి ఆయన ఘన విజయం సాధించారు. యూపీఏ-2 ప్రభుత్వంలో కేంద్ర జౌళి శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి జాతీయ స్థాయిలో తన ముద్ర వేశారు.రాజకీయ నేతగానే కాకుండా, ఇంజనీర్‌గా, పారిశ్రామికవేత్తగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు రాజకీయ నేతలు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.


## కళాశాల పాలకవర్గ సభ్యుని మృతికి సంతాపం

అత్తిలి, మార్చి 11 (ప్రభాత వార్త) అత్తిలి ఎస్ వి ఎస్ ఎస్ డిగ్రీ కళాశాల పాలకవర్గ సభ్యుడు బసవ అర్జునరావు మృతి పట్ల కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు దాసం గోవిందరావు, కార్యదర్శి మద్దాల వెంకటేశ్వరరావు సంతాపాన్ని వెలిబుచ్చారు. అర్జునరావు కళాశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని నివాళులర్పించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.వి. రమణమూర్తి,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి. శ్రీరాం శర్మ, అధ్యాపకులు, పాలకవర్గ సభ్యులు సంతాపాన్ని తెలిపారు.



## చిన్న వెంకన్న ఆలయంలో హుండీ లెక్కింపులో బంగారం అపహరణ యత్నం

ద్వారకాతిరుమల మార్చి 11 ( ప్రభాతవార్త): ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని చిన్న వెంకన్న ఆలయంలో హుండీ లెక్కింపు సమయంలో బంగారం అపహరించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఆలయ సిబ్బంది అప్రమత్తతతో పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తణుకు శివారు గ్రామమైన సూరంపూడికి చెందిన సురేష్ అనే వ్యక్తి హుండీ లెక్కింపు కార్యక్రమంలో సేవకుడిగా పాల్గొంటూ దాదాపు 59 గ్రాముల బంగారాన్ని అపహరించేందుకు ప్రయత్నించినట్టు సమాచారం పూర్తి విషయాలు తెలియాల్సి ఉంది .అయితే అతని ప్రవర్తనపై అనుమానం కలిగిన సిబ్బంది మరియు తోటి సేవకుడు అతని కదలికలను గమనిస్తూ ఉండగా, చివరకు అతడిని పట్టుకున్నారు. సమాచారం ప్రకారం, ఇదే వ్యక్తి గతంలో కూడా కొన్ని దేవాలయాల్లో హుండీ లెక్కింపు కార్యక్రమాల్లో సేవకుడిగా పాల్గొన్నప్పటికీ, అక్కడ కూడా అతని ప్రవర్తనపై అనుమానాలు వ్యక్తమై మందలించిన ఘటనలు ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటనపై ఆలయ ఈవో వై. భద్రాద్రి మాట్లాడుతూ, నిందితుడిపై ముందే అనుమానం ఉన్న నేపథ్యంలో సిబ్బంది ప్రత్యేకంగా పరిశీలించారని తెలిపారు. చివరకు అతడు బంగారం అపహరించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పట్టుబడినట్టు చెప్పారు. అనంతరం భీమడోలు సీఐ పి. కృష్ణకు సమాచారం అందించామని, ఆయన సి సి ఫుటేజ్ పరీక్షించి తగు విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని వెల్లడించారు. అయితే ఇక్కడ కొంతవరకు



భద్రత లోపం కూడా ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు మరింత భద్రతపై దృష్టి సారించాలని భక్తులు, స్థానికులు అంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఎండోమెంట్ డిపార్ట్మెంట్ మరింత కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హుండీ లెక్కింపు కార్యక్రమాల్లో పాల్గొనే సేవకుల వివరాలను సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ముందుగానే పరిశీలించే విధానాన్ని అమలు చేయాలని సూచిస్తున్నారు. సందేహాస్పద వ్యక్తుల వివరాలను ప్రత్యేక డిజిటల్ డేటాబేస్ లేదా వెబ్‌సైట్‌లో నమోదు చేసి, ఆలయాల్లో సేవకులుగా చేరే సమయంలో వారి వివరాలను మ్యాచ్ చేసే విధానం అమలు చేస్తే అనుమానితులను ముందుగానే గుర్తించి అవకాశాలు ఇవ్వకుండా నిలువరించవచ్చని భావిస్తున్నారు. ఈ విధమైన సాంకేతిక చర్యలు అమలు చేస్తే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలను అడ్డుకోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో కావూరికి నివాళులు

నూజివీడు/చాట్రాయి,మార్చి11, ప్రభాతవార్త : మాజీ కేంద్రమంత్రి, బిజెపి జాతీయ నాయకులు కావూరి సాంబశివరావు కు నూజివీడు పట్టణ బిజెపి అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నివాళులు అర్పించారు. బుధవారం స్థానిక చిన్నగాంధీ బొమ్మ సెంటర్ లో కావూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతు పెద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికీ కావూరి సాంబశివరావు చేసిన కృషిని కొనియాడారు. కావూరి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. రెండు నిముషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బోను అప్పారావు, శివరాజు వసుందగారాదేవి, బిజెపి సీనియర్ నాయకులు మల్లెపూడి రాజశేఖర్,కొండయ్య సత్రం చైర్మన్ మాటూరి ప్రసాద్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాగంటి వాసు మాస్టారు,గోగినేని అప్పారావు,దోసపాటి భాస్కరరావు, ఆచార్య రంగారావు, డాక్టర్ రామారావు,జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మానూరు పద్మావతి, జిల్లా దళిత మోర్చా ఉపాధ్యక్షులు టి. రాజేంద్రప్రసాద్, జిల్లా మీడియా సెల్ కో కన్వీనర్ మానూరు ప్రసాద్,పార్టీ నాయకులు రెడ్డి



మురళీమోహనరావు, అంబటి మల్లేశ్వరరావు,యోగ కుమార్,పట్టణ ప్రధాన కార్యదర్శులు దోసపాటి జగదీష్, దద్దనాల రవికిషోర్, కార్యదర్శి చాట్రాతి సూర్య ప్రకాష్,వరాఠి బాలు,మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ, గుత్తి రాము తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి లో మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో కావూరి సాంబశివరావు మృతి కి నివాళులు అర్పిచారు. బిజెపి గొప్ప నాయకుడుని కోల్పోయిందని ఏలూరు జిల్లా దళిత మోర్చా అధ్యక్షులు బుర్రి శ్రీకర్ అన్నారు. బడుగు బలహీన వర్గాల కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అని బిజెపి సీనియర్ నాయకులు గడ్డం సంజీవరెడ్డి, మండల బిజెపి అధ్యక్షులు ఓబిళ్ళనేని రాజా తదితరులు శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.

## జోరుమీదున్న మట్టి తవ్వకాలు

- తగ్గేదే లేదు అన్నట్లు ఇష్టానుసారంగా బరితెగింపు
- కట్టడి చేయలేని అధికారులు

వేలేరుపాడు, మార్చి 11 ( ప్రభాత వార్త ) : వేలేరుపాడు మండలంలో రోజురోజుకు మట్టి తవ్వకాలు అధికమవుతున్నాయి.ఇష్టానుసారంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్కడబడితే అక్కడ తవ్వకాలు సాగిస్తున్నారు.ఎటువంటి భయభక్తులు లేకుండా పట్టపగలే అధికారులు ఉన్నారనే కనీస భయం కూడా లేకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. ఒక జెసిబి 10ట్రాక్టర్లతో ఇష్టానుసారంగా తోలేస్తున్నారు.మండలంలో ఎక్కడ చూసినా ఇటువంటి తవ్వకాలే కనిపిస్తున్నాయి.పచ్చని పకృతి వనరులకు గండి కొడుతున్నారు. కొన్ని మట్టి రోడ్లు వాహనాల రాకపోకల వలన ధ్వంసం అవుతున్నాయి.ఇదేంటి అని ప్రశ్నించిన ప్రజల పైన గొడవలకు దిగుతూ వారి పైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. కష్టపడకుండా అప్పనంగా వచ్చినటువంటి మట్టిని ఆమ్ముకుని కొంతమంది అక్రమార్కులు సొమ్ము



చేసుకుంటున్నారు.శివకాశీపురం భూదేవిపేట ఎర్రబోరుతో పాటు మరికొన్ని గ్రామాలలో యదేచ్ఛగా తవ్వకాలు జరుగుతున్నాయి.నిబంధనకు విరుద్ధంగా తవ్వకాలు జరిపే అక్రమార్కులపై చర్యలు తీసుకోని భవిష్యత్తులో ఎటువంటి తవ్వకాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు .

## నూజివీడు మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు మారనుందా?

### - రాష్ట్రస్థాయిలో కసరత్తు - అందుకే జాప్యం అంటున్న నేతలు


ప్రభాతవార్త చాట్రాయి : నూజివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరు మారనునట్లు వినపడుతోంది. సుమారు ఆరు మాసాలకి నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కుంపటి అరుణను చైర్మన్ గా ఎంపిక చేస్తూ స్వయంగా రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మాత్యులు కొలుసు పార్థసారథి ప్రకటించారు. అయితే ఆరు మాసాల నుండి ప్రభుత్వం నుండి ఉత్తర్వులు రాకపోవడంతో ఎదురుచూపులతో సరిపోయింది. దీనిపై గత నెల రోజుల నుండి చైర్మన్ పేరును మార్చే ఆలోచనలో ఉన్నట్లు వినపడుతోంది. మంత్రి పార్థసారథి అభ్యర్థిపై సుముఖత లేనట్టు తెలుస్తుండగా బిజెపి అధినాయకత్వం కూడా అభ్యర్థిని మార్చేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. నూజివీడు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్సీ మహిళకు కేటాయించటంతో పాటు బిజెపికి ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్న విషయం అందరికీ తెలిసిందే. అందులో భాగంగా కుంపటి అరుణ పేరును ఖరారు చేయగా ప్రస్తుతం ఆ ఆ పేరును మార్చి నూజివీడు నియోజకవర్గం లో బలమైన ఎస్సీ మహిళ కోసం బిజెపి అన్వేషణ చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీనిపై బిజెపి రాష్ట్ర నాయకత్వం కూడా పూర్తిస్థాయిలో నూజివీడు నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. పార్టీకి బలం చేకూర్చే విధంగా ఎవరైతే కష్టపడి పని చేస్తారో వారికి ఆ పదవి కట్టబెడితే నియోజకవర్గంలో పార్టీ బలపడేందుకు అవకాశాలు ఉన్నాయని బిజెపి అధిష్టానం యోచిస్తున్నట్లు సమాచారం. ఏది ఏమైనా గత ఆరు మాసాల నుండి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కసరత్తు కొనసాగడంపై అటు బిజెపిలోనే కాకుండా కూటమి నేతలలో కూడా కలవరం కల్పిస్తోంది. కొత్త అభ్యర్థి ఎవరనేది



త్వరలోనే ప్రకటించేందుకు పూర్తిస్థాయి కసరత్తు జరుగుతోంది.

## రైల్వే అధికారుల నిర్లక్ష్యం...

భీమవరం మర్చి 11 ప్రభాతవార్త :రైల్వే అధికారుల అలసత్వమో లేక నిర్లక్షమో ప్రయాణికులకు ప్రాణాలు మీదకు తేస్తుంది. భీమవరం బైపాస్ రోడ్డు లో ఉన్న రైల్వే గేటు వద్ద రైల్వే పనుల నిమిత్తం తవ్విన గొయ్యి పూడ్చకుండావదిలేయడంతో ఈ రహదారి లో ప్రయాణించేవారు ప్రమాదవశాత్తు గోతిలో పడి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. రాత్రి సమయంలో అయితే చాలామంది ఈగోతిలోపడి గాయాలు పాలవుతున్నారని ప్రజలు వాపోతున్నారు.ఇప్పటికయినా అధికారులు స్పందించి ఈగోతిని వేంటనే పూడ్చి ప్రయాణికులను ప్రమాదాలు బారినుండి కాపాడాలని కోరుతున్నారు.



## కావూరి సాంబశివరావు మృతి పట్ల కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం.

భీమవరం మర్చి 11 ప్రభాతవార్త : కావూరి సాంబశివరావు గారు 5 సార్లు ఎంపీగా, కేంద్రమంత్రిగా ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన ధీశాలి. పార్లమెంటులో ప్రజా సమస్యలపై నిరంతరం గళం వినిపించిన గొప్ప నాయకుడు కావూరి అని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఆయన మృతి కి తీవ్ర సంతాపాన్ని వ్యక్తంచేస్తూ కావురి సమర్థతను గుర్తు చేశారు. 2014లో నేను బీజేపీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, ప్రధాని మోదీ గారి సమక్షంలో కావూరి గారు పార్టీలో చేరడం మరువలేనిదన్నారు.బీజేపీ పార్టీ పటిష్టత కోసం కావూరి చేసిన కృషి చిరస్మరణీయంఅన్నారు. కావూరి సాంబశివరావు మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, ముఖ్యంగా బీజేపీ కుటుంబానికి తీరని లోటని చెప్పారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ అన్నారు.

## ఉగాది పురస్కారాల వేడుకల బ్రోచర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం మర్చి 11 ప్రభాతవార్త : మన సంస్కృతి సంప్రదాయాలు చాలా గొప్పవని, విదేశాల్లో కూడా మన సంస్కృతిని ఆదరిస్తారని, ఉగాది మన తెలుగు వారి పండుగ అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, ఉగాది వేడుకల కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్న ఉగాది పురస్కారాల వేడుకల బ్రోచర్ ను బుధవారం భీమవరంలోని వారి కార్యాలయంలో ఎమ్మెల్యే అంజిబాబు ఆవిష్కరించారు.అన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు పండుగలని, గత 40 ఏళ్లుగా భావితరాలకు తెలియజేస్తూ ఉగాది వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కమిటి కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అధ్యక్షులు కంతేటి వెంకటరాజు, ఉపాధ్యక్షులు అరసవల్లి సుబ్రమణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు



మాట్లాడుతూ ఈనెల 19వ తేదీన భీమవరం శ్రీభీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు, వివిధ ప్రతిభ వంతులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కే పద్మ, కారుమూరి సుబ్బారావు, కే వెంకటేశ్వరరావు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడు మృతి

చాట్రాయి, మార్చి 11, ప్రభాతవార్త
మండల కేంద్రమైన చాట్రాయిలో చెరువులో పడి యువకుడు మృతి చెందిన విషాద సంఘటన బుధవారం చోటుచేసుకుంది. చాట్రాయి గ్రామానికి చెందిన అంబటి గోపి కుమారుడు అనుదీప్ (17) చాట్రాయి దీప చెరువులో పడి మృతి చెందాడు. దీంతో చాట్రాయిలో విషాదఛాయలు నెలకొన్నాయి. కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.



## ఘనంగా మహిళా దినోత్సవం



చాట్రాయి, మార్చి 11 ప్రభాతవార్త మండలంలోని చనుబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మహిళా దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు యం రవీంద్రనాథ్ మాట్లాడుతూ మహిళలు లేని సమాజం ఊహించటం కష్టం అన్నారు. మహిళలు లేని ఇల్లు బోసిపోతుందని ఎంత సంపాదన ఉన్నా మహిళలు లేని ఇంటికి రావడానికి ఎవరు ఇష్టపడరు అని చెప్పారు. మహిళలు సాధికారిత ఆర్థిక సమానత్వం సాధిస్తేనే చేకూరుతుందని అందుకు మహిళలు ఉన్నత విద్యావంతులు కావాలని అన్నారు. ఈనాటి ప్రభుత్వాలు మహిళల ఉన్నతికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని వాటిని అందిపుచ్చుకొని విజేతలు గా నిలవాలని కోరారు. పాఠశాల ఫస్ట్ అసిస్టెంట్ ఆర్ వి ఎస్ శోభన్ బాబు మాట్లాడుతూ బాల్యంలో విద్యార్థిని విద్యార్థులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా బాల్యం నుంచే క్రమశిక్షణగా ఉండి బాగా చదివి తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలని కోరారు.అనంతరం పాఠశాల మహిళా ఉపాధ్యాయునులు .వి. లీలా కుమారి, డి నాగమణి, డి సుజాత, జి కుమారి, దుర్గా భవాని, లంకేశ్వరమ్మ లను ఘనంగా శాలువా, పండ్లు, పసుపు కుంకుమలు కానుకలుగా ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పి వీరకోటి., హెచ్ రవి, పాకాల రత్తయ్య, ఎం రాజు, పీ నరేంద్ర పాల్గొన్నారు.

## ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయండి

### -ఎంఈఓ 1 శ్రీనివాస్




చాట్రాయి, మార్చి 11, ప్రభాతవార్ పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 16 నుండి జరగనున్నందున విద్యార్థులందరు ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించి చాట్రాయి మండలంను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలని మండల విద్యాశాఖ అధికారి 1 మాసగిరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం మర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు, మానసిక ఒత్తిడిని ఎలా జయించి పరీక్షలలో విజయం ఎలా సాదించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఇష్టపడి చదివితే విజయం మనకు దాసోహం అవుతుంది అని, తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలు నెరవేర్చి పాస్ సర్టిఫికెట్స్ వారి చేతిలో పెడితే వారి ఆనందానికి అవధులు ఉండవని విద్యార్థులకు హితవు చెప్పారు. అనంతరం డొక్కా సీతమ్మ మద్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమం లో రఘు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగడవరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం




చింతలపూడి.. ప్రభాత వార్త : చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా కొత్త చట్టాలు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో దొంగతనాలు నిరోధించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చింతలపూడి సర్కిల్ ఇన్స్పెక్టర్ టీ.క్రాంతికుమార్ సూచించారు.ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో నేరాలు అదుపులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండి, హెల్మెట్ ధరించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురికాకుండా అందరూ జాగ్రత్తలు పాటించాలని కోరారు.ఎస్సై సతీష్ కుమార్ మాట్లాడుతూ.గ్రామంలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి గ్రామస్తుల సహకారం అవసరమని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారికి అపరాధ రుసుము వేయకుండా హెల్మెట్లు కోని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పద్దెనిమిది సంవత్సరాలు నిండని బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే 8 సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు.

## 50 పరీక్ష ప్యాడ్స్ తో మహా గణపతికి అలంకరణ



భీమవరం మర్చి 11 ప్రభాతవార్త : భీమవరం గునుపూడిలోని సిద్ధి బుద్ధి మహా గణపతి స్వామివారికి పరీక్ష ప్యాడ్స్ తో అలంకరణ చేశారు. బుధవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ చెరుకుపల్లి సంతోష్ సౌజన్యంతో 50 పరీక్ష ప్యాడ్స్ లతో ఆలయ అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. రెండు రోజులపాటు పదో తరగతి విద్యార్థులకు ఈ ప్యాడ్స్ ను అందిస్తామని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.